31-10Pg1exHMNWJQE 1 GNT_31-10Pg1exHMNWJQE.qxd 31/Oct/25 12:33 AM Page 1

సాహితీ
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-10-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 269 పేజీలు: 12 వెల: 6.50



మహిళల వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌కు టీమిండియా



## సుప్రీం కొత్త సిజెగా జస్టిస్ సూర్యకాంత్

### రాష్ట్రపతి ముర్ము ఆమోదం

### నవంబరు 24న బాధ్యతల స్వీకరణ

**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. ప్రస్తుత చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ నవంబరు 23న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలోనే ఈ నియామకం జరిగింది. కొత్త సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ నవంబరు 24న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈమేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ విషయాన్ని కేంద న్యాయ >>2




## ట్రంప్‌తో జిన్‌పింగ్ సుదీర్ఘ చర్చలు

### చైనాపై సుంకాలు 10శాతం తగ్గింపు

### ఇరుదేశాల మధ్య పలు కీలక ఒప్పందాలు

**బుసాన్(దక్షిణకొరియా), అక్టోబరు 30:** దక్షిణ కొరియాలోని బుసాన్ వేదికగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటలపాటు సాగిన చర్చల్లో పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. సమావేశం అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ... చైనాపై టారిఫ్ లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. "జిన్‌పింగ్‌తో సమావేశం అద్భుతంగా జరిగింది. ఫెంటనిల్ తయారీలో వాడే ముడి పదార్థాల రవాణాను అరికట్టేందుకు చైనా అధ్యక్షుడు కట్టుబడి ఉన్నారు. ఆ నమ్మకంతోనే చైనాపై ఉన్న 20 శాతం ఫెంటనిల్ టారిఫ్‌లను 10 శాతానికి తగ్గిస్తున్నా"అని ఆయన తెలిపారు. దీంతో చైనాపై ఉన్న సుంకాలు 57 శాతం నుంచి 47 శాతానికి తగ్గనున్నాయని ట్రంప్ వివరించారు. అదే సమయంలో అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా వెంటనే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరిందని ట్రంప్ తెలిపారు. ఇది అమెరికా రైతులకు పెద్ద ఊరట కలిగించే అంశమని ఆయన అభిప్రాయ పడ్డారు. ఇరు దేశాల మధ్య రేర్‌ఎర్త్ >>2

## 'పోక్సో' కేసులో 20 యేళ్ల జైలు



నిందితుడు నరేంద్రరెడ్డి

**చిత్తూరు, అక్టోబరు 30 ప్రభాతవార్త:** మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని మోసం చేసి పలుమార్లు అత్యాచారంచేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు 10వేల రూపాయల జరిమానాను విధిస్తూ గురువారం చిత్తూరు ఫోక్సో కోర్టు తీర్పువెలువరించింది. పిటిఎం మండలం మద్దయ్యగారిపల్లికి చెందిన పూలా నరేంద్ర రెడ్డి(31) పిటిఎం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ మైనర్ బాలికతో పరిచయం పెంచుకుని తాను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించాడు. 29 నవంబరు 2023 కంటే ముందే పూలా నరేంద్రరెడ్డి మైనర్ బాలికపై పలుమార్లు లైంగికంగా దాడిచేశాడు. ఆపై పూలా నరేంద్రరెడ్డి మైనర్ బాలికను పెళ్లి చేసుకోవడం కాదని తేల్చి చెప్పడంతో ఆ మైనర్ బాలిక తాను మోసపోయానని గ్రహించి తండ్రితో కలిసి పిటిఎం పోలీస్ స్టేషన్‌కు వచ్చి 29 నవంబర్ 2023న ఫిర్యాదు చేసింది. అప్పట్లో మదనపల్లి డిఎస్పీ >>2

## కేబినెట్ సమావేశం వాయిదా

2లో

# రూ. 5,265 కోట్ల నష్టం

### ● ప్రాథమిక అంచనాయే ఇంత అధికం.. ● మొంథా తుఫాన్ వల్ల వివిధ రంగాల నష్టాన్ని వివరించిన సిఎం చంద్రబాబు ● టెక్నాలజీ సాయంతో ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించాం ● శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా తుఫాన్‌ను అంచనా వేశాం ● మొదటి రోజునే పరిస్థితిని చక్కదిద్దాం: సిఎం చంద్రబాబు



**విజయవాడ,అక్టోబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుపాను ప్రాథమిక నష్టం అంచనా దాదాపు రూ.5265 కోట్లు అని సిఎం చంద్రబాబు వెల్లడించారు. పూర్తి స్థాయి నష్టం అంచనాలను త్వరితగతిన సిద్ధం చేసి కేంద్రానికి పంపుతామని తెలిపారు. పటిష్ఠమైన సమాచార సాంకేతిక వ్యవస్థను 16 నెలల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. నీళ్లు ఎక్కడా నిల్వ లేకుండా డ్రైన్స్‌లోకి పంపగలిగామని తెలిపారు. ఎక్కడ నీరు నిలిచినా డ్రోన్లు, సిసి టీవీల ద్వారా గుర్తించి తొలగించగలిగామని అన్నారు. ఒకప్పుడు చెట్టు కూలితే తొలగించేందుకు రోజుల తరబడి సమయం పట్టేదని కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేకుండా గంటల వ్యవధిలోనే సమస్యను పరిష్కరిస్తున్నా మని తెలిపారు. రాష్ట్రంలో తుఫాను, అనంతర పరిస్థితులపై సిఎం చంద్రబాబు గురువారం మీడియా సమావేశంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టం (ఆర్టీజీఎస్) ద్వారా కాటమనేని భాస్కర్ బృందం కనబర్చిన పనితీరు అభినందనీయమని కొనియాడారు. మొత్తం సిబ్బంది అద్భుత పనితీరు కనబరిచారని ప్రశంసించారు. తుఫాన్ నష్ట తీవ్రత తగ్గించే అంశంపై మంత్రులు క్షేత్ర స్థాయిలో, ఆర్టీజీఎస్ నుంచి మంత్రులు లోకేష్, అనిత ఎప్పటికప్పుడు పర్యవేక్షి ంచారని వివరించారు. ఇప్పటికీ

| వివిధ రంగాలకు నష్టం | (రూ. కోట్లలో) |
|---|---|
| వ్యవసాయం | 829 |
| హార్టికల్చర్ | 39 |
| మత్స్యరంగం | 1,270 |
| ఆర్అండ్‌బీ | 2,079 |
| నీటిపారుదలశాఖ | 207 |

35 మండలాల్లో వర్షం పడలేదని 37 కరవు మండలాలు నమోదయ్యాయని సిఎం వెల్లడించారు.
నదుల అనుసంధానం జరిగితే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈతుఫాన్‌వల్ల ఎక్కువ నష్టం బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో ఉందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది అందరూ నిబద్ధతతో పని చేశారని ఇది చాలా సంతోషంగా ఉందని సిఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. వర్షాలు పడుతున్నా కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించి ఇబ్బందులు లేకుండా చేశారని కొనియాడారు. ప్రకృతి విపత్తులను ఎవరూ ఆపలేరు కానీ ముందస్తు చర్యల వల్ల నష్టాన్ని తగ్గించవచ్చుని సిఎం అన్నారు. మొంథా తుఫాన్ బీభత్సాన్ని >>2

## ప్రతి రైతును ఆదుకొంటాం

### యుద్ధ ప్రాతిపదికన పంట పరిహారం చెల్లింపు

### 1.16 లక్షల మందిని పునరావాస కేంద్రాలకు తరలించాం

### దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు

### పంట నష్టాన్ని పరిశీలించిన డి.సిఎం పవన్



**విజయవాడ, అక్టోబరు 30, ప్రభాతవార్త ప్రతినిధి:** మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.38 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని, ఇందులో ఒక్క కృష్ణా జిల్లాలోనే 46వేల హెక్టార్లలో నష్టం కలిగిందనీచెప్పారు. ఈజిల్లాలో దాదాపు 56 వేల మంది రైతులు నష్టపోయారని ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. గురువారం కృష్ణా జిల్లాలోని కోడూరులో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నేలకొరిగిన వరి పంట పొలాలను డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పరిశీలించారు. స్థానిక రైతులతో కలిసి దెబ్బ తిన్న వరి పొలాలను పరిశీలించారు. మోకాలు లోతు నీటిలో దిగి పంట నష్టాన్ని >>2

# కల్తీ నెయ్యి కేసులో భారీ కుట్ర!




### 2022లోనే కిలోకు రూ. 25 కమీషన్ డిమాండ్

### ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ఒప్పందంతో పెద్ద మొత్తంలో ముడుపులు

### సుబ్బారెడ్డి పిఎ సంచలన సమాచారం

**తిరుమల, అక్టోబరు 30, ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి సంబంధించి అవసరమైన నెయ్యిసరఫరాలో 2019వ సంవత్సరం నుండి 2024వరకు భారీగా కుట్రలు జరిగాయనేది సిబిఐ సిట్ అధికారులు నిగ్గుతేల్చారు. అప్పట్లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఉత్తరప్రదేశ్ ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీ కంపెనీ నెయ్యిసరఫరా చేసేందుకు 2022లో కూడా సిద్ధమైంది. అయితే టిటిడికి నెయ్యి సరఫరాచేసే ఆ డైరీ నుండి కిలోకు 25రూపాయలు కమీషన్ ఇవ్వాలని అప్పటి టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పిఎ)కదూరు చిన్న అప్పన్న డిమాండ్ చేశాడు. అయితే ఆ సంస్థ యాజమాన్యం నిరాకరించడంతో టిటిడి మార్కెటింగ్ కొనుగోళ్ల జిఎం మురళీకృష్ణను అప్పన్న పిలిపించుకుని నెయ్యి సరఫరా చేస్తున్న బోలేబాబాడెయిరీ యాజమాన్యంతో సంప్రదించాడు. కానీ అనుకున్న విధంగా కమీషన్‌లకు మొగ్గుచూపలేదు. దీంతో ఆ డైరీపై అనర్హత వేటువేసేలా జిఎంపై అప్పన్న ఒత్తిడి చేశాడు. అప్పన్న ఒత్తిడితో బోలేబాబా కాంట్రాక్ట్ రద్దయ్యి నెల్లూరు జిల్లాలోని ప్రీమియర్ అగ్రిపుడ్స్ యాజమాన్యం తెరపైకి వచ్చారు. దీంతో కిలో నెయ్యి సరఫరాకు 138 రూపాయలు ఎక్కువగా టెండర్ దక్కించుకుని అప్పన్నకు 50లక్షలు రూపాయలు ముడుపులుగా ఇచ్చిందని సిట్ అధికారులు ఆధారాలతో తేల్చారు. 50లక్షలు ఆయన నుండి ఎవరికి చేరిందనేది ఇప్పుడు టిటిడి వర్గాల నుండి రావాల్సిన సమాధానం. బుధవారం రాత్రి అప్పన్నను రిమాండ్‌కు పంపేముందు ఈ కీలక వాంగ్మూలం రాబట్టారని ఓ పోలీస్ అధికారి సమాచారం. ఇప్పుడు కీలకంగా కల్తీనెయ్యి సరఫరాలో భారీగా కుట్రలు జరిగాయని సిట్ కోర్టుకు సమర్పించిన ఆధారాల్లో పేర్కొంది. వ్యూహాత్మకంగా ఒక పథకం ప్రకారమే నెయ్యిసరఫరాలో కల్తీకూడా జరిగిందనేది సిట్ ఆధారాలు రాబట్టింది. ఇప్పుడు అప్పన్న నుండి రాబట్టిన సమాచారంతో త్వరలోనే టిటిడిలో కొందరు అధికారులు అరెస్టుకానున్నారనేది గుప్పుమంటోంది.
గత ఐదేళ్లలో టిటిడికి కల్తీనెయ్యి సరఫరా చేసిన పాపంలో పాత్రధారులను అరెస్ట్ చేసిన సిబిఐసిట్ తాజాగా సూత్రధారులైన రాజకీయనేతల అరెస్ట్‌కు రంగం సిద్దంచేసుకొంటోంది. ఈ కేసులో టిటిడి మాజీ ఛైర్మన్ ,రాజ్యసభసభ్యుడు వైవి సుబ్బారెడ్డిని త్వరలోనే విచారణ చేసే అవకాశం ఉంది. ఆయన పిఎను అరెస్ట్‌చేసిన సిట్ అధికారులు నెల్లూరు ఎసిబి కోర్టులో ఎ24గా ప్రవేశపెట్టారు. గురువారం ఎసిబి న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించారు. ఆ తరువాత ఇప్పుడు ఏం జరగనుందనేది ఉత్కంఠే. గత పదినెలలుగా తీవ్రస్థాయిలో దర్యాప్తు చేపట్టిన సిట్ అధికారులు టిటిడికి నెయ్యిసరఫరాకు టెండర్లలో పాల్గొన్న విధానం, ఆపై స్వచ్ఛమైన ఆవునెయ్యిసరఫరా చేయాల్సి ఉండగా పలురకాల నూనెలు కల్తీచేసి పంపడం వంటివి వెలుగుచూశాయి. టిటిడి నిబంధనలను ఉల్లంఘించి కల్తీనెయ్యి సరఫరా చేసిందని టిటిడి మార్కెటింగ్ విభాగం కొనుగోళ్ల జిఎం మురళీకృష్ణ పోలీసులకు >>2



సంగం ఆనకట్ట షట్టర్ల పైన ఆగిపోయిన ఇసుక బోటు

## సంగం బ్యారేజ్‌కు తప్పిన ముప్పు

### చాకచక్యంగా మూడో పడవను ఒడ్డుకుచేర్చిన యంత్రాగం

### కలెక్టర్, ఎస్‌పి కృషిని అభినందించిన మంత్రి లోకేష్

**సంగం (నెల్లూరు), అక్టోబరు 30, ప్రభాతవార్త :** జిల్లాకలెక్టర్ చొరవతో సంగం బ్యారేజికి పెద్ద ముప్పు తప్పింది. సంగం బ్యారేజి వద్దకు లంగరు తెగిపోయిన 30 టన్నుల బరువు వున్న ఇసుక బోటు సంగం ఆనకట్ట వద్దకు వచ్చి షట్టర్లపైన ఆగిపోయింది. అదే ఆబోటు బ్యారేజిని నీటి వేగంలో వెళ్లి ఢీకొని వుంటే బ్యారేజికి పెద్ద ప్రమాదం జరిగింది ఉండేది. స్దానికులు సంగం ఆనకట్ట షట్టర్లపై ఆగిపోయిన విషయాన్ని అధికారులకు తెలియజేయడంతో మండల స్థాయి అధికారులు వెంటనే జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకి, జిల్లా ఎస్‌పి అజితా వెజండ్లకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే స్పందించి సంగం బ్యారేజి వద్దకు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ యుద్ధప్రాతిపదికన చర్యలుతీసుకొని ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను కృష్ణపట్నం పోర్టు గస్తీబృందాన్ని రంగంలోకి దింపారు. 30 టన్నుల బోటును ఒడ్డుకు చేర్చడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా కలెక్టర్ కృషికి ప్రతి ఒక్కరు హ్యాట్సాప్ అన్నారు.

**విద్యాశాఖ మంత్రి లోకేశ్ జిల్లా కలెక్టర్‌కి అభినందనలు**

సంగం బ్యారేజి వద్ద లంగరు తెగిపోయిన 30 టన్నుల బరువున్న ఇసుక బోటు గేట్లు వరకు రాకుండా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, >>2



## ప్రకాశం బ్యారేజ్‌కి పోటెత్తిన వరద

### పరిస్థితిని పరిశీలించిన మంత్రి నిమ్మల

**విజయవాడ,అక్టోబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద నీటితో విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకు వరద పోటెత్తింది. గురువారం బ్యారేజీకు 4.20 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ఈ నేపథ్యంలో బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఉన్నతాధికారులు జారీ చేశారు. అయితే గురువారం సాయంత్రానికి బ్యారేజీ వద్ద వరద నీరు మరింత వచ్చి చేరే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ సాయంత్రానికి 6 లక్షల క్యూసెక్కులకు వరద నీరు చేరే అవకాశం ఉందని అంటున్నారు. పులిచింతల ప్రాజెక్ట్ నుంచి 4 లక్షల 90 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం కిందికి విడుదల చేశారు. మరో వైపు తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు మున్నేరు, కీసర, వైరా, కట్టలేరు ఉపనదులు పొంగి ప్రవహిస్తున్నాయి. దాంతో 2 లక్షల క్యూసెక్కుల వరద నీరు కృష్ణనదిలోకి వచ్చి చేరింది. ఇలా రెండు వైపుల నుంచి వస్తున్న వరద నీటితో ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పోటెత్తింది. ఈ వరద నీటిని కిందికి విడుదల చేసేందుకు అధికారులు సన్నాహకాలు చేస్తున్నారు. అయితే ఇప్పటికే మొంథా తుపాన్ కారణంగా.. కృష్ణనది పరివాహక ప్రాంతంలోని పలు ప్రాంతాలు వర్షపు >>2

## ఛాత్ పూజకు యునెస్కో గుర్తింపు తెస్తాం: ప్రధాని మోడీ

9లో

## ప్రతి నెల, ప్రతి నియోజకవర్గంలో ఇక జాబ్ మేళాలు

### శిక్షణ పూర్తయితే స్కిల్ టెస్టింగ్, ధ్రువపత్రాల జారీ

### నైపుణ్యాభివృద్ధిపై సమీక్షలో సిఎం చంద్రబాబు



గురువారం సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై సమీక్ష నిర్వహించిన సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి లోకేష్ తదితరులు

**విజయవాడ అక్టోబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూనే, వారి ఉన్నత విద్యకు సహకరించేలా ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే వారి కోసం రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్ ఉద్యోగాల గేట్ వేగా ఉండాలని అధికారులకు సూచించారు. 2029 కల్లా 20 లక్షలు ఉద్యోగాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇకపై ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించాలని అధికారులను సిఎం ఆదేశించారు.
నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సులోగా 'నైపుణ్యం' పోర్టల్ ప్రారంభించి, అందుబాటులోకి తీసుకురావాలని సిఎం సూచించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన వారికి ఇక నుంచి అధికారికంగా ధ్రువపత్రాలు జారీ చేయాలన్నారు. గురువారం సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి లోకేష్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. నైపుణ్యం పోర్టల్, జాబ్ డ్యాష్ బోర్డ్, వివిధ కోర్సులు, ఉద్యోగావకాశాలు తదితర అంశాల గురించి సమీక్షలో చర్చించారు.
ఈ సమావేశంలో క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ ద్వారా నైపుణ్యాలను పెంచేలా ప్రయత్నిస్తున్నామని..స్పేస్, ఆక్వా, క్వాంటం లాంటి రంగాల్లో సంస్థలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ చేపట్టినట్టు మంత్రి లోకేష్ ముఖ్యమంత్రికి తెలిపారు. దేశ విదేశాల్లో ఉద్యోగాలు ఎక్కడ లభిస్తున్నాయో అందరికీ తెలిసేలా నైపుణ్య పోర్టల్ అభివృద్ధి చేయడమే కాకుండా... నైపుణ్య కల్పనలో దేశ, విదేశాలకు చెందిన సంస్థలను సంప్రదిం చాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. విశ్వవిద్యాలయాలు, జాతీయఅంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వంనుంచి ఏలబ్ధి పొందకుండా నిరుద్యోగులుగా ఉన్నవారికి ప్రయోజనం చేకూర్చేలా నైపుణ్యం పోర్టల్ తీర్చిద్దాలన్నారు. అభ్యర్థులు ఏరంగంలో తమకు ఉద్యోగం, ఉపాధి కావాలని కోరుకుంటున్నారో... ఆ అవకాశాన్ని పొందేలే వివరాలు పోర్టల్‌లో పొందుపరచాలని >>2



## ముంబయిలో 20 మంది చిన్నారుల కిడ్నాప్ కలకలం

### పోలీస్ కాల్పుల్లో కిడ్నాపర్ హతం

**ముంబయి, అక్టోబరు 30:** దేశ ఆర్థికరాజధాని ముంబయిలో గురువారం ఒక వ్యక్తి సుమారు 20 మంది పిల్లలను స్టూడియోలో నిర్బంధించిన కిడ్నాప్ ఘటన తీవ్ర కలకలం రేపింది. తన డిమాండ్ల కోసం కొందరితో మాట్లాడాలంటూ వీడియో రిలీజ్ చేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. చివరకు పోలీస్ కాల్పుల్లో ఆ వ్యక్తి మరణించాడు. >>2

31-10pg2exHMNWJQER 2_31-10pg2exHMNWJQER.qxd 31/Oct/25 12:36 AM Page 1





గురువారం నారా రోహిత్ వివాహానికి హాజరైన సిఎం చంద్రబాబు దంపతులు

# కేబినెట్ సమావేశం వాయిదా

**విజయవాడ,అక్టోబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి కేబినెట్ సమావేశం వాయిదా పడింది. నవంబరు 7 జరుగవలసిన కేబినెట్ భేటీని నవంబరు 10వ తేదీన నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నవంబరు 10వ తేదీకి కేబినెట్ సమావేశం వాయిదా వేస్తూ సిఎస్ కార్యాలయం నోట్ విడుదల చేసింది. మంత్రివర్గ సమావేశం నిర్వహణకు సంబంధించిన మార్పులను గమనించాల్సిందిగా అన్ని శాఖల కార్యదర్శులకు సూచనలు చేసింది. విశాఖ వేదికగా జరిగే పెట్టుబడుల సదస్సుపై మంత్రివర్గం చర్చించనుంది.

## రోహిత్ పెళ్లికి హాజరైన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

**హైదరాబాద్:** గురువారం రాత్రి కుటుంబంతో కలిసి సోదరుడి కుమారుడైన నారా రోహిత్ వివాహ వేడుకకు సిఎం చంద్రబాబు దంపతులు,మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. హైదరాబాద్ అజీజ్ నగర్‌లోని ద వెన్యూ కన్వెన్షన్ లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు నారా రోహిత్, శిరీషలను ఆశీర్వదించారు.



భారీ వర్షాలకు నేలకొరిగిన బొప్పాయి చెట్లు

# 5,265 కోట్ల నష్టం

>> ముందుగానే అంచనా వేయడం వల్లే నష్టనివారణ తగ్గిందని, ఓ పద్ధతి ప్రకారం సాంకేతికతను సక్రమంగా వినియోగించామని తెలిపారు. గతంలో విద్యుత్ సరఫరా ఆగితే 10 గంటల వరకు వచ్చేది కాదు కానీ ప్రస్తుతం విద్యుత్ సరఫరా ఆగిన 3 గంటల్లోనే పునరుద్ధరణ జరిగిందని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం సాంకేతికతను ఉపయోగించి ప్రజలకు నష్టం వాటిల్లకుండా చూస్తుంటే కొందరు ఫేక్ పోస్టులు పెడుతున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడం కూడా వారికి ఇష్టం లేనట్టు ఉందని విమర్శించారు. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా పరిస్థితిని అంచనా వేశామన్నారు.గతంలో గుండ్లకమ్మ, పులిచింతలగేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని మండిపడ్డారు. కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజా ప్రతిని ధులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు భరోసా ఇచ్చారని ప్రశంసిం చారు. వారందరికీ అభినందనలు తెలిపారు. టెక్నాలజీ సాయంతో తుఫాన్ ప్రభావంతో కలిగే నష్టాన్ని తగ్గించ గలిగామన్నారు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేశాయన్నారు. మొదటి రోజునే పరిస్థితులను చాలా వరకూ చక్కదిద్దాంఅన్నారు. ఎప్పటికప్పుడు తుఫాన్‌పై సమీక్షలు నిర్వహించామన్నారు. అంతర్వేది దగ్గర తీరందాటి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయిఅన్నారు. శాటి లైట్ ఇమేజ్‌ల ఆధారంగా తుఫాన్ పరిస్థితిని అంచనా వేశామన్నారు. ప్రిపరేషన్, ముందస్తు ప్రణాళికలవల్ల ప్రకృతి వైపరీత్య నష్టాన్ని బాగా తగ్గించామని, వర్షాలు, గాలుల తీవ్రతను అంచనా వేస్తూ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసి చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో తుఫాన్ ప్రభావం తగ్గిన వారం రోజుల వరకూ కోలుకునే పరిస్థితి ఉండేది కాదు. తుఫాన్లు, వర్షాలను ఆపలేం కానీ అప్రమత్తత, ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించే అవకాశం ఉందన్నారు. తుఫాను ప్రభావం ఉన్న అన్ని ప్రాంతాల్లో టెక్నాలజీ వినియోగించి నష్టాలను తగ్గించగలిగామన్నారు. భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఎక్కడెక్కడ ప్రవాహాలు పెద్ద ఎత్తున వస్తాయి అనేది అంచనా వేసి ముందస్తుగా హెచ్చరికలు ఇచ్చామన్నారు. తుఫాన్ కారణంగా దాదాపు రూ.5,265 కోట్ల మేర నష్టం జరిగి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. వ్యవసాయం, ఉద్యాన, ఆక్వా, రహదారులు రూ.2079 కోట్లు, విద్యుత్, జలవనరుల విభాగం లో రూ.207 కోట్లు నష్టం జరిగిందన్నారు. గతంలో గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకు పోయినా పట్టించుకోలేదన్నారు. తుఫాన్ నష్టాలను పూర్తి స్థాయిలో అంచనా వేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. రియల్ టైమ్ లోనే డేటా లేక్ ద్వారా సమాచారం విశ్లేషించి త్వరగా నిర్ణయాలు తీసుకోగలిగా మన్నారు. తుపాను నష్టం తీవ్రత తగ్గించే అంశంపై మంత్రులు క్షేత్ర స్థాయిలో, ఆర్టీజీఎస్ నుంచి మంత్రి లోకేష్, అనిత ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులుకూడా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు భరోసా ఇచ్చారు. వారందరికీ అభినందనలు తెలియచేస్తున్నాను అన్నారు. టెక్నాలజీ వినియోగించి పంట నష్టాలు, ముంపు ప్రాంతాలు తదితర అంశాలను కూడా గుర్తిస్తాం. కాకినాడలో ఈ తుఫాన్ క్రాస్ చేస్తుందని అనుకున్నామని.. కానీ చివరకు నరసాపురం వద్ద తీరం దాటిందని సిఎం చంద్రబాబు వివరించారు. వారంరోజుల్లోనే పరిస్థితులను చక్కదిద్దామ న్నారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేశామని, అయితే అనుకున్న చోట కాకుండా వేరే ప్రాంతాల్లో వర్షాలు కురిశాయని వివరించారు.

# ప్రతి రైతును ఆదుకొంటాం

>> తెలుసుకున్నారు.ఇతర పంటలను, ధ్వంసమై రోడ్లు,పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆయన పరామర్శించారు.పంట నష్టంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్‌తో నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామని పవన్ కల్యాణ్ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా రైతులు పవన్‌కు తమ గోడు విన్పించారు. తడిసిన ధాన్యం,రంగు మారిన ధాన్యం,కొనుగోలు చేయాలని కోరారు.ఇటువంటి ప్రకృతి విపత్తుల సమయంలో కౌలు రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుంచి కౌలు రైతులకు సాయం అందేలా చూడాలని వేడుకున్నారు. రెండు మూడు రోజుల్లో పంట నష్టం అంచనాలు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని పవన్‌కి కలెక్టర్ బాలాజీ వివరించారు. రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం...ఎవరూ ఆందోళన చెందకూడదని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడించారు. అయితే, ముందస్తుగా తీసుకున్న చర్యలతో నష్ట నివారణ కొంత వరకు తగ్గించామని డిప్యూటీ సిఎం పవన్ తెలిపారు. ప్రతి జిల్లా కలెక్టర్,ప్రభుత్వ యంత్రాంగం బాగా పని చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలు ప్రజలకు బియ్యం ఉచితంగా ఇస్తున్నాం. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాం. ఇళ్ళకు వెళ్ళే సమయంలో కూడా ఒక్కో కుటుంబానికి మూడు వేల రూపాయలు ఇస్తున్నామని పవన్ కళ్యాణ్ అన్నారు.. మండలి బుద్ధప్రసాద్ చెప్పిన సమస్యలు పరిష్కరిస్తాం. ఆక్వా రైతులు ఇబ్బందులు నా దృష్టికి వచ్చాయి. సిఎంతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో రోడ్లు పాడైతే యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తాం. రెండు రోజుల్లో మొత్తం చెత్తను క్లీన్ చేలా వేలాది మంది సిబ్బంది పని చేస్తున్నారని పవన్‌కల్యాణ్ తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గంలో పర్యటించిన పవన్ కళ్యాణ్ మొంథా తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఆవేదన తెలుసుకున్నారు. అనంతరం కృష్ణా జిల్లా అధికారులు అవనిగడ్డలో తుపాను నష్టంపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన పరిశీలించారు. ఈసందర్భంగా పవన్ మాట్లాడుతూ 'ప్రభుత్వం ముందస్తు సన్నద్ధత మూలంగా మొంథా తుపానును సమర్థవంతంగా ఎదుర్కోగలిగాం. పక్కా ప్రణాళికతో నష్టం తీవ్రతను తగ్గించాం. సిఎం చంద్రబాబు ముందు ముందుచూపు కారణంగానే తగినన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. వీడియో కాన్ఫరెన్సులు, ఆర్టీజీఎస్ ద్వారా 24 గంటలు పరిస్థితులను పర్యవేక్షి స్తూ.. అటు యంత్రాంగాన్ని, ఇటు గ్రామ స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేశాం. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా లక్ష 16 వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశాం. ఈ విపత్తులో కౌలు రైతులు కూడా నష్టపోయిన విషయం కూడా సిఎం దృష్టికి తీసుకువెళతాను అన్నారు. తుఫాన్ అనంతర ఉపశమన చర్యలను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాం. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో సుమారు 274 కిలోమీటర్లమేర రహదారులు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. దెబ్బతిన్న అన్ని రోడ్లను శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించాం. పల్లపు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడంతోపాటు అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో సూపర్ శానిటేషన్.. సూపర్ క్లోరినేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. 1,583 గ్రామాలు తీవ్రంగా ప్రభావితం కాగా, మొత్తం 21,055 మంది సిబ్బందిని పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తున్నాం. తాగునీటి సరఫరా వ్యవస్థకు ఇబ్బంది ఏర్పటిన చోట్ల ప్రయత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం.

మొంథా ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస శిబిరాల్లో ఉన్న వారికి 25 కేజీల బియ్యాన్ని, ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం ఇవ్వాలని నిర్ణయించాం. కేజీ కందిపప్పు, లీటర్ పామాయిల్ ప్యాకెట్, కేజీ ఉల్లిపాయలు, 1 కిలో బంగాళాదుంపలు, కెజి పంచదార కూడా కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది. శిబిరాల్లో ఉన్న వారికి ఇళ్లకు వెళ్లే ముందే ఒక్కొక్కరికీ రూ. వెయ్యి చొప్పున ఇస్తున్నాం. తుపాను వల్ల సంభవించిన నష్టంపై ప్రాథమిక నివేదిక రాగానే కేంద్ర సహకారం కోరుతామన్నారు.

## జస్టిస్ సూర్యకాంత్

>> శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ గురువారం ఎక్స్‌లో పోస్టుచేశారు. జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నవంబరు 24న బాధ్యతల స్వీకరించనుండగా, 2027 ఫిబ్రవరి 9వరకు సిజెఐగా కొనసాగనున్నారు. నూతన సిజెగా నియమితులైన జస్టిస్ సూర్యకాంత్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## 20 యేళ్ల జైలు

>> ఆధ్వర్యంలో ఈకేసు దర్యాప్తుచేసి చిత్తూరు ఫోక్సో కోర్టులో చార్జిషీటుదాఖలుచేశారు. చిత్తూరు ఫోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ఎం.శంకర్‌రావు ఈ కేసు విచారణ పూర్తి చేసి గురువారం తీర్పు వెల్లడించారు. ఈకేసుకు సంబంధించి నిందితుడు పూలా నరేంద్రరెడ్డిపై నేరారోపణ నిజం కావడంతో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 10 వేల రూపాయల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి ఒక లక్ష రూపాయల నష్టపరిహారం ప్రభుత్వం తరపున చెల్లించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది.

# సిఎం దార్శనికతతో తప్పిన ముప్పు

**విజయవాడ,అక్టోబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత మరోసారి నిజమైందని సిఎంవో వర్గాలు వెల్లడించాయి.ఆయన ఎంతో సమయస్ఫూర్తితో అమలులోకి తీసుకుని వచ్చిన టెక్నాలజీ సహాయంతో పెను ప్రమాదాలు తప్పాయి. విపత్తుల నిర్వహణలో డ్రోన్ల వినియోగం కీలకంగా మారింది. అధికార యంత్రాంగం బాధ్యతగా పనిచేస్తుంది. కృష్ణా నదిలో ఎగువ నుంచి కొట్టుకుని వస్తున్న బోటును గుర్తించి విపత్తుల నిర్వహణ సంస్థలోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన స్పందించిన విపత్తుల నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపక్ స్వయంగా ఎస్‌డిఆర్‌ఎఫ్ డ్రోన్ల బృందంతో సమన్వయం చేసుకుని పర్యవేక్షి ంచారు.

డ్రోన్లతో తుమ్మలపాలెం వద్ద బోటుని గుర్తించి ఎస్‌డిఆర్‌ఎఫ్, గజ ఈతగాళ్ల సహాయంతో బోటును ఒడ్డుకు చేర్చి ప్రమాదం తప్పించారు. కృష్ణా నది వరద ఉధృతిలో ప్రకాశం బ్యారేజి గేట్ల దగ్గరకు వచ్చి ఉంటే పెనుముప్పు సంభవించేది.గత సంవత్సరం బుడమేరు వరదల్లో ప్రకాశం బ్యారేజి గేటులో చిక్కుకున్న బోటు తీయడానికి ఎనిమిది రోజులపాటు, అధికార యంత్రాంగం పడిన శ్రమ గుర్తు చేసుకున్నారు.

# రాష్ట్ర అధికారిక కార్యక్రమంగా భక్త కనకదాస జయంతి: మంత్రి సవిత

**విజయవాడ,అక్టోబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** భక్త కనకదాస జయంతిని రాష్ట్ర అధికారిక కార్యక్రమంగా నిర్వహిస్తామని, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు రెండు రోజుల్లో జారీ అవుతాయని మంత్రి సవిత తెలిపారు. వచ్చే నెల 8న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో నిర్వహించనున్నామని, మంత్రి నారా లోకేష్ హాజరవుతారని చెప్పారు. సామాజిక వేత్తగా, స్వరకర్తగా భక్త కనకదాస తన కీర్తనలు, రచనలతో సమాజంలోని అసమానతలపైన, కుల వ్యవస్థపైనా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని పేర్కొన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన బిసి వసతి గృహాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.60 కోట్లు మంజూరు చేసినట్లు బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గత ప్రభుత్వం బిసి వసతి గృహాలను గాలికి వదిలేసిందన్నారు. విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించక పోగా, కనీసం వసతి గృహాలకు మరమ్మతులు కూడా నిర్వహించలేదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వసతి గృహ విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తుందన్నారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నట్లు చెప్పారు.

# మహిళల వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌కు టీమిండియా

**నవీముంబయి, అక్టోబరు 30:** మహిళల ప్రంచకప్‌లో భారత్ మహిళా జట్టు ఎనిమిదిసార్లు ఛాంపియన్ ఆస్ట్రేలియాకు చెక్ పెడుతూ రికార్డు లక్ష్యాన్ని మరో ఓవర్ ఉండగానే గెలుపుసాధించింది. భారీ ఛేదనలో జెమీమా రోడ్రిగ్స్(127 నాటౌట్) చిరస్మరణీయ శతకంతో చెలరేగగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(89)తో సెంచరీ భాగస్వామ్యంతో విజయానికి బాటలు వేశారు. ఆఖర్లో రీచా ఘోష్(26), అమన్‌జోత్ కౌర్(11 నాటౌట్) ఒత్తిడిలోనూ గొప్పగా ఆడటంతో వరల్డ్ కప్ నాకౌట్ చరిత్రలో టీమిండియా అత్యధిక లక్ష్యాన్ని చేదించింది. 5 వికెట్ల తేడాతో కంగారూలను ఓడించిన హర్మన్‌ప్రీత్ సేన ఆదివారం దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరులో తలపడనుంది. సొంతగడ్డపై జరుగుతున్న వన్డే ప్రపంచ కప్‌లో ఫేవరెట్ భారత జట్టు గొప్ప పోరాటపటిమతో ఫైనల్ చేరింది. లీగ్ దశలో న్యూజిలాండ్‌పై భారీ విజయంతో సెమీస్ చేరిన టీమిండియా అదిరే ఆటతో ఆస్ట్రేలియాను మట్టికరిపించింది. బౌలర్లు అదేపనిగా పరుగులు సమర్పించుకోవడంతో కంగారూ టీమ్ 339 పరుగుల కష్ట సాధ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే షఫాలీ వర్మ(10) ఎల్బీగా ఔటయ్యింది. ఫామ్‌లో ఉన్న స్మృతి మంధాన(24) దురదృష్టవశాత్తూ వికెట్ కీపర్ చేతికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. జెమీమా రోడ్రిగ్స్(127 నాటౌట్), హర్మన్‌ప్రీత్ కౌర్(89)లు క్రీజులో పాతుకుపోయి ప్రత్యర్థి బౌలర్లకు పరీక్ష పెట్టారు. రికార్డు లక్ష్యాన్ని కరిగించి రికార్డు నెలకొల్పింది టీమిండియా. ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వకుండా కంగారూలను కంగారెత్తించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 2017 సెమీఫైనల్ ఫలితాన్ని పునరావృతం చేసింది.

## ప్రభుత్వ జీవోల గోప్యతపై హైకోర్టులో పిల్

**విజయవాడ,అక్టోబరు 30,ప్రభాత వార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం పలు జీవోలను బహిరంగపర్చకుండా గోప్యంగా ఉంచుతోందంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. పిల్‌ను విచారించిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది.

# ఇక రాష్ట్ర పండుగగా సిపి బ్రౌన్ జయంతి

**అనంతపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్తబ్యూరో :** తెలుగు సూర్యుడుగా పేరుపొందిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సిపి బ్రౌన్) జయంతిని ఈ యేడాది నుండి ప్రతి నవంబరు 10 వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించడం పట్ల ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, విమలా శాంతి సాహితీ సాంస్కృతిక సేవాసంస్థ, ఉమ్మిడిశెట్టి సాహితీ ట్రస్ట్, అనంతపురం జిల్లా రచయితల సంఘం, తెలుగు వెలుగు, స్పందనఖి అనంతకవుల వేదిక, సాహితీ స్రవంతి,కవి సమ్మేళనం, మహాబోధి, వేమన విజ్ఞాన కేంద్రం, సాహిత్య భారతి, తెలుగు వెలుగు, తెలుగు భాషా పరిరక్షణ వేదిక, గుర్రం జాషువ సాహిత్య పీఠం మొదలైన సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. తెలుగు ఇంగ్లీషు, ఇంగ్లీష్ తెలుగు నిఘంటువులు రచించి, వేమన పద్యాలను తొలిసారిగా వెలుగులోకి తెచ్చారు బ్రౌన్. కడపలో ఇప్పుడు ఉన్న సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఒకనాడు బ్రౌన్ నివసించిన స్థలం. ఆంగ్లేయుడు అయిన బ్రౌన్ తెలుగు భాష నేర్చుకొని, ప్రాచీన తెలుగు గ్రంథాల రాత సేకరించి, సొంత జీతంలోంచి పండితులకు జీతాలిచ్చి, తాళపత్ర గ్రంథాలను పరిష్కరింపజేసి, ప్రచురించిన గొప్ప వ్యక్తి సిపి బ్రౌన్.1784లో పుట్టి, 1878లో మరణించిన బ్రౌన్ జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం ఎంతైనా ప్రశంసనీయమని భాషా సాహిత్యవేత్తలు మెచ్చుకున్నారు.

## వారం - వర్జ్యం

31-10-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
నవమి ఉ.10.00
ధనిష్ఠ సా.6.45
వర్జ్యం : రా.1.47-3.21
దు.ఉ.8.24-9.10, 2) మ.12.15-1.01
శుభసమయం:ఉ.10.30-11.15
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** అమ్మకాలు, కొనుగోలు, చిట్‌ఫండ్ వ్యవహారాలకు దూరంగా ఉండండి.

**వృషభం:** ఎదుటివారి మాట సావధానంగా ఆలకించండి. ఆర్థికాంశాలు అనుకూలం.

**మిథునం:** శాంతము వహించడం వలన అనేక లాభాలు కలుగుతాయి.

**కర్కాటకం :**మిత్రుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

**సింహం:** నూతన పెట్టుబడులకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం లభిస్తుంది..

**కన్య :** ఆస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. స్థలాలు కొనుగోలు.

**తుల :** ఇంటి యందు శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ఉద్యోగులకు బదిలీలు.

**వృశ్చికం:**సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి

**ధనుస్సు:** పనులు అప్రయత్నంగా పూర్తి చేస్తారు. శుభవార్తలు.

**మకరం:** అందరిలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కుంభం:** తండ్రి ద్వారా ఆస్తి లాభం పొందుతారు. బంధువులకలయిక.

**మీనం :** ఆర్థిక స్థితిగతులు మెరుగైన దిశలో వుంటాయి. వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కల్తీ నెయ్యి కేసులో భారీ కుట్ర!

>> ఫిర్యాదు చేయడం విదితమే. 10లక్షల కిలోల నెయ్యి సరఫరాకు ఎఆర్ డైరీకి గత ఏడాది మే 15న ఆర్డర్ ఇచ్చామని, జూన్ 12,20, 25తేదీలతోబాటు జులై 6వతేదీ 4ట్యాంకర్ల కల్తీ నెయ్యి సరఫరా జరిగిందనేది గతంలోనే సిట్‌కు అందిన సమాచారం. ఈ పాపంలో ఇదివరకు ఎఆర్ డైరీ ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కీ బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, షోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక) సిఇఒ అపూర్వ వినయ్ కాంత్ చావ్డాలతోబాటు 15మందివరకు ఉద్యోగులను అరెస్టుచేసిన విషయం విదితమే. ఈ కేసుపై పూర్తిస్థాయిలో నివేదకలు సిబిఐ చీఫ్ సుప్రీంకోర్టుకు సమర్పించారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలతో తిరిగి దర్యాప్తు ప్రారంభించింది. కల్తీనెయ్యికి సహకరించిన సూత్రధారులను తేల్చాలని ఆదేశించడంతో మళ్లీ రెండురోజులుగా సిబిఐ అధికారులు తిరుపతికి చేరుకుని విచారణ వేగంచేశారు. సిట్ అదుపులో మరో ఐదుమంది టిటిడి ఉద్యోగులు ఉండటం,వారిని విచారణ చేస్తున్నారు.

**ఇక 'మాజీ'ల విచారణ,అరెస్ట్ !**

టిటిడి లడ్డూలకు కల్తీనెయ్యి పెద్దమొత్తంలో సరఫరాచేసిన పాపంలో సిబిఐ సిట్ అధికారులు అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో లోతుగా దర్యాప్తుచేపట్టి నివేదికలు సిద్ధం చేశారు. ఇప్పుడు ఆ సమాచారం మేరకు ఢిల్లీ, విశాఖపట్నం,విజయవాడ సిబిఐ అధికారులు డిఎస్పీ స్థాయి అధికారులు ,తిరుపతిలో జిల్లా అదనపు ఎస్పీ వెంకట్రావుతో కలసి అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో రెండవసారి విచారణ చేస్తున్నారు. నెయ్యి కల్తీచేసి పంపిన కాంట్రాక్టర్లు, ఇక్కడ పరీక్షించి వెనక్కుపంపాల్సిన టిటిడి అధికారులు, ల్యాబ్, మార్కెటింగ్, విజిలెన్స్ ఉద్యోగులు పాత్రపై ఉన్న నివేదికలతో పోల్చుకుంటున్నారు. ఇప్పుడు అన్నికోణాల్లోనూ సిద్దమైన సిట్ తాజా అప్పన్న అరెస్టతో ఇక కీలకమైన గత టిటిడి ధర్మకర్తలమండలి మాజీ ఛైర్మన్లతోబాటు కొందరు మాజీ సభ్యులను,టిటిడిలో గతంలో పనిచేసిన ఓ అధికారిని, కొనుగోళ్ల కమిటీలో ఉన్న అధికారులను అరెస్ట్‌చేసేందుకు రంగం సిద్ధమవుతోందనేది సమాచారం. నోటీసులు ఇచ్చి ఈ వారంలో విచారణకు పిలవనున్నారని తెలుస్తోంది. మరీ రానున్న రోజుల్లో మాజీలు అరెస్ట్, కొందరు టిటిడి అధికారుల అరెస్ట్ తప్పదనేది స్పష్టమవుతోంది.

# ప్రకాశం బ్యారేజ్‌కి పోటెత్తిన వరద

>> నీటిలో చిక్కుకుపోయాయి. ఆ జాబితాలో గ్రామాలు, పంట పొలాలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో బ్యారేజీ నుంచి దిగువకు నీటికి విడుదల చేసేందుకు ఉన్నతాధికారులతో నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఇక బ్యారేజీ దిగువనున్న లంక గ్రామాల ప్రజలను అధికారులు ఇప్పటికే అప్రమత్తం చేశారు. కృష్ణా నదితోపాటు దాని ఉప నదులకు భారీ వరద నీరు వచ్చి చేరడంతో.. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని భారీ నీటి పారుదల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ప్రకాశం బ్యారేజీవద్ద నదిలోని వరదనీటి ప్రవాహాన్ని ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసినట్లు చెప్పారు.కృష్ణా డెల్టా పరిధిలో అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ.. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

# ప్రతి నియోజకవర్గంలో ఇక జాబ్ మేళాలు

>> సీఎం సూచించారు.'పోర్టల్‌లో ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, ఇంజినీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీలు, వివిధ విద్యా సంస్థలతో పరిశ్రమలు, సంస్థలను అనుసంధానించాలన్నారు. ఎపి ఎన్‌ఆర్టీ ద్వారా ఉద్యోగ సమాచారం పొందేలా చూడాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఎపిలో యువత అందరికీ ఏ రంగంలో నైపుణ్యం కావాలో దానికి సంబంధించిన శిక్షణ... అలాగా ప్రస్తుతమున్న సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునేలా పున:శిక్షణ, ఉత్తమ శిక్షణ అందించాలి' అని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు.

# ట్రంప్‌తో జిన్‌పింగ్ సుదీర్ఘ చర్చలు

>> (అరుదైన ఖనిజాలు) ఎగుమతులపై కూడా కీలక ఒప్పందం కుదిరింది. ఇకపై చైనా నుంచి అమెరికాకు ఈ అరుదైన ఖనిజాల సరఫరాలో ఎలాంటి ఆటంకం ఉండబోదని ట్రంప్ వెల్లడించారు. ఒక సంవత్సరం పాటు ఈ ఎగుమతులు నిరంతరంగా సాగేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. ఈ భేటీ సందర్భంగా ట్రంప్, చైనా అధ్యక్షుడిపై ప్రశంసలు కురిపించారు. 'జిన్‌పింగ్ గొప్ప నాయకుడు. ఆయనకు 10కి 12 మార్కులు ఇసా' అని ట్రంప్ అన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై అమెరికాతో కలిసి పనిచేయడానికి చైనా అంగీకరించిందని తెలిపారు. అదేవిధంగా వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో సందర్శించనున్నట్లు వెల్లడించారు. అనంతరం జిన్‌పింగ్ కూడా అమెరికా పర్యటనకు రావచ్చని ఆయన చెప్పారు. ఈ భేటీతో ఇరు దేశాల మధ్య నెలలుగా కొనసాగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు కొంత సడలే అవకాశం కనిపిస్తోంది. ఇక ఫెంటనిల్ టారిఫ్‌ల తగ్గింపు, రేర్ ఎర్త్ ఎగుమతి ఒప్పందం, సోయాబీన్ కొనుగోళ్ల పునరుద్ధరణతో వాణిజ్య సంబంధాలు కొత్త దశలోకి వెళ్లే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# చిన్నారుల కిడ్నాప్ కలకలం

>> మహారాష్ట్ర రాజధాని ముంబయిలో ఈ సంఘటన జరిగింది. పోవై ప్రాంతంలోని ఆర్‌ఎ స్టూడియోలో యాక్టింగ్ క్లాసులు జరుగుతుంటాయి. కాగా, రోహిత్ ఆర్య అనే వ్యక్తి ఆ స్టూడియోలో పని చేస్తున్నాడు. అతడికి యూట్యూబ్ ఛానెల్ కూడా ఉన్నది. గత నాలుగు రోజులుగా రోహిత్ ఆడిషన్లు నిర్వహిస్తున్నాడు. దీంతో గురువారం ఉదయం సుమారు వంద మంది పిల్లలు ఆడిషన్ల కోసం ఆ స్టూడియోకు వచ్చారు. అయితే 80 మంది పిల్లలను అతడు బయటకు వెళ్లనిచ్చాడు. సుమారు 20 మంది పిల్లలను స్టూడియో లోపల ఉంచి నిర్బంధించాడు. దీంతో తమను కాపాడాలంటూ వారు హాహాకారాలు చేశారు. మరోవైపు రోహిత్ ఆర్య ఆ తర్వాత ఒక వీడియో క్లిప్ విడుదల చేశాడు. కొంత మంది వ్యక్తులతో మాట్లాడటం కోసమే పిల్లలను బందీలుగా ఉంచినట్లు తెలిపాడు. తనకు పెద్దగా ఆర్థిక డిమాండ్లు లేవని చెప్పాడు. తన డిమాండ్లు నైతికమైనవని అన్నాడు. పోలీసులు, అధికారులు దూకుడుగా వ్యవహరించవద్దని, తనను రెచ్చగొట్టవద్దని హెచ్చరించాడు. తన డిమాండ్లు నెరవేర్చకపోతే ఆ ప్రాంగణానికి నిప్పు పెడతానని, తనతో పాటు పిల్లలకు హాని జరుగుతుందని వార్నింగ్ ఇచ్చాడు. కాగా, పిల్లల కిడ్నాప్, నిర్బంధం గురించి తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పెద్ద సంఖ్యలో ఆ స్టూడియో ముందు గుమిగూడారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. పిల్లలను కిడ్నాప్ చేసి నిర్బంధించిన రోహిత్ ఆర్యతో మాట్లాడారు. మరోవైపు పిల్లలందరినీ రక్షించి వారి కుటుంబాలకు అప్పగించిన పోలీసులు అరెస్టుచేసేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో కాల్పులు జరిపాడని, రక్షణ చర్యల్లో భాగంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో తీవ్ర గాయాలు అయిన రోహిత్‌ను ఆసుపత్రికి చేర్చారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు ఆసుపత్రి వర్గాలు ధృవీకరించాయి. సంఘటనా స్థలంనుంచి ఒక ఎయిర్‌గన్, కొన్ని రసాయనాలు పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. అతడు ఎందుకు ఇలా చేశాడు అన్నది తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఆ వ్యక్తి మానసికంగా స్థిరంగా లేదని వెల్లడించారు.

# సంగం బ్యారేజ్‌కు తప్పిన ముప్పు

>> జిల్లా ఎస్పి అజితా వెజండ్లని ఆయన అభినందించారు. అలాగే ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం, ఎస్‌డిఆర్‌ఫ్ బృందాన్ని, పోలీసులను, ఇరిగేషన్, మండల స్దాయి అధికారులందరికి ప్రశంసలు దక్కాయి. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాల సేవలను అభినందిస్తు ఆత్మకూరు ఆర్‌డిఒ పావని, తహసిల్దారు సోమ్లానాయక్, వారికి శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. వారి సేవలను అభినందించారు.

ప్రమాద సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. హుటాహుటిన అధికారులను అప్రమత్తం చేసి, ప్రతి బృందానికి స్పష్టమైన బాధ్యతలు అప్పగించారు. మొత్తం 30 మంది చొప్పున ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, 100 మంది పోలీసు సిబ్బంది, కృష్ణపట్నం పోర్టు గస్తీ బృందం, ఫైర్, ఇరిగేషన్ అధికారులు సమన్వయంగా కృషి చేయడంతో పడవను సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగామని కలెక్టర్ వివరించారు. ప్రవాహ ధాటికి తీసుకురాలేకపోయిన మూడవ పడవను గురువారం ఉదయం చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు. లక్ష క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతున్న సమయంలో 30 టన్నుల పడవ ప్రాజెక్టుకు తగిలితే సంగం బ్యారేజ్ ఉనికే ప్రశ్నార్థకమయ్యేదని కలెక్టర్ అన్నారు. అంతేకాకుండా 85 గేట్లతో 3,85,000 ఎకరాలు ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేస్తున్న సంగం బ్యారేజ్‌కు ప్రమాదం జరిగి ఉంటే నీరు వృధాగా పోయి రాబోయే సీజన్ లో రైతులు నష్టపోయేవారన్నారు. అలాగే పొదలకూరు, సంగం గ్రామాలకు మధ్య రాకపోకలు స్థంభించేవని అన్నారు.

31-10Pg3exHMNWJQEPCKRVS 3 GO_31-10Pg3exHMNWJQEPCKRVS.qxd 31/Oct/25 12:04 AM Page 1



# తిరుమల సమాచారం

## ఆరురకాల పత్రాలతో పుష్పయాగం



**తిరుమల,అక్టోబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి కార్తీకమాసంలో శ్రవణానక్షత్రాన జరిపే పుష్పయాగమహోత్సవం గురువారం మధ్యాహ్నం శాస్త్రోక్తంగా ఆలయంలో చేపట్టారు. సువాసనలు వెదజల్లే 16 రకాల పుష్పాలు, ఆరురకాల పత్రాలతో ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామికి వేడుకగా పుష్పార్చన నిర్వహించారు. రంగురంగుల పుష్పాలు, పత్రాల మధ్య స్వామిఅమ్మవార్లు వైభవం మరింత ఇనుమడింపజేసింది. మధ్యాహ్నం 1గంట నుండి సాయంత్రం 4గంటల వరకు కల్యాణోత్సవమండపంలో మహోత్సవం కన్నులపండువగా జరిగింది. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి పుష్పకైంకర్యం చేశారు. చామంతి, సంపంగి,రోజా,గన్నేరు, మల్లె,ముల్లెలు, కనకాంబరం,తామర, మానుసంపంగి, ఇతరపుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరు,కదిరిపచ్చ పత్రాలతో ఉత్సవమూర్తులను అభిషేకించారు. వేదపండితులు రుగ్వేదం, యజుర్వేదం, కృష్ణవేదం, సామవేదం అధర్వణవేదాలను పఠిస్తుండగా 20 సార్లు వివిధ రకాల పుష్పాలతో అర్పించారు. ఉత్సవమూర్తుల నిలువెత్తు వరకు ఉండేలా పుష్పనివేదన చేశారు. పుష్పయాగానికి 9టన్నుల పుష్పాలు, పత్రాలను దాతలు అందించారు. శ్రీవారి పుష్పయాగ మహోత్సవానికి పుష్పాలు సేకరించిన ఉద్యానవనవిభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసన్‌ను అభినందించారు. ఈ వేడుకల్లో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. అంతకుముందు ఉదయం పాపవినాశనం మార్గంలోని ఉద్యానవనం నుండి పుష్పాలను భక్తితో ఊరేగింపుగా ఆలయంలోనికి చేర్చారు.

## నవంబర్ 2న ఉగ్ర శ్రీనివాసమూర్తి ఊరేగింపు

**తిరుమల,అక్టోబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** కార్తీకమాసంలో పవిత్రమైన ద్వాదశి ఘడియల్లో కైశికద్వాదశి ఉత్సవం తిరుమలలో అత్యంత వేడుకగా జరుగుతుంది. 2వతేదీ ఆదివారం వేకువజామున సూర్యోదయానికి ముందే ఉగ్రశ్రీనివాసమూర్తి ఉభయదేవేరులతో కలసి ఆలయ మాఢవీధుల్లో ఊరేగి స్తారు. భక్తులకు దర్శనం కల్పిస్తారు. వైష్ణవక్షేత్రాల్లో కైశికద్వాదశి అత్యంత పవిత్రమైనది. ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయం నుండి వెలుపలకు వచ్చి ఊరేగింపు ఉంటుంది. మిగిలిన రోజుల్లో మలయప్పస్వామి ఉత్సవమూర్తులు ఊరేగిస్తారు.

## కపిలేశ్వర సన్నిధిలో చండీహోమం ఆరంభం



**తిరుమల,అక్టోబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వర ఆలయంలో ప్రముఖ శైవాలయంలో కార్తీకమాస పూజల్లో భాగంగా గురువారం నుండి చండీహోమం చేపడుతున్నారు. ఆలయ అర్చకులు ఉదయం శాస్త్రోక్తంగా ఆలయంలో యాగశాలలో పూజ, హోమం, లఘుపూర్ణాహుతి,నివేదన ,హారతి చేపట్టారు. సాయంత్రం హోమం, సహస్రనామార్చన, విశేషదీపారాధన జరిపించారు. నవంబర్ 7వతేదీ వరకు ఈ చండీహోమం జరగనుంది. సాయంత్రం 6గంటల నుండి రాత్రి 8గంటల వరకు హోమం, చండీపారాయణం, సహస్రనామార్చన, విశేషదీపారాధన చేపట్టారు. 500 రూపాయలు చెల్లించి గృహస్థభక్తులు ఈ హోమంలో పాల్గొనవచ్చు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్రాల సమన్వయం వల్ల తుఫాన్ భారీ నష్టం తగ్గింది : ఎమ్మెల్యే సిఎం రమేశ్



**తిరుమల,అక్టోబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** ఇటీవల ఆంధ్రప్రదేశ్‌ను భారీ వర్షాలతో వణికించిన మొంథాతుఫాన్ ప్రభావాన్ని ముందుచూపుతో ప్రాణనష్టం జరగకుండా, భారీ నష్టం వాటిల్లకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేశారని బిజెపి ఎంఎల్ఎ సిఎం రమేశ్ తెలిపారు.తుఫాన్‌పై ఎప్పటికప్పుడు కేంద్రప్రభుత్వం, ప్రధాని మోదీ ,ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబునాయుడు సమన్వయంగా పర్యవేక్షించి భారీనష్టాన్ని తగ్గించగలిగారన్నారు. రాష్ట్రంలో అందరికీ మంచి జరుగుతుందని, బాధితులకు నష్టపరిహారం అందుతుందని తెలిపారు. గురువారం ఉదయం సిఎం రమేశ్ కుటుంబంతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి దర్శనంతో మనసు ఆనందం: డ్రమ్స్‌శివమణి



**తిరుమల,అక్టోబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** "సినీనటుడు బాలకృష్ణ నటించిన అఖండ-2"చిత్రానికి నేపథ్య సంగీతం పూర్తిచేసిన తరువాత తిరుమలకు వచ్చానని సంగీత దర్శకుడు శివమణి తెలిపారు. ఏడుకొండలకు చేరుకుని దేవదేవుని దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. గురువారం ఉదయం సినీ సంగీత దర్శకుడు శివమణి కుటుంబంతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.





## తిరుపతిలో ఏక్‌భారత్ శ్రేష్ఠభారత్ ర్యాలీ

**తిరుపతి,అక్టోబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** భారత దేశ ఉక్కుమనిషి,జాతినిర్మాత సర్దార్ వల్లభాయి పటేల్ జయంతిని పురస్కరించుకుని తిరుపతిలో బిజెపి నాయకులు ఏక్‌భారత్ శ్రేష్ఠభారత్ ర్యాలీ నిర్వహించారు. ప్రజలందరితో కలసి ఐక్యంగా కేంద్రప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ సంయుక్తంగా ఈ పాదయాత్ర ర్యాలీని చేపట్టింది. తిరుపతిలో జ్యోతిరావుపూలే విగ్రహం నుండి తుడ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈచారిత్ర ప్రయాణాన్ని చిం స్మరణీయంగా ప్రజలు భావించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్రనేత జల్లిమధుసూదన్, జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాధరెడ్డి, పొనగంటి భాస్కర్,వరప్రసాద్, తొండమనాటి సుబ్ర మణ్యంరెడ్డి, చంద్రబాబు,సుబ్రమణ్యం యాదవ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మున్నేరు, కృష్ణ ప్రవాహాలపై నిరంతర అప్రమత్తత



కృష్ణ ఉపనది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

> ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
> నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందుతుంది..
> ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,అక్టోబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ ప్రాంతంలో కురిసిన వర్షాలతో మున్నేరుకు వరద పోటెత్తుతోందని.. ఈ నేపథ్యంలో మున్నేరుతో పాటు కృష్ణానదిలోని వరద ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉంటున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు.. నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్యతో కలిసి కీసర వంతెన వద్ద మున్నేరు వరద ఉధ్ధృతిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు వివిధ ప్రాంతాల్లో మున్నేరు వరద పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కృష్ణా, మున్నేరు, కట్టలేరు, వైరా, పాలేరులోని ప్రవాహాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టామని.. మున్నేరుకు అటూఇటూ ఉన్న 40 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు. ఎవరికీ ఎక్కడా ఎలాంటి ఇబ్బందిలేకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నామని.. గ్రామ సచివాలయాలు, పాఠశాలలను సిద్ధంగా ఉంచామని, ఏ ఇబ్బంది తలెత్తినా వెనువెంటనే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. జాతీయ రహదారులు (ఎన్‌హెచ్), ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్.. ఇలా వివిధ శాఖల అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

వాహనాల రాకపోకలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయ రహదారులకు సంబంధించి కూడా ప్రణాళికలు ఉన్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సి న అవసరం లేదని.. నష్టాల తుది అంచనాల నివేదికలకు అనుగుణంగా నష్టపోయిన ప్రతిరైతుకూ పరిహారం అందించి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్నదాతల క్షేమం, సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని, సూచనలు ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజీకి కూడా వరద నీరు పోటెత్తుందోని.. ఈ నేపథ్యంలో బ్యారేజీకి ఎగువున, దిగువున ప్రాంతాల ప్రజలకు ఇప్పటికే హెచ్చరికలు జారీచేశామన్నారు.

## బస్సు ప్రమాద బాధితులకు 40లక్షలు ఆర్థికసాయం అందించిన వేమూరి కావేరి ట్రావెల్స్

**కర్నూలు, హాస్పిటల్అక్టోబర్ 30 ప్రభాతవార్త**ఈ నెల 24వ తేదీన చిన్నటేకూరు సమీపంలో జరిగిన బస్సు ప్రమాద దుర్ఘటన బాధితులకు కావేరి ట్రావెల్స్ యాజమాన్యం రూ.40 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం ఉదయం కలెక్టర్ ఛాంబర్ లో కావేరి ట్రావెల్స్ ప్రతినిధులు మంత్రి టి.జి భరత్ , జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి , ఎస్పీ విక్రాంత్ పాటిల్ ,జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సమక్షంలో బస్సు దుర్ఘటనలో మరణించిన మరియు గాయపడిన వారికి చెక్కు రూపంలో మంత్రికి అందజేశారు. చిన్నటేకూరు సమీపంలో ఈ నెల 24 న జరిగిన కావేరీ బస్సు దుర్ఘటన లో మరణించిన వారికి రెండు లక్షల రూపాయల చొప్పున 17 మంది పెద్దవారు ,
ఇద్దరు చిన్న పిల్లలు మొత్తం 19 మందికి రూ.38 లక్షలు , తీవ్రంగా గాయపడిన నలుగురు కి రూ.50 వేల చొప్పున మొత్తం 2 రెండు లక్షలు మొత్తం రూ.40 లక్షల చెక్కును అందచేశారు.

## ఆంధ్రప్రదేశ్‌లో తుఫాన్ మొంథా చంద్రబాబు తెచ్చిన విపత్తు : జగన్



**విజయవాడ,అక్టోబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ లో తుపాను మొంథా చంద్రబాబు తెచ్చిన విపత్తు అని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. బుధవారం బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చిన ఆయన గురువారం పార్టీ నేతలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ముఖ్యంగా వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పైరు పొట్ట దశలో ఉన్నప్పుడు తుపాను వచ్చినందున దిగుబడులు బాగా తగ్గిపోతాయన్నారు. నేలకొరిగిన పంట తిరిగి నిలబడటం కష్టమవుతుంది తెలిపారు. 25 జిల్లాల్లో 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని జగన్ తెలిపారు. 11 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం దాటిల్లిందని..1.14 లక్షల ఎకరాల్లో పత్తి, 1.15 లక్షల ఎకరాల్లో వేరు శనగ, 2 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.9 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు దెబ్బతిన్నాయన్నారు. రైతులకు పార్టీ పరంగా తోడుగా నిలబడాలని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. రైతులకు టీడీపీ ప్రభుత్వం సాయం చేయడం లేదన్నారు. మన ప్రభుత్వంలో ఆర్బీకేల వ్యవస్థ అప్రమత్తంగా ఉండేది. ప్రతి పంటకూ ఇక్రాప్ చేసే వాళ్లమని గుర్తు చేశారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు సమన్వయంతో పని చేసి.. ఉచిత పంటలబీమాతో రైతులకు భరోసా ఉండేదన్నారు. 80 లక్షల మంది రైతులు ఉచిత పంటల బీమా అందుబాటులో ఉండటం వల్ల 70 లక్షల ఎకరాల పంట బీమా పరిధిలో ఉండేది. ప్రీమియం కట్టిన రైతులు 19 లక్షలమందికి మాత్రమే బీమా అందుబాటులో ఉంది. మిగిలిన రైతుల పరిస్థితి ఏం కావాలని జగన్ ప్రశ్నించారు.చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లో అల్పపీడనలు, వాయుగుండాలు, తుపాన్లు కారణంగా 16 వచ్చాయని జగన్ లెక్క చెప్పారు. ఎన్ని విపత్తులు వచ్చినా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోలేదన్నారు. ఏ రైతునూ ఆదుకున్న పరిస్థితి లేదు. ఇక్రాప్ అందించిన పరిస్థితి కూడా లేదు. వాళ్లు వేసిన అరకొర లెక్కల ప్రకారమే 5.5 లక్షలమంది రైతులకు రూ.600 కోట్లు పెండింగ్‌లో పెట్టారు. మిర్చికి క్వింటాలుకు రూ.11,781కి కొనుగోలు చేస్తామన్నారు ఒక్క రూపాయికూడా రైతుకు ఇవ్వలేదు. పొగాకును కొనుగోలు చేస్తామ న్నారు దిక్కూ మొక్కూ లేదు. మామిడిని కిలో రూ.12లకు కొనుగోలు చేస్తామన్నారు. ఒక్క రైతు నుంచీ కొనుగోలు చేయలేదన్నారు. ఉల్లి రైతులకు హెక్టారుకు యాభై వేలు ఇస్తామన్నారు. అదికూడా ఇచ్చిన పాపాన పోలేదు.

## శ్రీశైలంలో టిటిడి వసతి సముదాయం



అనిల్‌సింఘాల్‌కు మెమొరాండం ఇస్తున్న శ్రీశైలం ఛైర్మన్ రమేష్ నాయుడు, టిటిడి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి

**రాజంపేట, అక్టోబర్ 30, ప్రభాతవార్త** ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలోనే ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం, అలాగే శక్తి పీఠం శ్రీశైలం లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల కోసం వసతి సముదాయం నిర్మించాలని శ్రీశైలం ఆలయ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు టీటీడీ ఈవో అనిల్ సింఘాల్ ను కలిసి మెమొరాండం అందజేశారు. టిటిడి పాలకమండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి తో కలిసి రమేష్ నాయుడు గురువారం టిటిడి ఈవో ను కలిశారు. తిరుమల లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనిల్ సింఘాల్ ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మల్లికార్జున స్వామివారి వస్త్రము, ప్రసాదము అందజేశారు. అనంతరం దోర్నాల వద్ద భక్తులకు యాత్రికుల కోసం తిరుమల తిరుపతి ద్వారా ఒక వసతి సముదాయము, డార్మెటరీ నిర్మించాలని, అలాగే శ్రీశైలంలో కూడా టీటీడీ వసతి సముదాయాన్ని నిర్మించాలని కోరారు. అందుకు ఈఓ సానుకూలంగా స్పందించి చేస్తామని చెప్పడం జరిగిందనీ రమేష్ నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. టిటిడి తరఫున టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి ని వెళ్లి పరిశీలించి రావాలని సూచించినట్లు పేర్కొన్నారు.

## భూ సర్వే ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అప్పగిస్తున్నారని పిల్

### - కొట్టేసిన హైకోర్టు ధర్మాసనం

**విజయవాడ,అక్టోబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** భూముల సర్వేలో గ్రామ పంచాయితీ కార్యదర్శులను పక్కన పెడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పూర్తి భాధ్యతలు అప్పగిస్తున్నారంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టేసింది. సర్వే చేసేటప్పుడు పంచాయితీ కార్యదర్శులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సహకారం అందిస్తారని, పంచాయితీ కార్యదర్శులను పక్కన పెట్టలేదని రాష్ట్రప్రభుత్వం తరపున అదనపు ఏజీ ఇవన సాంబశివ ప్రతాప్ వాదనలు వినిపించారు.ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పిల్‌ను కొట్టేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

,జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. బీ స్వామిత్వ పథకం కింద నిర్వహించే భూ సర్వేల విషయంలో ఈ ఏడాది సెప్టెంబరు 24న సవరించిన ప్రామాణిక నిర్వహణ విధానాలనున (ఎస్ఓపీ) తీసుకొచ్చారన్నారు.

## శాంతియుత అణుశక్తికి అండగా భారత్

### ఐక్యరాజ్యసమితిలో ఎంపి పురందేశ్వరి



**విజయవాడ,అక్టోబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** శాంతియుత అణుశక్తికి భారతదేశం అండగా నిలుస్తుందని రాజమహేంద్రవరం ఎంపీ పురంధరేశ్వరి అన్నారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్యసమావేశంలో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) నివేదికపై దేశం తరపున ఆమె మాట్లాడారు. అణు విజ్ఞానం,సాంకేతికతను శాంతియుతంగా, సురక్షితంగా వినియోగించుకోవడంలో ఐఏఈఏ పోషిస్తున్న కీలక పాత్రకు భారత్ తరపున మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. అణుశక్తి వల్ల బహుముఖ ప్రయోజనాలున్నాయని చెప్పారు. స్థిరమైన అభివృద్ధి, ప్రజారోగ్యం,వ్యవసాయం,నీటి నిర్వహణ వంటి రంగాల్లో ఇది కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. అణ విద్యుత పరిశోధనల్లో భారతదేశం సాధించిన పురోగతి అసాధారణమైందని వివరించారు. భాగస్వామ్య దేశాలలో అణు నైపుణ్యాన్ని పంచుకోవడం ద్వారా ఐఏఈఏకి భారత్ సహకరిస్తోందన్నారు. ప్రజారోగ్య రంగంలో సాధించిన విజయాన్ని పురందేశ్వరి ప్రముఖంగా ప్రస్తావించారు. భారతదేశం దేశీయంగా అభివృద్ధి చేసినసెల్ థెరపీ ద్వారా తక్కువ ఖర్చుతోనే క్యాన్సర్ చికిత్సను అందు బాటులోకి తీసుకురావడం గర్వకారణమని తెలిపారు. ఇది అణు పరిజ్ఞానం మాన వాళికి ఎంతగా ఉపయోగపడుతుందో చెప్పడానికి ఒక నిదర్శనమని అన్నారు. సామర్థ్య పెంపుదల, సాంకేతిక సహకారం వంటి కార్యక్రమాల ద్వారా భాగస్వామ్య దేశాలతో అణుపరిజ్ఞానాన్ని పంచుకుంటూ భారత్ నిరంతరం తోడ్పాటు నందిస్తోందని పురందేశ్వరి వెల్లడించారు. శాంతియుత అణుశక్తి వినియోగంలో ప్రపంచదేశాలకు అండగా నిలుస్తామని పునరుద్ఘాటించారు.

### తుఫాన్ దెబ్బకు రాష్ట్రంలో 4,576 కి.మీ మేరకు ధ్వంసమైన రహదారులు

**విజయవాడ,అక్టోబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 4,576 కి.మీ మేర ఆర్ అండ్ బీ రహదారులు ధ్వంసమయ్యాయి. ప్రకాశం,బాపట్ల,శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు,కాకినాడ,నెల్లూరు,విశాఖపట్నం,అనకాపల్లి,పశ్చిమగోదావరి,కృష్ణా,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో రహదారులు ఎక్కువగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. డివిజన్ల వారీ నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. 302 చోట్ల కల్వర్టులు,వంతెనలు పాడయ్యాయి. 426 చోట్ల రహదారులపై చెట్లు కూలాయి. రహదారులు 28 చోట్ల పూర్తిగా కోతకు గురవగా,120 చోట్ల భారీ గుంతలతో దెబ్బతిన్నాయి. 244 చోట్ల రోడ్లపై నుంచి వర్షపు నీరు ప్రవహించింది. 378 మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కల్గిన రహదారుల తాత్కాలిక మరమ్మత్తులకు రూ.272 కోట్లు,శాశ్వత పనులకు రూ.2440 కోట్లు అవసరమని ఇంజనీర్లు అంచనా వేశారు.

BAJAJ FINANCE

బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్ది, పూణె - 411035

గోల్డ్ లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్ జ్యువెలరీ "యథాతథంగా" మరియు "ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యువెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;
(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;
(c) నియమాలు మరియు షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/-ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్/బజాజ్ గోల్డ్ ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;
(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు
(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.
(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.
(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్‌ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత(లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యువెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీపై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in

(10-12-25) అనకపల్లి - భార్గవి ప్లాజా; PBV8SGL13871198, 13868837, 14107704, 14130697, 14319835, 14320855. అనంతపుర్ - కల్యాణ్‌దుర్గ్ రోడ్; PIV9SGL13229396, 13858208, 13860058, 13924378, 14269763. అనంతపుర్ - సుభాష్ రోడ్; PGA7SGL13854488, 13868636, 14090117, 14109487, 14128357, 14185854, 14243365. బద్వేల్ - ఫోర్ రోడ్ సర్కిల్; PJU6SGL12490693. బాపట్ల - జీ బీ సీ రోడ్; PLN3SGL14263442. బొబ్బిలి - పెద్ద బజార్ మైన్ రోడ్; PKI4SGL13891765, 14069004. చిలకలూరిపేట్ - ఎన్‌టీఆర్ సెంటర్; PJU5SGL14313841. చిరాల - సంత బజార్; PEJ9SGL13910855, 13911318, 13981667, 13981359, 14090344, 14251724, 14285132. కడప - భాగ్యనగర్ కాలోనీ; PGA9SGL13942151. (11-12-25): ఏలూరు - వసంత్ మహల్ స్ట్రీట్; PEG8SGL14332874. గుడివాడ - బిజిఎల్; P563SGL14256267, 14332682. గూడూర్; P5N7SGL11077555. గుంతకల్ - వెజిటబుల్ మార్కెట్; PBV9SGL13853488, 13892227, 14014432, 14177631, 14295358, 14285785, 14334253. గుంటూర్ - అరుండేల్‌పేట్; PEK1SGL13929704. గుంటూర్ - కొత్తపేట; P73FSGL14116529, 14179445, 14332314. హిందూపూర్ - ధన లక్ష్మి రోడ్; PEG4SGL14203835. జంగారెడ్డిగూడెమ్ - ఏలూరు మైన్ రోడ్; PGH1SGL13930199. కదిరి - ఎన్‌టీఆర్ సర్కిల్; PIW8SGL13966525, 14016371, 14058394, 14055238, 14178007, 14292421, 14335797. (12-12-25) కాకినాడ - జగన్నాయిక్‌పూర్; PBW1SGL14069101, 14185345, 14286394, 14340455. కాశీబుగ్గ - కేటీ రోడ్; PEG5SGL13861954, 14068502. కర్నూల్ - గాంధీ నగర్; PBW2SGL14057404, 14172159. మదనపల్లె - ఎన్‌టీఆర్ సర్కిల్; PEG6SGL13976138, 14041272, 14286670. నందిగామ - మైన్ రోడ్; PLN1SGL14251586, 14275647, 14312168. నంద్యాల్ - శ్రీనివాస్ నగర్; PEO1SGL14252065. నరసారావుపేట్ - అరుండేల్ పేట్; PEO2SGL13852828, 14171625, 14313916. నర్సీపట్నం - మైన్ రోడ్; PIW7SGL14092705. నెల్లూర్ - బీజీఎల్; P468SGL13860272, 13944227, 14090220. (15-12-25) నెల్లూర్ - నవాబ్‌పేట్; PXB4SGL13927994, 13964861, 14112444, 14242348. నెల్లూర్ - వేదయపాలెం; PXB5SGL12994794, 13270526, 13873372, 13892369, 13930688, 13984733, 14028990, 14067896, 14112476, 14233365. ఒంగోలే అద్దంకి - బస్ స్టాండ్ సెంటర్; PEJ8SGL11930110, 13887165, 13948462. పీలేరు - కడప రోడ్; PEG3SGL14270217. పొన్నూర్ - బస్ స్టాండ్; PLN2SGL13843327, 14100128. రైల్వే - కోడూరు నేతాజీ రోడ్; PGC5SGL13841161, 13841781, 13874720, 13869563, 13930862, 13946056, 13968573, 14090806, 14127703, 14128332, 14128110, 14127947, 14243517, 14331829. రాజమండ్రి - దేవీ చౌక్; PBW3SGL14250031. రాయచోటి - బంగ్లో రోడ్; PBW4SGL13893529, 13886689, 14014014, 14017567, 14049291, 14052909, 14089846, 14127123, 14172171, 14186833, 14200638, 14294793. శ్రీకాకుళం - రామలక్ష్మణ్ జంక్షన్; PBW5SGL13361051, 14051203, 14175484, 14207823, 14204088, 14220787, 14242102. (16-12-25) శ్రీకాళహస్తి - మైన్ రోడ్; PGC6SGL14017694, 14312980. శృంగవరపు - కోటా; PBW6SGL13966704, 14251342, 14252712. సూళ్లూర్‌పేట - పాండు రంగ స్ట్రీట్; PBW7SGL13869696, 14112172, 14205357, 14228189, 14289821, 14313549. తాడిపత్రి - యల్లనూర్ రోడ్; PBW8SGL13877303, 13888718, 13886713, 14181463, 14245614, 14243015, 14338144. తగరపువలస - భీమిలి రోడ్; PIW6SGL13981217. తిరుపతి - బైరాగి పట్టెడ; PMB8SGL14243925. తిరుపతి - బీజీఎల్; P442SGL14097264, 14185539. తిరుపతి - కోర్లగుంట; PNB1SGL14136674. తిరుపతి - ఆర్‌సీ రోడ్; PNB2SGL14118630, 14315552. (17-12-25) తిరుపతి - తిలక్ రోడ్; PMB9SGL14232814, 14220333. తుని - సినిమా రోడ్; PBW9SGL14001902, 14273150. విజయవాడ - అజీత్ సింహ్ నగర్; PLB9SGL13984335, 13984943, 14246619, 14254196, 14278498. విజయవాడ - భవానీపురం; PMB1SGL14131830, 14183588, 14233559, 14265401. విజయవాడ - బిట్టీ నగర్; PMB3SGL13845738, 14031273, 14256387, 14312504. విజయవాడ - ఏలూర్ రోడ్; PMB2SGL12794290, 13995509, 14107925. విజయవాడ - గురు నానక్ కాలోనీ; PGH4SGL14293379. విజయవాడ - ఇబ్రాహింపట్నం; PMB6SGL12853932, 12949652, 13237365, 14107923, 14111440, 14218689. విజయవాడ - మొఘల్‌రాజ్‌పురం; PGA8SGL13993506, 14056518. (18-12-25) విజయవాడ - రామవరప్పాడు; PMB5SGL13097094, 13890159, 14286014. విజయవాడ - సత్యనారాయణ్‌పురం; PMB4SGL14285417. వైజాగ్ - అక్కయ్యపాలెం; PI90SGL13885961, 13908234, 13960590, 14330778. వైజాగ్ - బీజీఎల్; P408SGL13871062. వైజాగ్ - ద్వారకానగర్; PI52SGL13975248, 13985808, 14069825, 14070757, 14230900. వైజాగ్ - గోపాల్పట్నం; PB91SGL12552004, 12609386, 12689404, 13975722, 13979634, 14030732, 14091510, 14117765, 14130551, 14243541, 14267616. వైజాగ్ - హెచ్‌బీ కాలోనీ; PI58SGL14228919, 14268214. వైజాగ్ - కంచర పాలెం; PI54SGL13926891, 13999120, 14092571, 14242916. వైజాగ్ - కూర్మన్నపాలెం; PI57SGL14138984, 14138173, 14136322, 14138264, 14180583, 14178131, 14311671. (19-12-25) వైజాగ్ - మధురవాడ; PI93SGL13891377, 13947716, 13966892, 13957326, 14132590, 14331141. వైజాగ్ - ఎన్ఏడీ జంక్షన్; PI94SGL14207253, 14324743, 14339426. వైజాగ్ - కొత్త గాజువాక; PI53SGL13861117, 13961390, 13966819, 14013771, 14038557, 14218924. వైజాగ్ - పాత గాజువాక; PB47SGL14031664, 14337506, 14333260, 14337952. వైజాగ్ - పెద్దవాల్తైర్; PI56SGL14010599, 14071258, 14204482, 14254912, 14272846. వైజాగ్ - సెందుర్తి; PI92SGL13945615, 14059025, 14078345, 14097101. వైజాగ్ - రవీంద్ర నగర్; PI95SGL13841027, 13862556, 13860436, 13871007, 13869935, 13928052, 13949856, 14111046, 14185499. విజయనగరం - ఫోర్ట్ ఏ జీ రోడ్; PBX1SGL13960083. విజయనగరం - ఎంజీ రోడ్; PCZ4SGL14049400, 14173165.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

వార్త


విజ్ఞుడైనవాడు ముందుగా తోటి మానవుని మానవత్వాన్ని ప్రేమిస్తాడు. ఆ తరువాతే సౌందర్యాన్ని ప్రేమిస్తాడు.

-లావోసు

# తెలుగు నేల కకావికలం

తెలుగు నేలపై ప్రకృతి విలయం మూడోకన్ను తెరిచింది. ఐదు రోజులుగా అటు ఆంధ్రప్రదేశ్ ఇటు తెలంగాణలకు మొంథా తుపాన్ పెను ముప్పే తెచ్చిపెట్టింది. నర్సాపురంలో తుపానుతీరం దాటాక తెలంగాణ వైపు మళ్లి ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లింది. ఆంధ్రప్రదేశ్ పాలకులు గత అనుభవాలతో ప్రాణనష్టం తగ్గించేందుకు చేపట్టిన చర్యలన్నీ సత్ఫలితాలనిచ్చాయి. కోస్తా జిల్లాలు తుపాను భయంతో మూడు రోజుల పాటు చిగురుటాకులా వణికిపోయాయి. ఎన్నడూ లేనట్లుగా భారీ వర్షపాతం నమోదైంది. పంటలన్నీ నీటమునిగి ఇక రైతులు కోలుకునే పరిస్థితి లేదు. సరిగా పదిరోజుల్లో పంట చేతికొస్తుందని ఆశగా ఎదురుచూసే సమయానికి వారి ఆశలు అడియాసలయ్యాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జలఖడ్గం ఇప్పటికీ విసిరి కొడుతోంది. తుపాను బలపడడం, బలహీనపడటం మధ్య ఎంత అలజడి ఉంటుందో కోస్తా తీరప్రాంత ప్రజలకు తెలియనిది కాదు. అయినా ఈసారి వారిలో గుబులు బయలు దేరింది. ప్రజలెవరినీ ఆ పని మీద ఈ పని మీద అంటూ రోడ్డు పైకి చేరకుండా ప్రభుత్వపాలనా యంత్రాంగం కట్టడి చేయడమొక్కటే ఆంధ్రాలో ప్రాణనష్టం జరుగకుండా ఆపింది. ఉప్పాడతీరం దాదాపు సముద్రంలో కలిసిపోయింది. సముద్రానికి కట్టిన గోడ కూలిపోయింది. రాళ్లూ లేవు, రప్పలూ లేవు. అన్నీ చెల్లాచెదురైపోయాయి. పెద్ద పెద్ద వటవృక్షాలు కూడా నేలకొరిగాయి. వర్షాలు, భారీ వర్షాలు, అతి భారీ వర్షాలు అత్యంత భారీ వర్షాలుగా అంచనా వేసుకొని ఎక్కడికక్కడ జాగ్రత్తలు తీసుకున్నా ఆస్తినష్టాన్ని, పంటల నష్టాన్నీ ఆపలేకపోయింది. దాదాపుగా తీరాన్ని తుడిచి పెట్టేసింది. 14 జిల్లాల్లో తుపాను ప్రభావం తీవ్రంగా ఉంది. చెప్పాలంటే ఈ తుపాను తెలుగు రాష్ట్రాల్లో డేంజర్ బెల్స్ మోగించింది. కోనసీమలో కొబ్బరి చెట్లు, తీరానికి దగ్గరలో ఉన్న అన్నిరకాల వృక్షాలు విరిగి నేలకొరిగాయి. తుపాను సమయంలో రోడ్ల మీద జనం లేకుండా చూడటం వలన ప్రాణనష్టం గణనీయంగా తగ్గినట్లే. తీవ్రమైన ఈదురుగాలులకే తొలి నష్టాలు నమోదయ్యాయి. విమానాలు సైతం వాతావరణం అనుకూలించక రద్దుచేశారు. రోడ్ల మీద జనసంచారం లేకుండా వాణిజ్య సంస్థలను కూడా మూసివేయించారు. ప్రకాశం బ్యారేజి ఉధృతంగా ప్రవహిస్తోంటే లక్ష క్యూసెక్కుల నీటిని బయటకు వదిలింది. ఆంధ్రాలో249 మండలాలు 48 మునిసిపాలిటీలు తీవ్రస్థాయిలో తడిసి ముద్దవగా 18 లక్షల మంది ప్రజలపై ప్రభావం పడింది. ముందుగా ప్రచండగాలులు వీచి మొంథాతుపాను ఆంధ్రా నుంచి తెలంగాణ మీదుగా ఛత్తీస్‌గఢ్ చేరుకోగా ఆరాష్ట్రంలో కూడా తీవ్ర నష్టాన్ని మిగిల్చే అవకాశం కనపడుతోంది. నందిగామ వద్ద మున్నేరు వాగు పొంగుతోంది. తుపాన్‌ల సమయంలో జారీ చేయాల్సిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. అనంతర సహాయ చర్యలు యుద్ధ ప్రాతిపదికనే జరుగుతున్నాయి.తెలంగాణలో భీమదేవరపల్లిలో41.2అత్యధిక వర్షపాతం నమోదైంది.వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఫ్లాష్‌ఫ్లడ్ హెచ్చరికలు ముందస్తుగానే వాతావరణ శాఖ అందించడంతో ఇక్కడి ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి.పోర్టుల తెలుగు రాష్ట్రాల్లో ప్రధానంగా రాకపోకలు స్తంభించాయి.తుపాను ప్రభావితం ప్రాంతాల్లో ప్రయాణాలు వాయిదా వేసుకునేందుకు వీలుగా రైళ్లు, బస్సులు నిలిపివేయడంతో జనం ఇంటికే పరిమితమయ్యారు. ఆంధ్రా మీదుగా వెళ్లే దాదాపు 137 రైళ్లను రద్దు చేశారు. తెలంగాణలో కొన్ని రైళ్లుభారీ వర్షాల్లో చిక్కుకుని డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో ఆగిపోయాయి. ఈ స్టేషన్‌లో నీళ్లు భారీఎత్తున నిలిచిపోయాయి. ఉమ్మడి వరంగల్, ఖమ్మంవాగులు,వంకలు ఉప్పొంగాయి. మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. హైదరాబాద్ జంటనగరాల్లో కూడా భారీ వర్షాలు కురిసి జనజీవనం లేకుండా చేశాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తుపాను మోత మోగించిన తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో ముందస్తు విద్యుత్ సరఫరా నిలిపివేసి ప్రాణాపాయంలేకుండా జాగ్రత్తపడ్డారు. ఈమొంథా ప్రభావం తమిళనాడును కూడా వదల్లేదు. భారీ వర్షాలతో ముంచెత్తింది. తెలంగాణలో ప్రధాన పట్టణాలన్నీ 2,3 అడుగుల నీటిలో నిండిపోయాయి.రోడ్ల మధ్య గట్లుతెగిపోయాయి. చాలా వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. విజయవాడ నుంచి హైదరాబాద్ జాతీయ రహదారిలో వాహనాలు ప్రయాణించే సౌలభ్యం, సౌకర్యంసరిగ్గా లేదు. కోస్తాతీరాన్ని తుడిచిపెట్టేసినా మొంథా ఇంకా శాంతించినట్లు లేదు. మోస్తరు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. సహాయక చర్యలకు అవరోధాలున్నాయి. ప్రకాశం బ్యారేజి వరద కట్టలు కాపాడుతున్నా ఎగువ ప్రాంతాల్లో కురిసిని వర్షాలతో వరద పెరుగుతుందనే అంచనాలున్నాయి. బ్యారేజ్ దిగువనున్న లంక గ్రామాలు ఇంకా జాగ్రత్తలు తీసుకోదగిన పరిస్థితిలోనే ఉన్నాయి. నెమ్మది నెమ్మది పునరావాస కేంద్రాల నుంచి జనం ఇంటికి చేరేవరకు వారికోసం ప్రభుత్వమే ఏర్పాట్లు ముమ్మరంగా చేయడంవలన కాస్తంత వారు కుదుటపడ్డారు.కాగా వారి జీవనోపాధి లేకుండా పోయింది. బాధిత ప్రజలంతా ప్రభుత్వసహాయం కోసం ఎదురు చూస్తున్నారు. అనేక ప్రాంతాల్లో కొట్టుకుపోయిన రహదార్లు, రైల్వేట్రాకుల పునరుద్ధరణకు కార్యచరణ మొదలైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1983, 1986, 1996లో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలకన్నా ఈసారి మొంథాలో ఎక్కువ ఆస్తి, వ్యవసాయం పెటుబడుల నష్టం అధికంగా ఉంటుందని అంచనా మధ్య రైతాంగం కుదేలవుతోంది. నష్టాల అంచనాలో లోపాలు లేకుండా జరిపి ప్రభావిత ప్రజల్ని ఆదుకోవడమే ఒక్కటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం.

మనిషికి సామర్థ్యం చాలా ముఖ్యం. ఆ సామర్థ్యాన్ని సద్వినియోగం చేసేది, జీవితాన్ని లోకకళ్యాణం కోసం మలిచేది సౌశీల్యం.



మహాత్మా గాంధీ

మీకిష్టమైనది పొందటానికి కృషి చేయకపోతే మీకు లభించిన దానితోనే సంతృప్తి పడాల్సి వస్తుంది.



అరిస్టాటిల్

# ప్రజావాక్కు



## ముగిసిన అధ్యాయం

ప్రఖ్యాత దివంగత నటి శ్రీదేవి బాహుబలిలో నటించటానికి ఎక్కువ డబ్బులు అడిగిందని, కొన్ని ప్రత్యేక సదుపాయాలు కోరిందని అందుకే ఆమెను బాహుబలి ప్రాజెక్టులోకి తీసుకోలేదని, తమకు మంచే జరిగిందని బాహుబలి దర్శక నిర్మాతలు బాహాటంగా చెప్పినప్పుడు, అప్పుడే ఆమె వివరణ ఇచ్చారు. కాగా, ఆమె మరణించిన తరువాత కూడా సామాజిక మాధ్యమాలలో, టాక్ షోలలో వ్యాఖ్యాతలు బాహుబలిలో నటించిన ఇతర నటులతో పాటుదర్శకనిర్మాతలను ఈవిషయమై పదేపదే ప్రశ్నలను అడుగుతూ జరిగిపోయిన విషయాన్ని టీవీ, యూట్యూబ్ చానళ్ళలో ప్రసారంచేస్తూ వారివారి రేటింగులను, వ్యూస్‌లను పెంచుకోవాలని చూస్తున్నారు.ఇది ముగిసిన అధ్యాయం అయినా కొందరు పనికట్టుకుని అదేపనిగా చేస్తుండటం జర్నలిజంలో దిగజారుడుతనంగా కనిపిస్తోంది.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం

కర్నూలు శివార్లలోని 'చిన్న టేకూరు' వద్ద వేమూరి కావేరి ట్రావెల్ బస్సు దగ్ధమై 19 మంది సజీవదహనం దుర్ఘటన చోటుచేసుకున్న తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల ఆర్టీఏ అధికారులు గతనాలుగు రోజుల నుండి విపరీతంగా తనిఖీలు చేస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం అన్న సామెతను ఈ విషయంలో తలపిస్తుంది. ఏదైనా ఇటువంటి దారుణాలుజరిగినప్పుడు వారంరోజులు హడావుడి చేసి మళ్లీ యధావిధిగా ఉంటారు. ఒకవేళ పాత యాక్సిడెంట్స్ నుండి ఏమైనా నేర్చుకుని ఉంటే ఈ బస్ యాక్సిడెంట్ జరిగేదికాదు.ఇప్పటికైనాఆర్టీఏ అధికారులు, ప్రతీరోజూ తనిఖీచేసిఅనుమతుల్లేని వాటినిసీజ్ చేయాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## పర్యవేక్షణ తప్పనిసరి

ఇప్పటి కాలంలో చిన్న పిల్లల చేతుల్లో కూడా మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. చదువుకోడానికి, ఆటలకోసం అని మొదలైన ఈ అలవాటు క్రమంగా హానికరంగా మారుతోంది. ఎక్కువసేపు మొబైల్ వాడడం వల్ల కంటి చూపు తగ్గిపోవడం, నిద్ర సరిగా లేకపోవడం, శారీరక చలనం తగ్గిపోవడం జరుగుతోంది. మొబైల్ గేమ్స్ వీడియోలతో సమయంవృథాఅవ్వడంతో చదువుపైదృష్టి తగ్గిపోతోంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## ఎరువుల ప్రభావం

వ్యవసాయంలో రైతులు అన్ని రకాల పంటలు మార్కెట్ లోని ఎరువులు లేకుండా పండించడం లేదు. దీనికి ప్రధాన కారణం అధికదిగుబడి, వేగంగా పెరుగుదల ఆశ,రైతుల్లో పోటీ కూడా. అనేక పరిశోధనలు,అనుభవాలు ఆయా పంటల నుండి వచ్చిన గింజలు తప్పనిసరిగా తినడంవల్ల ఎన్నో అనర్థాలు ఉన్నట్లు తేల్చినవి. వీటిలోవ్యాధులు మనకు బాగా ముప్పు. పంటిచేలకు స్ప్రేచేసే వారికి కూడా మందుల ప్రభావంఉంటుంది.వీటి కోసం పెట్టుబడి చెప్పనక్కర్లేదు. భూసారపరిరక్షణ ఎంతో అవసరం. దీర్ఘకాలంలో దిగుబడి బలహీనతకు గురవుతుంది. అనేక స్వచ్ఛంద సంస్థలు సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ వాటి ద్వారా ఉత్పత్తులను ప్రదర్శిస్తూ ప్రజల వినియోగానికి, తద్వారా వచ్చే సేంద్రీయ సాగుకోసం కృషి జరుగుచున్నది. ప్రభుత్వం కూడా దీని మేలు, రక్షణ గుర్తించింది. త్వరలో వీటికి బాగా గుర్తింపు, సాగు అభివృద్ధి కాగలదు .

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

## ముందస్తు చర్యలు

ప్రకృతి విపత్తుల నుండి మనల్ని మనం రక్షి ంచుకోవడం అనేది చాలాకష్టమైన ప్రక్రియ.హుద్‌హుద్ తుఫాను సమయం అప్పుడు కూడాముఖ్యమంత్రి కృషి అనన్యసామాన్యము. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అత్యంత అందమైన నగరమైన విశాఖపట్నం సిటీను పునర్నిర్మించారు. విద్యుత్ శాఖ వైద్య శాఖలను ఎమర్జెన్సీ సర్వీసులుగా ప్రకటించి అనునిత్యం ప్రజలకు ఆమెచ్చూర్ రేడియో ద్వారా,హామ్ రేడియో ద్వారా వివిధ ప్రసార సాధనాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేయడంలో ఎవరైనా చంద్రబాబు నాయుడు గారి తర్వాతే. వీరి మనస్తత్వం కూల్చి వేయడం కాల్చివేయడం పగ తీర్చుకోవడం కాదు పునర్ నిర్మించడం, పూర్వ వైభవాన్ని కల్పించడం.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## ప్రకృతి విలయాలు

మానవుని అధీనంలో లేని ప్రకృతి విలయాలు మానవాళి మనుగడను కృంగదీస్తున్నాయి.ఇదివరలో హుద్‌హుద్ తుఫాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్నిఅతలాకుతం చేయగా నేటిమొంథా తుఫాను జనావళిని, ఆస్తులను, చేతికొచ్చిన పంటలను అస్తవ్యస్తం చేసింది, ఇంకా చేస్తోంది. రాష్ట్రం ఇప్పుడిప్పుడే గత ప్రభుత్వం చేసిన తప్పిదాలనుండి సరియైన గాడిలోపడుతోంది. ప్రభుత్వం ఏ సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# కృత్రిమ వర్షం కురిసేనా! కాలుష్యం తగ్గేనా?

**ఇది ఒక వైపు మన సాంకేతిక సామర్థ్యాన్ని సూచిస్తు న్నప్పటికీ, మరొక వైపు కాలుష్య నియంత్రణలో మన వ్యవ స్థాగత వైఫల్యాన్ని కూడా ఎత్తి చూపుతోంది. గతంలో నీటి కొరత కోసం జరిగిన ప్రయోగాల ఫలితాలు ఢిల్లీ కాలుష్య సమస్యకు పూర్తి హామీ ఇవ్వలేకపోవచ్చు. కాలుష్యం అనేది ఒక బహుముఖ సమస్య, దీనికి కేవలం తాత్కాలిక మార్గాలను కాకుండా, ప్రభుత్వం, పౌరులు,పరిశ్రమలు చిత్తశుద్ధితో పనిచేసి, ఉద్గారాలను తగ్గించడం, ప్రత్యామ్నాయ ఇంధనాలను ప్రోత్సహించడం, పర్యావరణ నిబంధనలను కఠినంగా అమలుచేయడం వంటి శాశ్వత పరిష్కారాలవైపు దృష్టి సారించాలి. క్లౌడ్ సీడింగ్ వంటి పద్ధతులు అత్యవసర పరిస్థితుల్లో ఉపశమనం కోసం మాత్రమే ఉపయోగపడాలి. అయితే, ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం, కాలుష్యం లేని పర్యా వరణాన్ని నిర్మించుకోవడమే మనందరి ముఖ్య లక్ష్యం కావాలి.**

డి.జె మోహన్‌రావు

దేశ రాజధాని ఢిల్లీ ప్రస్తుతం తీవ్రమైన వాతావరణ కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ప్రతి సంవత్సరం చలికాలం ప్రారంభంలో, ముఖ్యంగా దీపావళి పండుగ తర్వాత, ఢిల్లీఎన్‌సీఆర్ ప్రాంతంలో గాలి నాణ్యత సూచీ (ఎక్యూఐ) ప్రమాదకర స్థాయికి చేరుకోవడం ఆన వాయితీగా మారింది. పొగమంచు దట్టంగా కమ్ముకోవడం వల్ల ప్రజలు శ్వాసకోశ సమస్యలు, కళ్ల మంటలు వంటి తీవ్ర అనారోగ్యాలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కోవడానికి, ఢిల్లీ ప్రభుత్వం ఐఐటీ కాన్పూర్ వంటి సంస్థల సహకారంతో 'క్లౌడ్ సీడింగ్' పద్ధతి ద్వారా కృత్రిమ వర్షం కురిపించేందుకు సిద్ధమైంది. నిజానికి దేశంలో క్లౌడ్ సీడింగ్ ప్రయోగాలు జరగడం ఇదే మొదటిసారి కాదు. గతంలో మన దేశంలో మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రాంతాలలో నీటి కొరత, కరువు నివారణకు ఇటువంటి ప్రయోగాలు జరిగాయి. వాటి ఫలితాలు సందర్భాన్ని బట్టి మారుతూ వచ్చాయి. కొన్ని ప్రదేశాలలో ఈ పద్ధతి ద్వారా వర్షపాతం పెరిగినట్లు నివేదించగా, మరికొన్నింటిలో వాతావరణ పరిస్థితులు అనుకూలించక ఆశించిన ఫలితాలు రాలేదు. ప్రస్తుతం ఢిల్లీలో దీనిని ముఖ్యంగా 'కాలుష్య నివారణ' అనే విభిన్న లక్ష్యంతో చేపడుతున్నారు. దీని ఫలితాల కోసం యావత్ దేశం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. క్లౌడ్ సీడింగ్ అనేది వాతావరణ పరివర్తన సాంకేతికతలో ఒక భాగం. వర్షం పడడానికి అవసరమైనంత తేమ మేఘాలలో ఉన్నప్పటికీ, బిందువులు ఘనీభవించడానికి లేదా బరువుగా మారడానికి సహజ కణాలు లేనప్పుడు ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియలో, విమానం లేదా ప్రత్యేక సాధనాల ద్వారా సిల్వర్ అయోడైడ్, సోడియం క్లోరైడ్ లేదా పొటాషియం అయోడైడ్ వంటి రసాయన ఉత్ప్రేరకాలను అనువైన మేఘాలలోకి విడుదల చేస్తారు. ఈ రసాయనాలు మేఘాలలో తేమతో కూడిన కణాలకు కేంద్ర బిందువులుగా పనిచేసి, నీటి బిందువులు వేగంగా పెరిగేందుకు దోహదపడతాయి. ముఖ్యంగా, సిల్వర్ అయోడైడ్ మంచుస్ఫటికాల నిర్మాణాన్ని పోలి ఉంటుంది. ఇది అతిశీతలీకరణ ద్రవ నీరు (సూపర్ కూల్డ్ లిక్విడ్ వాటర్) ఉన్న మేఘాలలోకి వెళ్లి, నీటి బిందువులను గడ్డకట్టించి, వాటిని బరువైన మంచు స్ఫటికాలుగా లేదా నీటి బిందువులుగా మారుస్తుంది, తద్వారా చివరకు వర్ష రూపంలో నేలపై పడేలా చేస్తుంది. ఢిల్లీలో కాలుష్య కణాలను కడిగివేయడానికి కృత్రిమ వర్షాన్ని కురిపించడం కోసం ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీప్రభుత్వం చేపట్టిన క్లౌడ్ సీడింగ్ ప్రయోగం ప్రధాన ఉద్దేశం కాలుష్యాన్ని తొలగించడమే. కృత్రిమ వర్షంద్వారా గాలిలో ప్రమా



దకర స్థాయిలో పేరుకుపోయిన పిఎం 2.5, పిఎం 10 వంటి సూక్ష్మ కాలుష్య కణాలను నేలపైకి రప్పించి గాలి నాణ్యతను తాత్కాలికంగా మెరుగుపరచవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, ఈప్రయోగం విజయవంతం కావాలంటే అనేక సవాళ్లను అధిగమించాలి. ప్రధానంగా, కృత్రిమ వర్షాన్ని ప్రేరేపించడానికి మేఘాలలో కనీసం 50 శాతం తేమ ఉండాలి. వాతావరణంలో తేమ శాతం తక్కువగా ఉంటే రసాయనాలను విడుదల చేసినా వర్షం కురిసే అవకాశాలు చాలా తక్కువగాఉంటాయి. గతంలో ఈప్రయోగం వాయిదా పడటానికి వాతావరణంలోని ఈ అనుకూలత లోపమే ముఖ్య కారణం. అంతేకాకుండా, కేవలం అనువైన మేఘాలు సరైన ఎత్తులో ఉష్ణోగ్రత వద్ద ఉన్నప్పుడే ఈ ప్రక్రియ పనిచేస్తుంది.ఐఐటీ కాన్పూర్ వంటి సంస్థలు కృషి చేస్తున్నప్పటికీ వాతావరణ అనిశ్చితి, సరైన సమన్వ యం ఈ ప్రయోగ ఫలితాలను ప్రభావితం చేస్తాయి. క్లౌడ్‌సీడింగ్ కాలుష్య సమస్యకు ఒక తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే ఇవ్వగలదు, కానీ ఇది శాశ్వత పరిష్కారం కాదు. కాలుష్య మూల కారణాలైన వాహనాల ఉద్గారాలు, పారిశ్రామిక వ్యర్థాలు, పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను దహనం చేయడం వంటి సమస్యలను కఠినంగా అరికట్టడం ద్వారా మాత్రమే ఢిల్లీ కాలుష్యాన్ని దీర్ఘకాలంలో నియంతించగలం. అంతే తప్ప, ప్రతిసంవత్సరం కృత్రిమ వర్షంపై ఆధారపడటం ఆర్థికంగా, పర్యావరణపరంగా స్థిరమైన పరిష్కారం కాదు. అంతేకాకుండా ఈ ప్రక్రియలో ఉపయోగించే సిల్వర్ అయో డైడ్‌వంటి రసాయనాల దీర్ఘకాలిక పర్యావరణ ప్రభావాలపై అనేక ఆందోళనలు ఉన్నాయి.ఈ రసాయ నాలు మట్టి, నీటి వనరులు, స్థానిక జీవ వైవిధ్యం పై ఎలాంటి ప్రభావం చూపుతాయో అనే దానిపై పారదర్శకమైన, సమగ్రమైన అధ్యయనాలు జరగాల్సిన అవసరం ఉంది.కొన్ని అంతర్జాతీయ నివేదికల ప్రకారం,ఈ రసాయనాల స్థాయిలు ప్రమాదకరంగా లేనప్పటికీ వాటి నిరంతర వాడకం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. ఢిల్లీలో క్లౌడ్‌సీడింగ్ ప్రయోగం అనేది దేశ రాజధాని ఎదుర్కొంటున్న తీవ్రమైన కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించ డానికి జరుగుతున్న ఒక నిస్సహాయ ప్రయత్నంగా చూడవచ్చు. ఇది ఒకవైపు మన సాంకేతిక సామర్థ్యాన్ని సూచిస్తున్నప్పటికీ, మరొక వైపు కాలుష్య నియంత్ర ణలో మన వ్యవస్థాగత వైఫల్యాన్ని కూడా ఎత్తి చూపుతోంది. గతంలో నీటి కొరత కోసం జరిగిన ప్రయోగాల ఫలితాలు ఢిల్లీ కాలుష్య సమస్యకు పూర్తి హామీ ఇవ్వలేక పోవచ్చు. కాలుష్యం అనేది ఒక బహుముఖ సమస్య,దీనికి కేవలం తాత్కాలిక మార్గాలను కాకుండా, ప్రభుత్వం, పౌరులు, పరిశ్రమలు చిత్తశుద్ధితో పనిచేసి,ఉద్గారాలను తగ్గించడం, ప్రత్యామ్నాయ ఇంధనాలను ప్రోత్సహించడం,పర్యావరణ నిబంధనలను కఠినంగా అమలుచేయడం వంటి శాశ్వతపరిష్కారాలవైపు దృష్టి సారించాలి. క్లౌడ్ సీడింగ్ వంటి పద్ధతులు అత్యవసర పరిస్థితుల్లోఉపశమనం కోసంమాత్రమే ఉపయోగపడాలి.ఆరోగ్యకరమైన భవి ష్యత్తు కోసం, కాలుష్యం లేని పర్యావరణాన్ని నిర్మించుకో వడమే మనందరి ముఖ్య లక్ష్యం కావాలి. ●

# విద్యలో నాణ్యత పెంపు అవసరం

తరిగోపుల నారాయణస్వామి

భారత రాజ్యాంగం ప్రజలకు విద్యా హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించింది. ఆ దిశగా 2009లోపార్లమెంటు విద్యా హక్కు చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం ప్రతి చిన్నారికి 6 నుండి 14 సంవత్సరాల మధ్య ఉచిత, తప్పనిసరి విద్య హక్కుగా లభించాలి. ఈ చట్టం 2010లో దేశమంతటా అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం విద్యా నాణ్యతను కాపాడేందుకు, ప్రాథమిక పాఠశాలల్లో బోధించే ప్రతి ఉపాధ్యాయుడు తగిన అర్హతలు పొందినవాడై ఉండాలి. అందులో ప్రధానంగా ఉపాధ్యాయ అర్హత పరీక్షను తప్పనిసరి చేశారు. ఈ పరీక్ష ద్వారా ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని అంచనా వేసే విధానాన్ని ప్రారంభించారు. కానీ 2010కు ముందు దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తమ నియామక నియమాల ప్రకారం ఉపాధ్యాయులను నియమించాయి. ఆ సమయంలో అర్హత పరీక్ష అనే విధానం లేదు. కాబట్టి వేలాదిమంది ఉపాధ్యాయులు తమ అర్హతలు, సేవాభావంతో ప్రభుత్వ పాఠశాలల్లో దీర్ఘకాలంగా సేవలందిస్తున్నారు. ఇటువంటి నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పులో, ప్రస్తుతం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నవారు సైతం టెట్ పాస్ అయి ఉండాలి అని స్పష్టం చేసింది.ఈ తీర్పు దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళనకు దారితీసింది. ఎందుకంటే పదుల ఏళ్లుగా బోధన చేస్తున్న ఉపాధ్యాయులు ఈ కొత్త అర్హతకు ఎలా అనుగుణం కావాలి అన్న ప్రశ్న ముందుకొచ్చింది. 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు అప్పుడు టెట్ రాయే అవకాశం లేకపోయింది.ఇప్పుడు దశాబ్దాల తర్వాత రాయమని చెప్పడం న్యాయపరంగా సాధ్యమే అయినా, మానవతా దృష్ట్యా పరిపాలనా పరంగా ఇది కఠినమైన నిర్ణయమే అనిచెప్పాలి.చట్టం తయారు చేసిన సమయంలో పార్లమెంటు సభ్యులు, నిపుణులు, విద్యా విధాన నిర్ణేతలు 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయుల భవిష్యత్తు గురించి ప్రత్యేక నిబంధనలు ఉంచాల్సిన అవసరం ఉంది. కానీ ఆ అంశం ఆచట్టంలో మరిచిపోయారు లేదా తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు. చట్టాలు రూపొందించేటప్పుడు ప్రస్తుత పరిస్థితులు మాత్రమే కాక భవిష్యత్తులో ఉత్పన్నమయ్యే సమస్యలను ముందుగానే అంచనా వేయడం ప్రజాప్రతినిధుల కర్తవ్యం. కానీ ఆలోచనలోపం వల్ల ఇప్పుడు ఈ సమస్య దేశవ్యాప్తంగా వివాదాస్పదంగా మారింది. ఒకవేళ ఇలాగే ఇతర రంగాల్లో కూడా అమలు చేస్తే ఎలా ఉంటుంది అనేది ప్రశ్న. ఉదాహరణకు 2005లో నియమితులైన ప్రభుత్వ ఇంజనీర్, డాక్టర్, పోలీసు అధికారులందరికీ ఇప్పటి నిబంధనలకు అనుగుణంగా మళ్లీ పరీక్ష రాయండి అంటే అది సాధ్యమా? అదే పరిస్థితి ఇప్పుడు ఉపాధ్యాయులకూ ఎదురవుతోంది. విద్యారంగం అంటే కేవలం బోధన కాదు, అది వ్యక్తిత్వ నిర్మాణానికి పునాది. ఈ రంగంలో అనుభవం, సేవాభావం, విద్యార్థి మానసికత పట్ల అవగాహన అన్నీ కీలకం. ఇలాంటి విలువైన అనుభవం ఉన్నఉపాధ్యాయుల మీద ఒకేచట్టం ద్వారా న్యాయపరమైన భారాన్ని మోపడం తగదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ రాయమని చెప్పడం వారిని అనవసరమైన ఒత్తిడికి గురిచేయడం అవుతుంది. దీనివల్ల విద్యా వ్యవస్థలో ఆత్మవిశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉంది. సేవలు చేస్తున్న ఉపాధ్యాయులు కంటే కొత్తగా వచ్చినవారికి ప్రాధాన్యంఇవ్వబడే పరిస్థితి ఏర్పడుతుంది. విద్యా నాణ్యత పెంపు అవసరం అందరికీ అంగీకారమైనది. కానీ దానికి పరిష్కారం టెట్ పరీక్ష మాత్రమే కాదు. నిరంతర ఉపాధ్యాయ శిక్షణ, బోధన పద్ధతుల నవీకరణ, విద్యార్థి ఉపాధ్యాయ సంభాషణల పునరుద్ధరణవంటి అంశాలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. సుప్రీంకోర్టు తీర్పు వెనుక ఉద్దేశం విద్యానాణ్యతను పెంచడం అయినప్పటికీ, అది పరిపాలనా వాస్తవాలకు అనుగుణంగా ఉండాలి. చట్టం కేవలం పాఠ్యపుస్తకాల్లోనే ఉండకూడదు, దాని అమలులో మానవ విలువలుప్రతిఫలించాలి. ఇప్పుడు అవసరం ఏమిటంటే, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు కలిసి ఈసమస్యపై చర్చించి సానుకూల నిర్ణయానికి రావాలి. 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకై ఒక స్పష్ట మినహాయింపు నిబంధన తీసుకురావాలి. ●

# డిజిటల్ చెల్లింపులలో సరికొత్త అధ్యాయం 'థంబ్ పే'

యేచన్ చంద్ర శేఖర్

బొటనవేలితో ఆర్థిక లావాదేవీలేంటి అని ఆశ్చర్యపోకండి. ప్రభుత్వం,ఇతర చట్ట సంస్థల ఆమోదం పొందిన తరువాత హర్యానాలోని గురుగ్రామ్ ప్రధాన కార్యాలయంగా పుల్కిత్ అహూజ స్థాపించిన ప్రాక్సీసంస్థ ఈ విప్లవాత్మక డిజిటల్ చెల్లింపుల విధానానికి శ్రీకారం చుట్టనుంది. ప్రాక్సీ 'థంబ్ పే'బయోమెట్రిక్స్ ఉపయోగించి సురక్షితమైనఆధార్ అనుసంధానిత యుపిఐ చెల్లింపులను అందిస్తుంది. గ్రామీణ ప్రాంతవాసులు, వృద్ధులు బ్యాంకింగ్ సౌకర్యం తక్కువగా ఉన్న భారతీయులకు ఇది చాలా సౌకర్యవంతంగా ఉండనుంది.ఢిల్లీకి చెందిన స్టార్టప్ అయిన ప్రాక్సీ ద్వారా బయోమెట్రిక్ చెల్లింపు పరికరం 'థంబ్ పే' ఆవిష్కరణతో భారతదేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ సరికొత్త ఆవిష్కరణల దశలోకి ప్రవేశిస్తోంది. ఈ పరికరం వినియోగదారులను ఆధార్ అనుసంధానిత యుపిఐ ప్రామాణీకరణ ద్వారా సురక్షితమైన చెల్లింపులు చేసేందుకు ఉపకరిస్తుంది. ఈ ప్రక్రియ స్మార్ట్ ఫోన్‌లు,కార్డులు లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసే అవసరాన్ని పూర్తిగా తొలగిస్తుంది. ముఖ్యంగా ఈ అధునాతన విధానం స్మార్ట్‌ఫోన్ వ్యాప్తి లేదా డిజిటల్ అక్షరాస్యత పరిమితంగా ఉన్న ప్రాంతాలలో ఆర్థిక లావాదేవీలను సులభతరం చేస్తుంది.భారతదేశం తన వినూత్నమైన, విస్తృతంగా ప్రజాదరణ పొందిన ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) వ్యవస్థ ద్వారా డిజిటల్ చెల్లింపులలో తన ఆధిపత్యాన్ని స్థాపించుకుంటోంది. ఇది భారత ప్రభుత్వ చొరవ పటిష్టమైన డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాల పునాదులపై నిర్మించబడింది. భారత డిజిటల్ చెల్లింపుల విధానం ప్రపంచంలోని రియల్‌టైమ్ డిజిటల్ చెల్లింపు లావాదేవీలలో దాదాపు 50 శాతం వాటా కలిగి ఉండడమేకాక ఇతరదేశాలకు ఒక ప్రేరణాత్మక నమూనాగా నిలుస్తోంది. భారతదేశంలో డిజిటల్ చెల్లింపులు గణనీయమైన వృద్ధిని సాధించడానికి ప్రధానంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) ఎంతగానో దోహదపడింది. ఇది ఇప్పుడు ప్రతినెల బిలియన్ల కొద్దీ లావాదేవీల ప్రక్రియను సమర్థవంతంగా చేపడుతోంది. భారతదేశం రియల్ టైమ్ చెల్లింపుల పరిమాణంలో ప్రపంచంలోనే ముందుంది. భారతదేశంలో యుపిఐ వ్యవస్థ మాత్రమే జూన్ 2025లో 18 బిలియన్లకు పైగా లావాదేవీల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడం, దాని భారీ ప్రజాదరణకు నిదర్శనం. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వంటి అంతర్జాతీయ సంస్థలు నగదు ఆధారిత ఆర్థిక వ్యవస్థల నుండి డిజిటల్ ఆర్థిక వ్యవస్థలకు మారాలని కోరుకునే ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఒక బ్లూప్రింట్‌గా భారత నమూనాను అధ్యయనం చేయడం ఈ విధానం యొక్క విజయానికి దర్పణం. అయితే, స్మార్ట్‌ఫోన్‌లు లేని పౌరులు లేదా యాప్‌లు, క్యూఆర్ కోడ్‌ల గురించి అంతగా అవగాహన లేనివారు డిజిటల్ చెల్లింపుల సౌలభ్యాన్ని విరివిగా వినియోగించుకోలేకపోతున్నారు. ప్రాక్సీ థంబ్ పే ఈ అంతరాన్ని నేరుగా పరిష్కరిస్తుంది. ఆధార్ బయోమెట్రిక్ ప్రామాణీకరణ ఫ్రేమ్‌వర్క్‌ను ఉపయోగించడం ద్వారా,ఇది వినియోగదారులు వారి వేలిముద్ర లేదాబొటనవేలు ముద్రతో చెల్లింపులు చేయడానికి వీలు కల్పిస్తుంది. ఈ ఆవిష్కరణమరింత సమ్మిళిత నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు భారతదేశం ప్రయాణాన్ని వేగవంతం చేస్తుంది.థంబ్ పే పరికరం బయోమెట్రిక్ స్కానర్‌లను ఆధార్ ధృవీకరణతో అనుసంధానించి




వాటిని యుపిఐ ప్లాట్‌ఫామ్‌లకు జోడిస్తుంది. వినియోగదారుడు థంబ్ పే పరికరం బయోమెట్రిక్ రీడర్‌పై బొటనవేలు లేదా వేలును ఉంచగానే,ఆ పరికరం ఆధార్ సురక్షితబయోమెట్రిక్ డేటాబేస్‌తో సరిపోల్చుకుని చూసి, సదరు వినియోగదారుని గుర్తింపును ధృవీకరిస్తుంది. ప్రామాణీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే యుపిఐ లావాదేవీలు నిజ సమయంలో ప్రాసెస్ చేయబడతాయి. వినియోగదారులకు పూర్తి భద్రతను నిర్ధారించే ఈ పద్ధతి స్మార్ట్‌ఫోన్‌లపై ఆధారపడటాన్ని తొలగించడంతో పాటు వ్యాపారులు వినియోగదారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. స్మార్ట్ ఫోన్ అవగాహన ఉన్న పట్టణ భారతీయులలో అధికశాతం మంది యుపిఐ వ్యవస్థలో బాగా కలిసిపోయినప్పటికీ,థంబ్ పే నిజమైన ఉపయోగం గ్రామీణ, అంతగా అభివృద్ధి చెందని పట్టణ ప్రాంత మార్కెట్లలో ఉంది. థంబ్ పే దాదాపు సున్నా శాతం సాంకేతిక సవాళ్ళతో చెల్లింపులను అనుమతించడం ద్వారా ఈ అంతరాన్ని తగ్గిస్తుంది. ఎలాంటి సాంకేతిక ఇతర సవాళ్లు లేకుండా థంబ్ పే విధానం విస్తృతంగా వినియోగంలోకి వస్తే, రైతులు రోజువారీ కూలీ కార్మికులు నగదు లేదా స్మార్ట్‌ఫోన్‌లను తమతో తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. వృద్ధులు వయోజనులు ఒక సాధారణ బయోమెట్రిక్ పరికరంపై తమ బొటన వేలు లేదా వేలును ఉంచడం ద్వారా వారి వారి లావాదేవీలను సునాయాసంగా చేసుకోవచ్చు.భారీ యాప్‌లు లేదా నెట్‌వర్క్‌లపై ఆధారపడాల్సిన పనిలేకపోవడంతో, ఇది వ్యాపారులకుకూడా అత్యంత సౌకర్యవంతంగా ఉంటుంది. ఇటీవలి కాలంలో భద్రత గోప్యతా పరిగణనలు, డేటా గోప్యత బయోమెట్రిక్ దుర్వినియోగం గురించి పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో, థంబ్ పే కఠినమైన భద్రతా ప్రోటోకాల్‌లకు కట్టుబడి ఉంటుందని ప్రాక్సీ భరోసా ఇస్తోంది. లావాదేవీలు ఆధార్ సురక్షిత ఫ్రేమ్‌వర్క్‌పై ఆధారపడి ఉండడం,వినియోగదారు బయోమెట్రిక్‌లు పరికరంలో నిల్వ చేయబడవు కనుక ఎన్‌క్రిప్టెడ్ ధృవీకరణ గుర్తింపు పూర్తి రక్షణను నిర్ధారిస్తుంది. ఈ వ్యవస్థ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ పి సి ఐ) మార్గదర్శకాలతో కూడా అనుసంధానించబడినందున, ఇది సురక్షితమైన సమగ్ర డిజిటల్ ఫైనాన్స్ కోసం ప్రభుత్వం నియమని బంధనలకు అనుగుణంగా ఉంటుంది. అంతేకాదు, బయోమెట్రిక్ చెల్లింపుల రేసులో థంబ్ పే భారతదేశాన్ని ముందు వరుసలో ఉంచబోతోంది. రాబోయే సంవత్సరాల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ మార్కెట్ 5 ట్రిలియన్ డాలర్లకు మించి ఉంటుందని అంచనా. చైనా "పామ్ పే" వ్యవస్థలో ఉపయోగించే ఖరీదైన పామ్‌స్కాన్ వ్యవస్థల మాదిరిగా కాకుండా,'థంబ్ పే" భారతదేశంప్రస్తుత ఆధార్ యుపిఐ మౌలిక సదుపాయాలపై అభివృద్ధి చేయబడడంతో, చైనా పామ్ పే మాదిరిగా డేటాపై రాజీపడకుండా లేదా వినియోగదారుల నుండి అదనపు డేటాను సేకరించకుండానే డిజిటల్ చెల్లింపు సేవలను అందిస్తుంది. చిన్న దుకాణాలు, గ్రామీణ మార్కెట్లు పెద్ద రిటైల్ అవుట్‌లెట్‌లలో ఉపయోగించడానికి అనుకూలంగా సాధారణ బ్యాటరీ శక్తితో పనిచేసే 'థంబ్ పే" పరికరం రెండు వేలరూపాయల లోపే ఉంటుంది. ఇది ఆధార్‌లింక్ చేయబడిన బ్యాంక్ ఖాతాలకు నేరుగా కనెక్ట్ అవుతుంది కాబట్టి, అటువంటి ఖాతా ఉన్న ఎవరైనా ఎటువంటి అదనపు రిజిస్ట్రేషన్ లేకుండా దీనిని ఉపయోగించవచ్చు. ఈ పరికరం ఇప్పటికే పైలట్ ట్రయల్స్‌ను పూర్తి చేసుకొని ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఈ రెండు నియంత్రణ సంస్థల నుండి ఆమోదం పొందినతర్వాత,ప్రాక్సీ బ్యాంకులు ఫిన్‌టెక్ సంస్థలతో దశలవారీగా 'థంబ్ పే' విధానాన్ని అమలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. "డిజిటల్ ఇండియా" లక్ష్యసాధనలో భాగంగా భారత ప్రభుత్వం చాలా కాలంగా ఆధార్‌ఆధారిత చెల్లింపు వ్యవస్థను బ్యాంకులు,ఇతర చెల్లింపు సేవాప్రదాతల ద్వారా ప్రోత్సహిస్తోంది. థంబ్ పే సరిగ్గా ఈసూత్రాలపై అభివృద్ధి చేయబడడంతో,ప్రభుత్వ మద్దతుగల చొరవలను సమర్థవంతంగానిర్వహించి అంతగా సాంకేతిక పరిజ్ఞానం లేని వినియోగదారులకు చక్కనిపరిష్కారాన్ని అందించే అవకాశంఉంటుంది. ●

# అకాల వరద ముప్పునకు కుదేలైన రైతులు

## కష్టమంతా గంగపాలు..లబోదిబో మంటున్న అన్నదాత

**యద్దపాడు, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** ఆరుగాలం కష్టపడి పండించే పంట రైతు చేతులలోకి వచ్చేసరికి వారికి దోరకమైన ఇబ్బందులు వెంటాడుతూనే ఉన్నాయి గత ఆరేడు సంవత్సరాల నుండి ఇదే తంతు. అన్నింటిని ఎదుర్కొని పండించిన చివరికి వారికి సరాలలో సరిఅయిన గిట్టుబాటు ధరలు లేక అప్పుడూ ఇబ్బందులు తప్పటంలేదని అంటున్నారు రైతులు. మండలంలోని అన్ని గ్రామాలలోని రైతుల పరిస్థితి ఇంచు మించు ఒకే విధంగా ఉంది. ఇందులో ఎక్కువగా దెబ్బతిన్న గ్రామాలలో దింతెన పాడు, సొలస, లింగారావుపాలెం గ్రామాలు నక్కవాగు ప్రవాహం వల్ల దెబ్బతిన్నాయి. మిగిలిన గ్రామాల లో అధిక వర్షాలకు పల్లపు ప్రాంతాలలో ఉన్న పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఏపుగా పెరిగిన ప్రతి పంట మాత్రం పూర్తిగా పూత, పిందె రాలిపోయి ఉండని, మొక్కకు ఉన్న అడుగు



కాపు మొత్తం పూర్తిగా కుళ్ళిపోయి ఉండని అంటున్నారు. ఇప్పటివరకు నానాతంటాలు పడి అప్పులుచేసి పంటలను కాపాడుకున్నామని, అదికాస్తా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని విలవిలలాడుతున్నారు. వరదల ఉధృతికి రోడ్లు, చెరువులు, కుంటలు తెగిపోయాయి. కనీసం అధికారులు పంటల వివరాలు, నష్టాన్ని పరిశీలిస్తామని ఇప్పటివరకు రాలేదని, రైతులను ఆదుకోవాలన్నారు. ఒక ప్రక్క నీటిలో ఉన్న పంటలను కాపాడుకుందామని అనుకున్న ఎప్పుడు పడితే అప్పుడు వర్షం పడటంతో ఉన్న నీరు బయటకు పోకముందే మరలా నీరు చేరటం వల్ల పంటలు అసలు దేనికీ పనికిరావని అంటున్నారు. ఇప్పటి వరకు పెట్టుబడులు పెట్టటమేగాని పంట చేతికందిన పాపాన పోలేదని వాపోతున్నారు.

# కమ్మ, కాపుల మధ్య చిచ్చుపెట్టేందుకు జగన్ కుట్ర : ఎమ్మెల్యే 'కన్నా'

సత్తెనపల్లి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : రాష్ట్రంలో కమ్మ, కాపుల మధ్య చిచ్చుపెట్టేందుకు మాజీ సీఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. గురువారం స్థానిక విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్న సంఘటనను బూతద్దంలో చూపి శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వత్తిపాడు నియోజకవర్గంలో ఆర్థిక ఇబ్బందులతో శేషమ్మ అనే మహిళ ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆ సంఘటనను సైతం వైకాపా నాయకులు



రాజకీయం చేయడం శోచనీయమన్నారు. 2019-2024లో రాష్ట్రంలో అరాచకపాలన సాగిందన్నారు. అందుకే ప్రజలు వైఎస్సార్‌సీపీని ఓడించారన్నారు. అయినప్పటికీ ఆ పార్టీకి బుద్ధి రాలేదన్నారు. తుఫాన్ వలన ఎటువంటి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, నూరిబాషా, జానీబాషు, తోట శ్రీనివాసరావు, అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 1998 డిఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేయండి

## --విద్యాశాఖమంత్రి లోకేష్‌ను వేడుకున్న అభ్యర్థులు

గుంటూరు విద్య, అక్టోబర్ 30, ప్రభాతవార్త : డిఎస్సీ 1998క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని డిఎస్సీ 1998రిమైనింగ్ క్వాలిఫైడ్ క్యాండిడేట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.శ్రీనివాసరావు గురువారం సచివాలయంలో విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శ్రీనివాసరావు



విద్యాశాఖమంత్రి లోకేష్ దృష్టికి పలు అంశాలను తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం రాకముందు చంద్రబాబు నాయుడు, లోకేష్‌ల దృష్టికి సమస్యను తీసుకొచ్చామని ప్రజాగళం పాదయాత్రలో, ప్రజాదర్బార్లో వినతి పత్రాలు ఇదే సమస్య పరిష్కారం కొరకు అందించడం జరిగిందన్నారు. 1852మంది డిఎస్సీ 1998క్వాలిఫై అభ్యర్థులు ఉన్నారన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే అందరికీ ఉద్యోగాలుఇస్తామని అప్పట్లో హామీ ఇవ్వడం జరిగిందని శ్రీనివాసరావు ఈ సందర్భంగా లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికీ కూటమి ప్రభుత్వం వచ్చి 16నెలలు అవుతుందని మేము అనేక మార్లు ఉన్నతాధికారులను కలిశామని, విద్యాశాఖ కమీషనర్ విజయరామరాజును ప్రిన్సిపాల్ సెక్రటరీ కోన శశిధర్‌ను కలసి వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. క్వాలిఫైడ్ అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇవ్వకుండా 590మందికి ఉద్యోగాలు కల్పిస్తే మిగిలినవారికి అన్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా లోకేష్‌ని వేడుకున్నారు. ప్రభుత్వం అందరికీ ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో ఆయా అభ్యర్థులకు ఆత్మహత్యలే శరణ్యం అవుతాయని దయవుంచి అభ్యర్థుల పట్ల కనికరం చూపి సమస్యను పరిష్కరించాలని ఫెడరేషన్ నాయకులు కె.శ్రీనివాసరావు ఈసందర్భంగా మంత్రి నారా లోకేష్‌ను దీన మనస్సుతో వేడుకున్నారు.

# క్రైస్తవ రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించాలి

## -మతమార్పిడి వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలి

గుంటూరు విద్య, అక్టోబర్ 30, ప్రభాతవార్త : క్రైస్తవులకు ప్రత్యేక రక్షణచట ్టం అమలు చేయాలని, మతమార్పిడి వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని తదితర 16డిమాండ్ల సాధనకొరకు డాక్టర్ గోళ్ళమూడి రాజసుందరబాబు ఆధ్వర్యంలో పలు క్రైస్తవ సంఘాలు, పాస్టర్ల భారీ ర్యాలీ గురువారం జరిగింది. స్థానిక నగరంపాలెంలోని మూడుబొమ్మల సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్ వరకు కొనసాగింది. ర్యాలీలో భారీ ఎత్తున పాస్టర్లు క్రైస్తవ యువత పాల్గొని పెద్దఎత్తున నినాదాలు చేశారు. కలెక్టరేట్ ఎదుట క్రైస్తవులు, పాస్టర్లు వినూత్న పద్ధతిలో మోకాళ్ళపై తమ



డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ 16డిమాండ్లపై ఒకరి తర్వాత ఒకరు ప్రార ్ధనలు చేశారు. ఈ సందర్భంగా మీడియాను ఉద్దేశించి డాక్టర్ రాజసుందర్‌బాబు మాట్లాడుతూ చర్చిలో ్ల శాంతి సమాధానాలు గురించే బోధనలు జరుగుతాయని, పాస్టర్లు కూడా శాంతి బోధనలు చేస్తారే కానీ ఎలాంటి హింసాత్మక బోధనలు చేయరని తెలిపారు. భారత దేశాన్ని క్రైస్తవ మిషనరీలు ఎంతో సంస్కరించారని పలు దుర్మార్గమైన చట్టాలను రద్దు చేయించి, అనేక ఉత్తమమైన చట్టాలు చేయించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. విద్య, వైద్యం దేశానికి అందించింది క్రైస్తవ మిషనరీలేనని, వారి సేవల వల్ల భారతదేశంలో పలు సామాజిక ఆర్థిక సాంస్కృతిక మార్పులు సంభవించాయని ఆయన గుర్తుచేశారు. పాస్టర్ జి.సుధీర్‌కుమార్ కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వం, సీఎం, జిల్లా కలెక్టర్, ఎసీ ్ప, ప్రభుత్వ యంత్రాంగం గురించి వారి సంక్షేమం కోసం ప్రార్ధించారు. లూథరన్ చర్చి పాస్టర్లు రెవ.శామ్యూల్ కోటేశ్వరరావు, బిషప్ రెవ.వరబాబు, వీరారెడ్డి, షేక్ మదర్, పాస్టర్ దయారత్నం ప్రముఖ క్రైస్తవ నాయకులు లింగంగుంట్ల సాల్మన్‌రాజు, ఆలిండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గడ్డం సురేష్, ఇద్వా సంఘం అధ్యక్షులు బేతపూడి భారతి తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ ని కలసి 16డిమాండ్ల ను రాష్ట్ర ప్రభుత్వానికి పంపాల్సిందిగా వినతిపత్రం సమరి ్పంచారు

# వివిఐటియులో "ఐక్యా 2కే25"

గుంటూరు విద్య, అక్టోబర్ 30, ప్రభాతవార్త : వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ యూనివర్సిటీలో ఐఈటిఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఐక్యా 2కే25 సాంకేతిక సదస్సు ఘనంగా ప్రారంభమైనట్లు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. ఈ సదసు ప్రారంభ కార్యక్రమానికి సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్



ఇంజనీర్ సిహెచ్ దినేష్‌రెడ్డి ఐఆర్ఎస్ఈఈ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండురోజుల పాటు నిర్వహించనున్న సదస్సులో 30కళాశాలలకు చెందిన 1400మంది విద్యార్థులు పాల్గొన్నారు. కోడ్ వర్డ్, స్పెల్ బిడ్, ఐక్యా ఇన్నోవేషన్ హాక్‌థాన్, హాగ్వార్ట్స్ హంట్ వంటి 15సాంకేతిక అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. సిహెచ్ దినేష్‌రెడ్డి ఐఆర్ఎస్ఈఈ మాట్లాడుతూ విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్‌పై దృష్టి సారించాలని తెలిపారు. డీన్ డాక్టర్ కె.గిరిబాబు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.భానుమూర్తి పాల్గొన్నారు.


## బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన కృష్ణా జిల్లా, విజయవాడ నివాసి లక్కరాజు కృష్ణకిషోర్ నుంచి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియ జేయునది ఏమనగా.. నా క్లయింటు అయిన లక్కరాజు కృష్ణ కిషోర్ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని, గుంటూరు జిల్లా, తెనాలి పట్టణ కాపురస్తుడు తాళ్లూరి (కందాళం) సౌభాగ్యం గారి వద్ద నుండి క్రయమును పొందుటకు ఖరారు పడియున్నారు. కావున ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలు గానీ ఉన్న యెడల ఈ క్రింది నెంబరుతో తెలియజేయగలరు. (లక్కరాజు కృష్ణకిషోర్: 970555 8294)

**షెడ్యూలు:** గుంటూరు డి. తెనాలి రె.డి. యిలాకా, తెనాలి మునిసిపల్ టౌన్ సర్వే దాఖలా 7వ వార్డు, 2వ బ్లాక్, టియస్.నెం.46లో ఉన్న స్థిరాస్థి వివరములు:

**తూర్పు:** మున్సిపల్‌న రోడ్డు, **దక్షిణం:** కోట బదరీనాథ్ వగైరాలు ఆస్థి హద్దు. **పడమర:** బోసురోడ్ అను మున్సిపలన బజారు హద్దు, **ఉత్తరం:** కె.చంద్రమోహన్‌గారి ఆస్థి కిన్నీ, నా తాలుకూ వేరే ఆస్థి కిన్నీ మధ్యగల జాయింటు గోడ హద్దు.


**న్యాయవాదులు**
**జి.వజ్రమ్మ, 781804 3445,**
**ఎస్.సుభాష్‌బాబు, 944066 3551,** తెనాలి



# గుంటూరు వార్త

సత్యమేవ జయతే



తుఫాన్ ప్రభావం, టెక్నాలజీ సాయంతో నష్ట నివారణపై గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)

# రైతులను ఆదుకుంటాం, ధైర్యంగా ఉండండి: మనోహర్

తెనాలి టౌన్ అక్టోబర్ 30 (ప్రభాతవార్త): ఇటీవల వచ్చిన తుఫాను ముఖ్యంగా రైతులకు చాలా నష్టం మిగిల్చిందని, వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్య పడాల్సిన అవసరం లేదని స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రైతులకి ధైర్యం చెప్పారు. గురువారం మండల గ్రామమైన పెదరావూరులో తుఫాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా రైతులతో



మాట్లాడుతూ, మీరంతా ధైర్యంగా ఉండాలని నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఏ ఒక్క రైతుకూడా అధైర్య పడవలసిన అవసరం లేదన్నారు. భారీ వర్షాల కారణంగా పాడైపోయిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వమే రైతుల వద్ద నుండి కొనుగోలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. త్వరలోనే వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి నష్టపోయిన రైతాంగానికి కౌలు రైతులకు కూడా నష్టపరిహారం అందించడం జరుగుతుందన్నారు. జరిగిన పంట నష్టాన్ని స్వయంగా పరిశీలించిన మంత్రి నాదెండ్ల మనోహర్, మేట మునిగిన పొలాల రైతులతో స్వయంగా మాట్లాడి నష్ట తీవ్రతపై అంచనా వేస్తున్నట్లు వారికి పూర్తిస్థాయిలో ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ కెవి. గోపాలకృష్ణ, మండల వ్యవసాయ అధికారి సుధీర్ బాబు, పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# తుపాన్ ప్రభావిత ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటన

## నల్లమడ వాగును తప్పనిసరిగా ఆధునీకరిస్తాం.

కాకుమాను అక్టోబర్ 30, ప్రభాతవార్త: మండల పరిధి అప్పాపురం, కొండపాటూరు గ్రామాలలో వరద ప్రభావిత ప్రాంతంలో స్థానిక ఎమ్మెల్యే బూర్ల. రామాంజనేయులు గురువారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ నల్లమడ ఆదునీకరణకు సుమారుగా నాల్గువందలయభై కోట్ల రూపాయలు అవసరం అవుతుంది అని అన్నారు. బడ్జెట్ సమావేశాలలో



తప్పనిసరిగా ఆమోదించుకోని నల్లమడ ఆదునీకరణ చేప్పటడం జరుగుతుంది. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న సమయంలో నిదులు మంజూరు చేస్తే రివర్స్ టెండర్ పేరిట వైకాపా ప్రభుత్వం మురగపెట్టింది అని అన్నారు. వచ్చే సంవత్సరం వర్ష కాలం సమయానికి నల్లమడ, కృష్ణ కెనాల్ రెండు తప్పనిసరిగా ఆదునీకరణ చేయడం జరుగుతుంది అని రైతులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి నేతలు రైతులు పాల్గోన్నారు.

# దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : నియోజకవర్గంలోని అమరావతి మండల పరిధిలో ఉన్న ఎండ్రాయి, చావపాడు, మద్దూరు, వైకుంఠపురం గ్రామాల పరిధిలోని పంట పొలాలను గురువారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. పంటనష్టంతో రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ప్రభుత్వం అండగా



ఉంటుందన్నారు. ప్రతి రైతుకు కలిగే నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందే విధంగా చూస్తామన్నారు. అధికారులు వేగంగా నష్టం అంచనాలను, నివేదికలను తయూరు చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ, నాయకులు, వ్యవసాయ అధికారులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు

# ఘనంగా నేషనల్ టీచర్స్ డే సెలబ్రేషన్స్

గుంటూరు విద్య, అక్టోబర్ 30, ప్రభాతవార్త : ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ప్రొఫెసర్స్ యూనియన్ స్టేట్ ప్రెసిడెంట్ కె.బాబ్జి ఆధ్వర్యంలో కెవిఆర్ కాలేజీ లో నేషనల్ టీచర్స్ డే సెలబ్రేషన్స్ జరిగాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి అప్సా డెమొక్రాటిక్ స్టేట్ ప్రెసిడెంట్ జి.మోహనరావు, అపుస్మా స్టేట్ ప్రెసిడెంట్ కే.తులసీ విష్ణు ప్రసాద్, శరత్‌చంద్ర సివిల్స్ కోచింగ్ సంస్థ చైర్మన్, శరత్‌చంద్ర హర్ష ఐఐటి మెడికల్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డిలు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు.

# రైతులు అధైర్యపడొద్దు ప్రభుత్వం ఆదుకుంటుంది

## చీఫ్‌విప్ జీ.వీ, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన

వినుకొండ, అక్టోబర్30, ప్రభాతవార్త: మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉండి ఆదుకోవడం జరుగుతుందని అధైర్యపడొద్దని చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు భరోసా ఇచ్చారు. పంట నష్టం అంచనా వేసేందుకు ఈపూరు మండలం కొచ్చెర్ల గ్రామంలో తుఫాను వల్ల దెబ్బతిన్న వరి పొలాలను ఎన్జీ రంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, నగేష్‌తో కలసి జీ.వీ గురువారం పరిశీలించారు. కీలక దశలో పంట దెబ్బతినడంతో



దిగుబడిపై తీవ్ర ప్రభావం తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. జీ.వీ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో సుమారు 50వేలకు పైగా పంట నష్టం జరిగిందని రైతులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆందోళన చెందవద్దని చెప్పారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో



రైతులు మిగిలిన పంట రక్షించుకునేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు తప్పక పాటించాలని పేర్కొన్నారు. ఈ క్రాఫ్ నమోదు పెండింగ్‌లో ఉన్న రైతులకు కూడా న్యాయం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న ముందస్తు చర్యలు వల్ల ఎటువంటి, ఆస్తి ప్రాణనష్టం లేకుండా ప్రజలను సురక్షితంగా కాపాడామన్నారు.

**నూజెండ్ల మండలంలో పర్యటన:** మండలంలోని పువ్వాడ, ఉప్పలపాడు, తలార్లపల్లి, గొల్లపాలెం తదితర గ్రామాల్లో జీ.వీ పర్యటించారు. తుఫాను వల్ల దెబ్బతిన రోడ్లను, విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. జీ.వీ మాట్లాడుతూ తుఫాను కారణంగా నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు, విద్యుత్ స్తంభాలు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు అన్ని శాఖల అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశామన్నారు. తుఫాను బాధిత ప్రజలు, రైతులు ధైర్యంగా ఉండాలని జరిగిన నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# జిఎంసి స్ఫూర్తిదాయక కృషి : మేయర్, కమిషనర్

గుంటూరు నగరపాలక సంస్థ, అక్టోబర్ 30, ప్రభాతవార్త : జిఎంసి పరిధిలో మొంథా తుఫాన్ సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా సమర్థవంతమైన చర్యలు చేపట్టామని మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమీషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావాన్ని తగ్గించేందుకు అధికారులు ముందుగానే సమన్వయంతో పని చేయడం వల్ల, నగరంలో ప్రధానమైన ఇబ్బందులు తలెత్తకుండా పరిస్థితిని అదుపులో ఉంచగలిగామని చెప్పారు. అదనపు కమీషనర్ చల్లా ఓబులేసు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్



సమర్థవంతంగా పనిచేసిందన్నారు. నగరంలో 76పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా సమస్యాత్మక ప్రాంతాల్లోని 30కేంద్రాల్లో 1943మంది చేరారని, వారికి ఆహారం, తాగునీరు, మౌలిక వసతుల కల్పన చేశామన్నారు. 90ప్రాంతాలోల కూలిన చెట్లను తొలగించామని, 50అడుగులకు పైగా ఎత్తున్న 6బోర్డులను, 69పెద్ద, 123చిన్న హోర్డింగ్స్‌ని తొలగించామన్నారు. శిధిలావస్థలో ఉన్న 71భవనాలకు నోటీసులు ఇచ్చామన్నారు. తుఫాన్ పరిస్థితుల్లో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పబ్లిక్‌హెల్త్, హార్టీకల్చర్ విభాగాలు, ముఖ్యంగా నియోజకవర్గాల స్పెషల్ అధికారులైన డిప్యూటీ కమీషనర్లు, విభాగాధిపతులు, నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, ప్రజారోగ్య, ఇంజనీరింగ్ కార్మికులు అంకితభావంతో పనిచేసి తమ కర్తవ్య నిబద్ధతను చూపారన్నారు. గత నాలుగైదు రోజులుగా అధికారులు ప్రజాప్రతినిధులు, సిబ్బంది, కార్యదర్శులు, కార్మికులు ఒకటే టీమ్‌గా రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంలో సమన్వయం చేసుకుంటూ కలసి పనిచేయడం వల్ల తుఫాన్ ప్రభావాన్ని తగ్గించగలిగామన్నారు. ప్రతి ఒక్కరి కృషి అమూల్యమైంది, ఈ కష్ట సమయంలో ప్రజలకోస రాత్రింబవళ్ళు పనిచేసిన అధికారులు, సిబ్బందికి ప్రజాప్రతినిధులకు నగరపాలక సంస్థ నుండి హృదయపూర ్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

# బాధితులను అన్నివిధాలా ఆదుకోవడమే అత్యంత కీలకం

గుంటూరు కల్చరల్, అక్టోబర్ 30, ప్రభాతవార్త : కొద్దిరోజులుగా రాష్ట్రాన్ని భయోత్పాతానికి గురిచేసిన మొంథా తుఫాన్ ఆంధ్రప్రదేశ్‌ను అల్లకల్లోలం చేసిందని అయితే ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా వ ్యవహరించడం ఆస్తినష్టం, ప్రాణనష్టం కొంతమేరకు తగ్గిందని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది. ముఖ్యమంత్రి నుండి మంత్రుల వరకు మారథాన్ సమీక్షలు నిర్వహిస్తు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారని రెవెన్యూ, విద్యుత్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు, ఆశా, అంగన్‌వాడీ పారా మెడికల్ సిబ్బంది ప్రశంసనీయమైన కృషి చేశారని అవగాహన సంస్థ అభినందిస్తుంది. కొబ్బరి, అరటి తోటలు విస్తృతంగా దెబ ్బతిన్నాయని ఈ ఏడాది పంటల బీమా పథకం కూడా రాష్ట్రంలో అమల్లో లేకపోవడం దురదృష్టకరమైన విషయమని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది. అవసరమైన ఎన్యూమరేషన్ వెంటనే ప్రారంభించాలని అవగాహన సంస్థ సభ్యులు కోరారు.


కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీస్, డి.నెం.54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 8331011695, ఇ-మెయిల్ : armvij@canarabank.com

## స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన**

కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విజయవాడ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన క్రింద పేర్కొన్న బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్‌ల అధీకృత అధికారిచే లాంఛనాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది.20.11.2025న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు ఇందుమూలముగా తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు ఆకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

**ఇ-వేలం తేది & సమయం : తేది.20.11.2025, మ॥ 2.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు** (అమ్మకం ముగిసే వరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో) **ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది : 20.11.2025, మ॥ 12.00 గం॥ల లోపు**

**రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/ NEFT ద్వారా తేది: 20.11.2025, మ॥ 12.00 గం.లలోగా పొందుపరచి జమ చేయాలి.**

| ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్నీ ఖాతాలు ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విజయవాడకు బదిలీ చేయడమైనవి) | ఆస్తి వివరములు | రిజర్వు ధర (రూ.లలో) | ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%) |
|---|---|---|---|
| ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ మెస్సర్స్ సీతారామ ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న వారు : 1. ఋణగ్రహీత : గోగిరెడ్డి శివా రెడ్డి, 2.సహ-ఋణగ్రహీత: అల్లు రామ బ్రహ్మారెడ్డి బకాయి మొత్తం : రూ.31,30,569.56 పై + వడ్డీ + ఇతర ఖర్చులు | ఆస్తి నెం.1: గుంటూరు జిల్లా, మాచర్ల మండలం, గుంటూరు మాచర్ల, సొసైటీ కాలనీ, సాయిబాబా గుడి దగ్గర, సమీప డి.నెం. 14-2-243 వద్ద 220 చ॥గ॥ల విస్తీర్ణం గల నివాస ఖాళీ భూమి శ్రీ గోగిరెడ్డి శివారెడ్డి, తండ్రి : లక్ష్మారెడ్డి గారికి చెందినది. హద్దులు: డీడ్ ప్రకారం. | రూ. 23.76 లక్షలు | రూ. 2.37 లక్షలు |

**ఆస్తి తనిఖీ తేది & సమయం : తేది.15.11.2025, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు**
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com) లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 8331011695.

బ్యాంకుకు తెలిసిన / తెలియని బకాయిలు / ట్యాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతో పాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్న వాటికి రూ.10,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్న వాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ.50,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసే లోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనలు కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి : మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ (baanknet). వెబ్‌పోర్టల్ : "https://baanknet.com/eauction-psb" , హెల్ప్ డెస్క్ : 7046612345/6354910172/8291220220/ 9892219848/8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది : 24-10-2025, ప్రదేశం : విజయవాడ | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్



## నేడు చీఫ్‌విప్ జీ.వీ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

వినుకొండ, అక్టోబర్30, ప్రభాతవార్త: నేడు ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తపేట నందు గల కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా వినతులను జీ.వీ స్వీకరిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

## పెట్రోల్ బంక్ ప్రారంభం



వినుకొండ, అక్టోబర్30, ప్రభాతవార్త: మండలంలోని అందుగుల కొత్తపాలెం వద్ద నూతనంగా ఏరా ్పటు చేసిన శ్రీరంగ ఫిలింగ్ స్టేషన్ పెట్రోల్ బంక్‌ను ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్యే జీ.వీ, డీసీసీబీ ఛైర్మన్ మక్కెనలు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బంక్ నిర్వాహకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మిరప పొలాలు పరిశీలించిన జిల్లా అధికారులు



నూజెండ్ల, అక్టోబర్30, ప్రభాతవార్త: తుఫాను నేపథ్యంలో నియోజకవర్గంలోని మిరప పంట పొలాలను జిల్లా ఉద్యానశాఖాధికారులు గురువారం పరిశీలించారు. వినుకొండ మండలం నరగాయపాలెం, కొత్తపాలెం, నూజెండ్ల మండలం వి.అప్పాపురం, మారెళ్ళవారిపాలెం గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించి రైతులకు తగిన యాజమాన్య పద్ధతులు తెలియజేశారు. పొలాల్లో నీరు నిల్వ లేకుండా బయటకు వెళ్ళే మార్గాలు ఏర్పరుచుకోవాలన్నారు. వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలని చెప్పారు. తలలు వాల్చిన మొక్కలు తేరుకోవడానికి లీటర్ నీటికి 10గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో కీటక శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేంద్రరెడ్డి, వినుకొండ ఉద్యాన అధికారి షేక్ నబి రసూల్, గ్రామ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బాల్‌బాడ్మింటన్ కిట్లు అందజేత



వినుకొండ, అక్టోబర్30, ప్రభాతవార్త: జాతీయ స్థాయిలో బాల్‌బాడ్మింటన్ పోటీల్లో మెడల్స్ సాధించిన శావల్యాపురం మండలానికి చెందిన ఐదుగురు క్రీడాకారిణులకు ఒక్కొక్కరికి రూ.5వేలు విలువ కలిగిన బాల్ బాడ్మింటన్ కిట్లను రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో బహుకరించడం జరిగింది. పట్టణంలోని ఎన్నెస్పీకాలనీ జెడ్పి హై స్కూల్ నందు జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఏరువ వెంకట నారాయణ, కార్యదర్శి షేక్ బాజీ, కోశాధికారి నవీన్, జిల్లా ముఖ్యులు ఆలా శ్రీనివాసరావు, సభ్యులు నాగేంద్రుడు మాస్టారు, స్కూల్ హెచ్ఎం వీరప్పయ, పద్మజ మేడం, పీడీ రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు సీఎంగా ఉండటం ఆంధ్ర రాష్ట్ర అదృష్టం: యాగంటి

మాచర్ల, అక్టోబరు 30 ప్రభాతవార్త: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు గత అయిదు రోజులుగా తుపాను పరిస్థితులను ఆర్‌టీజీఎస్ కేంద్రం నుంచి సమీక్షిస్తూ అధికారులను, ప్రజలను అనుక్షణం అప్రమత్తం చేసి తుపాను వల్ల జరిగే తీవ్ర నష్టాన్ని నివారించగలిగారని, ఒక్క ప్రాణం కూడా పోకుండా ప్రజలను కాపాడగలిగారని, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో చంద్రబాబు సీఎంగా ఉండటం ఆంధ్ర రాష్ట్ర అదృష్టమని మాచర్ల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. తుపాను పరిస్థితులపై ఆయన మాట్లాడుతూ ఒక్క



ప్రాణ నష్టం జరగకుండా ప్రజలను కాపాడారని చంద్రబాబును కొనియాడారు. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు టీడీపీ యువ నాయకులు నారా లోకేష్, ఆర్టీజీఎస్ సెంట్రల్ నుంచి పీఎంఓ కార్యాలయానికి తుపాను సమాచారాన్ని అందించారన్నారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న కుటుంబాలకు రూ.3 వేలు ఆర్థికసాయం, నిత్యావసర సరుకులు అందించారన్నారు. తుపాను వల్ల పంట నష్టాన్ని అధికారులు అందించిన వెంటనే కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. మత్స్యకార కుటుంబానికి 50 కేజీల బియ్యం, నిత్యావసర సరకులు అందిస్తున్నారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కూడా అధికారులను అప్రమత్తం చేసి ఎలాంటి నష్టం జరగకుండా వెల్దుర్తి మండలంలోని ముంపు గ్రామాల ప్రజలను పునరావాసాల కేంద్రాలకు తరలించి ఆహారంతోపాటు వైద్యసహాయం అందేలా చేశారన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో ఉన్న రైతులందరూ కూడా ఇన్సూరెన్సు డబ్బు అందుతుందన్నారు. రాష్ట్రంలో తుపాను వల్ల జరిగిన నష్టానికి పీఎం మోడీ సాయమందిస్తారన్నారు. తుపాను వల్ల ధ్వంసమైన రోడ్లు, విద్యుత్తు లైన్లను వెంటనే కూటమి ప్రభుత్వం పునర్నిర్మాణం చేపడుతుందన్నారు. తుపాను వేళ నిద్రాహారాలు మాని ప్రజలకు ప్రభుత్వాన్ని రక్షణగా నిలిపిన ప్రజా బాంధవుడు చంద్రబాబు అని కొనియాడారు. కార్యక్రమంలో తిక్కా కొండలు, బొట్టు కోటేశ్వరరావు, పిన్నంరెడ్డి కృష్ణ, రఫీ, స్వామి, కొత్తపల్లి ప్రవీణ్, బ్రహ్మం, భవానిబాబు, దుబ్బాకుల ప్రసాదరావు, షేక్ మస్తాన్‌రావు, బొడ్డు ఈశ్వరయ్య, బీజేపీ నాయకులు శివ, చెన్న, అంజి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తుపాను ధాటికి కూలిన ఇళ్లను పరిశీలించిన హౌసింగ్ అధికారులు



మాచర్ల, అక్టోబరు 30 ప్రభాతవార్త: బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తీవ్ర తుపాను కారణంగా మాచర్ల మండల పరిధిలో కూలిన, దెబ్బతిన్న గృహాలను హౌసింగ్ అధికారులు పరిశీలించారు. మాచర్ల మండల హౌసింగ్ అధికారి మరియదాసు మాట్లాడుతూ మాచర్ల మండల పరిధిలో ఏడు గృహాలు కుప్ప కూలినట్లు చెప్పారు. విజయపురిసౌత్‌లో 3, కంభంపాడులో 1, రాయవరంలో 2, జమ్మలమడకలో 1 తుపాను ధాటికి పడిపోయాయన్నారు. పడిపోయిన గృహాల బాధితులను గుర్తించి వారి వివరాలను సేకరించారు. జిల్లా అధికారులకు నివేదికలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆయా గ్రామాల వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

మాచర్ల, అక్టోబరు 30 ప్రభాతవార్త: స్థానిక నారాయణ స్కూల్ విద్యార్థులు లెడ్ కాన్ఫిడెంట్‌లో ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా ఏజీఎం జానకిరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ ఏ పాఠశాలలో లేని విధంగా నారాయణ విద్యాసంస్థలు విద్యార్థుల పట్ల అంకితభావంతో కూడిన విద్యా ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో లెసన్ ప్లానింగ్ ద్వారా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఉల్లారెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ముఖ్య ఉద్దేశం గడచిన అయిదు నెలల్లో విద్యార్థులు నేర్చుకున్న విద్యను ప్రాజెక్టు రూపంలో ప్రదర్శించడం. వచ్చిన అతిథులకు, తల్లిదండ్రులకు వివరించారన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ గౌసియా, ఇన్‌ఛార్జి ఉదయలక్ష్మి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో పోలీసు స్టేషన్లో ఓపెన్‌హౌస్

మాచర్ల, అక్టోబరు 30 ప్రభాతవార్త: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని మాచర్ల పట్టణ పోలీసు స్టేషన్లో గురువారం ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పట్టణ ఎస్సై అనంతకృష్ణ పోలీసు విధుల గురించి, నేరాలు అరికట్టడం, శాంతి భద్రతలను కాపాడటంలో తీసుకునే చర్యలపై వివరించారు. స్టేషన్లోని పలు విభాగాలు, నిర్వహణ, ప్రతి విభాగాన్ని



విద్యార్థులకు చూపిస్తూ వాటి పనితీరును వివరించారు. లాకప్ గదులు, నేరాల గురించి వివరించారు. కేసు నమోదు, ఎఫ్ఐఆర్, కంప్యూటర్ విభాగం, ఆయుధాల పనితీరుపై అవగాహన కల్పించారు. వెపన్స్ ఉపయోగించడం, సీసీ ఫుటేజీ పరిశీలన తదితర అంశాలను వివరించారు. అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన నంబర్లు, సోషల్ మీడియా, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆయేషా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



## పంట పొలాల పరిశీలన

కారంపూడి, అక్టోబరు 30 ప్రభాతవార్త: కారంపూడి మండలంలోని పలు గ్రామాల్లో మొంథా తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన వరి పొలాలను తహశీల్దారు ఆర్.వెంకటేశ్వర్లు నాయక్, మండల వ్యవసాయాధికారి పోట్ల నరసింహారావులు పరిశీలించారు. అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రం సిబ్బంది నష్టపోయిన పంట పొలాలను పరిశీలిస్తుందన్నారు. వరి పొలం గింజ గట్టిపడే దశలో ఉన్నందున పొలంలో నీటిని అంతర్గత కాలువల ద్వారా తొలగించాలని, పంటలో నిలిచిన, పడిపోయిన పంటలో కంకిలో మొలకలు కనపడితే 50 గ్రాముల ఉప్పును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. దీనివల్ల కంకులు రంగు మార్పును తగ్గిస్తుందన్నారు. నీరు తగ్గిన తర్వాత ఎకరానికి హెక్సా కోనజోల్ 400 ఎంఎల్/ ప్రొపికోనజోల్ 200 ఎంఎల్ పైరుపై పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వాలిన దుబ్బులను తాళ్లతో కలిపి కట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ సిబ్బంది, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాల్లోని పేదలకు రెడ్ క్రాస్ బాసట

మంగళగిరి, అక్టోబర్ 30: ప్రభాతవార్త: మంగళగిరితాడేపల్లి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న పేదలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ ప్రతినిధులు బాసటగా నిలిచారని నగరపాలకసంస్థ అడిషనల్ కమిషనర్ కె.శకుంతల ప్రశంసించారు. మొంథా తుఫాను నేపథ్యంలో కొండప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజల కోసం ఎంటీఎంసీ ఆధ్వర్యంలో 24 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడమైనది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్, కొత్తపేట బీఆర్ నగర్ మోడల్ ప్రైమరీ, హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న నిరుపేద కుటుంబాలకు దుప్పట్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీచేశారు.



ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగరపాలకసంస్థ అడిషనల్ కమిషనర్ కె.శకుంతల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పునరావాసకేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న పేదలకు ప్రభుత్వం తరఫున అన్ని వసతులు కల్పించామని, అయితే, ఆపదలో వున్నవారిని ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకువస్తుండడం హర్షణీయమన్నారు. సత్వరమే స్పందించి పేదలకు సాయమందించేందుకు ముందుకొచ్చిన రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ ఛైర్మన్ అనిల్ చక్రవర్తి, ప్రతినిధులకు అడిషనల్ కమిషనర్ శకుంతల ధన్యవాదాలు తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ ఛైర్మన్ అనిల్ చక్రవర్తి ఇసునూరు మాట్లాడుతూ పునరావాస కేంద్రాలకు కట్టుబట్టలతో వచ్చిన పేదలకు తక్షణ సాయంగా రూ.60వేల వ్యయంతో 300 మందికి దుప్పట్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ వైస్ ఛైర్మన్ గాజుల శ్రీనివాసరావు, సెక్రటరీ అండ్ ట్రెజరర్ అందె మురళీమోహనరావు, గుంటి నాగరాజు తదితర ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

మంగళగిరి, అక్టోబర్ 30, ప్రభాతవార్త :ఇటీవలి తుఫాన్ బీభత్సం కారణంగా మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామం నుండి నూతక్కి వెళ్లే మార్గమధ్యంలోని తమలపాకు పొలం (6.30 ఎకరాలు) తీవ్రంగా దెబ్బతింది. ఈ పొలంలో సుమారు 50 కుటుంబాలు తమలపాకు సాగు ద్వారా జీవనం సాగిస్తున్నాయి. గాలివానలు, భారీ వర్షాల కారణంగా పంట పూర్తిగా నష్టపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు గత 20 సంవత్సరాలుగా తమలపాకు సాగు చేస్తున్నప్పటికీ ఇంత భారీ నష్టం ఎప్పుడూ చూడలేదని తెలిపారు.



పంట నష్టంతో ఆదాయ మార్గం పూర్తిగా మూసుకుపోవడంతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు..ఈ పరిస్థితిని గమనించిన మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ గురువారం నాడు నష్టపోయిన పొలాలను సందర్శించి రైతులను పరామర్శించారు. పంట నష్టాన్ని ప్రత్యక్షంగా గమనించిన ఆయన మాట్లాడుతూ "రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంత్రి నారా లోకేష్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా నష్టపోయిన రైతులను ఆదుకుంటుంది" అని తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టాలపై పూర్తి స్థాయిలో అంచనా వేయించి, రైతులకు తగిన నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జవ్వాది కిరణ్ స్పష్టం చేశారు.తమలపాకు పొలం సందర్శించిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు మాదల రమేష్ బాబు, అన్నే చంద్రశేఖర్, జనసేన నాయకులు చింతల ఏడుకొండలు, రైతులు ఉన్నారు.

## రూ. 4లక్షల విలువైన ఎల్వోసీ చెక్కు అందజేత



మంగళగిరి, అక్టోబర్ 30, ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న మంగళగిరి 30 వ వార్డుకి చెందిన కుర్ర మురళీకృష్ణ కి మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4,00,000/ విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్వోసీ) మంజూరు పత్రాన్ని బాధితుని ఇంటికి వెళ్ళి అందజేశారు. మంజూరు పత్రాన్ని అందజేసిన వారిలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, 30 వ వార్డు టీడీపీ అధ్యక్షులు భైరబోయిన శివశంకర్, పట్టణ టీడీపీ కార్యదర్శి భైరబోయిన శ్రీనివాసరావు, కాకర్ల సుబ్బారావు, కుర్ర బాబు, మోడీ తిరుపతయ్య ఉన్నారు

## పేదలకు, రైతులకు అండగా కూటమి ప్రభుత్వం: మనోహర్

కొల్లిపర, అక్టోబరు 30 (ప్రభాతవార్త) : తుఫాన్ ప్రభావంతో వరి, అరటి, మినుము పంటలు దెబ్బతినడం బాధాకరమని అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి అంచనా తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.






గురువారం మండల పరిధిలోని తూములూరు లైబ్రరీ సెంటర్‌లో తుఫాన్ కారణంగా పునరావాస కేంద్రాల్లో ఉన్న నిరుపేదలకు నిత్యావసర సరుకులు, నగదు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. తహశీల్దార్ గుమ్మడి సిద్దార్థ అధ్యక్షతన జరిగిన సభలో మనోహర్ మాట్లాడుతూ ఏ ఒక్క రైతు ఆందోళన చెందవద్దని, పంట నష్టపోయిన రైతులు ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. నూరు శాతం సబ్సిడీతో టార్పాలిన్ పట్టాలను రైతులకు అందిస్తామన్నారు. గత ఏడాది ఎన్నడూ లేని విధంగా ధాన్యాన్ని కొనుగోలు చేసి వారికి 24గంటల లోపు వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని చెప్పారు. ఈ ఏడాది కూడా రైతు పండించిన ధాన్యాన్ని ఆఖరి గింజ వరకు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులను, పునరావాస కేంద్రాల్లో ఉన్న నిరుపేదలు ఎటువంటి అధైర్యపడవద్దని కూటమి ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందన్నారు. కూటమి పాలనలో అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 46లక్షల మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయడం జరిగిందని, దీపం పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు రెండు కోట్ల 45లక్షల సిలెండర్లు ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం బొమ్మువానిపాలెం వెళ్ళి కృష్ణానదికి పెరుగుతున్న వరదను పరిశీలించారు. కృష్ణానదికి ఆరు లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున లంక గ్రామాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్, ఎంపిడివో విజయలక్ష్మీ, సర్పంచ్ భూణావత్తు అరుణాబాయ్, నాయకులు అడపా నారాయణరెడ్డి, యర్రు వెంకయ్యానాయుడు, అడపాల నాగేశ్వరరావు, కట్టా శ్రీహరిరెడ్డి, భీమవరపు కిషోర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం అందకపోతే రైతుల తరపున పోరాటానికైనా సిద్ధం

### -మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

కొల్లిపర, అక్టోబరు 30 (ప్రభాతవార్త) : మొందా తుఫాన్‌కు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని లేకుంటే రైతుల తరపున పోరాటానికైనా సిద్ధమని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొల్లిపర, తూములూరు, బొమ్మువానిపాలెం, మున్నంగి, వల్లభాపురం, గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. రైతులను నష్టపోయిన పంటల



వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ 15రోజుల్లో అరటి గలలు మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకునే తరుణంలో పెనుగాలులకు పూర్తిగా అరటి పంట దెబ్బతిందని, ఎకరాకు లక్షా యాబది వేల నష్టం వాటిల్లిందన్నారు. పంట చేతికి రాకపోగా పడిపోయిన అరటి చెట్లను తొలగించడానికి సేద్యం చేసుకోవడానికి రైతులకు మరో రూ.30వేలు అదనంగా ఖర్చు అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పేరు మీద భీమా చేయకపోవడంతో ఈ తుఫాన్ మూలంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రైతులు కష్టపడి సాగు చేస్తున్న పంటలు నీటిలో మునిగిపోవడం, గాలులకు విరిగిపోవడం బాధాకరమన్నారు. వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కల్లం వెంకటప్పారెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి జొన్నల శివారెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు అవుతు సాంబిరెడ్డి, నాయకులు భీమవరపు సంజీవరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, పిల్లి గంగాధర్, వంగా సుధాకర్‌రెడ్డి, చంచల రామిరెడ్డి, మంద్రు రాజు, నెర్ల కుటుంబరెడ్డి, కృష్ణారెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, అవుతు పోతిరెడ్డి, అవుతు శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఛలో హైదరాబాద్.. ను విజయవంతం చేయండి



పెదకూరపాడు, అక్టోబర్ 30 ప్రభాతవార్త : నవంబర్ 1న ఎమ్మార్పీయస్ తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీయస్ పెదకూరపాడు మండల ఇన్‌ఛార్జి కంచర్ల జాన్‌బాబు మాదిగ కోరారు. సుప్రీం కోర్టు జడ్జి గవాయిపై జరిగిన దాడికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందితో నిరసన కార్యక్రమం చేపడుతున్నారన్నారు. మందకృష్ణమాదిగ పిలుపు మేరకు నియోజకవర్గ, మండల, గ్రామాల వారీగా మాదిగ సోదరులు పాల్గొనాలన్నారు.



**అమరావతి, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** నవంబర్ 1న తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అమరావతి ఎమ్మార్పీయస్ మండల అధ్యక్షులు పేరుపోగు వెంకటస్వామి మాదిగ కోరారు. సుప్రీం కోర్టు జడ్జి గవాయిపై జరిగిన దాడికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందితో నిరసన కార్యక్రమం చేపడుతున్నారన్నారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నియోజకవర్గ, మండల, గ్రామాల వారీగా మాదిగ సోదరులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## మైనర్లు వాహనాలు నడపరాదు

అమరావతి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : యువత చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఎస్.ఐ. రాజశేఖర్ అన్నారు. మైనర్ బాలురు వాహనాలు నడపరాదని



చట్టరీత్యా నేరమని తెలిపారు. పట్టుదల, క్రమశిక్షణ, బాధ్యతారహితంగా ఉంటూ విద్యను అభ్యసించి మంచి ప్రయోజకులు కావాలని ఆయన సూచించారు. ప్రమాదాలకు అధిక కారణం మద్యం చెడు అలవాట్లేనని, యువత చిన్న వయస్సు నుంచి మద్యం సేవించడం, గంజాయి లాంటివి అలవాటు చేసుకొని తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని గుర్తు చేశారు. తెలిసి తెలియని వయస్సులో చేసే తప్పులే ప్రమాదాలకు కారణం అవుతాయని ఆయన అన్నారు. యువతకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రుల పైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పల్లోటి ఫాదర్ కిషోర్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అన్న ప్రసాద వితరణ



సత్తెనపల్లి టౌన్ అక్టోబర్ 30ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలో ఏరియా హాస్పిటల్ నందు 104వ సారి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం డొక్కా సీతమ్మ అన్నప్రసాద వితరణ పథకం గురువారం సత్తెనపల్లి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో జనసేన పార్టీ నాయకుడు అప్పాపురపు నరేంద్ర ఆద్వర్యంలో లగ్గవరపు హనుమంతరావు జ్ఞాపకార్థం.దాతలు పులిపాటి బంగారుబాబు.ఆతుకూరి వెంకమోహను.వుటుకూరి మల్లేశ్వరస్వరరావు. పెనుగొండ శివ కోటేశ్వరరావు.గుగ్గిల్లం రమణ 140మందికి నిరుపేద ఓపిరోగులకు ప్రత్యేకంగా గర్భిణీ స్త్రీలకు సహాయకులకు ఉచితంగా భోజనం పంపిణీ చేయటం జరిగింది. డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ పేరుతో జనసేన నాయకులు అప్పాపురపు నరేంద్ర ఈ కార్యక్రమానికి రూపకల్పన గావించి నిస్వార్థంగా చేస్తున్న సేవకు ప్రతిఫలంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా సాగిస్తున్నందుకు అప్పాపురపు నరేంద్రను అభినందించడం జరిగింది.ఈ కార్యక్రమంలోజనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## పులిచింతల డ్యామ్ వద్ద జడపల్లి తండా రైతుల ధర్నా : పంటలకు ముంపు ముప్పు

అచ్చంపేట, అక్టోబర్ 30, ప్రభాత వార్త: పులిచింతల ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగి, ప్రాజెక్టు దిగువన ఉన్న జడపల్లి తండా రైతుల పంట పొలాలు ముంపు ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికే పండుకొస్తున్న పంటలు ఆగం అవుతుండడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు డ్యామ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎన్నిసార్లు అధికారులకు వినతులు చేసినా స్పందన లేకపోవడంతోనే ఆందోళనకు దిగామని వారు తెలిపారు.



రైతులు మాట్లాడుతూ నీటి ప్రవాహం పెరగడం వల్ల పంటలు నశిస్తున్నాయని, ఆర్థికంగా భారినష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. తమకు తగిన నష్టం పరిహారం చెల్లించడం తో పాటు భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు మళ్లీ రాకుండా పొలాల వద్ద రిటైనింగ్ వాల్ నిర్మించాలి అని డిమాండ్ చేశారు. పలు సంవత్సరాలుగా ఇదే సమస్య పునరావృతమవుతుండగా, ప్రభుత్వం ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.


## రంగిశెట్టి వివాహ వేడుకల్లో డాక్టర్ సింగరాజు



సత్తెనపల్లి టౌన్ అక్టోబర్ 30ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం కాకతీయ కళ్యాణ మండపంలో గురువారం జనసేన నాయకుడు, ఏడో వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ అన్న కుమారుడు. రంగిశెట్టి రంగి శెట్టి సాయి గాంధీ, శ్రావణి ల వివాహం కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి దీవెనలు అందజేసిన డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ, వనిత న్యూస్ రాఘవేంద్ర. పల్నాడు జిల్లా వనిత న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ యం వి .రాఘవేంద్ర రావు, తులవ గోపి, సిసింద్రీ, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సత్తెనపల్లిలో పెరిగిన దొంగతనాలు భయాందోళనలో ప్రజలు!

సత్తెనపల్లి టౌన్ అక్టోబర్ 30ప్రభాతవార్త : పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి పట్టణంలో ఇటీవల వరుస దొంగతనాలతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. బైకు దొంగతనాలు, ఇళ్లలో చోరీలు పెరిగిపోవడంతో రాత్రిపూట ప్రశాంతత కరువయ్యింది. ముఖ్యంగా, రాత్రి వేళల్లో వీధుల్లో వీధి దీపాలు లేకపోవడం దొంగలకు మరింత అనుకూలంగా మారుతోంది. ఈ చీకటిని అలుసుగా తీసుకుని దొంగలు తమ చేతివాటాన్ని యథేచ్ఛగా ప్రదర్శిస్తున్నారు.



**అధికారులు ఎటు చూస్తున్నారు?**

ప్రజల రక్షణ, భద్రతపై దృష్టి సారించాల్సిన అధికారులు, ఇతర "సేవా కార్యక్రమాల్లో" నిమగ్నమై స్థానిక సమస్యలను, ముఖ్యంగా శాంతిభద్రతల లోపాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతకు సంబంధించిన ఈ కీలక సమయంలో అధికారుల నిర్లక్ష్యంపై పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**వరుస ఘటనలు ఉదాహరణలు:** ఇటీవలే రఘురామ్‌నగర్‌లో ఒక ఇంట్లో చోరీకి ప్రయత్నించగా, యజమాని ఏర్పాటు చేసిన అలారం మోగడంతో దొంగ పారిపోయిన సంఘటన చర్చనీయాంశమైంది. అలాగే, ఎరువుల దుకాణం వద్ద నిలిపి ఉంచిన ఒక రైతు బైకు కవర్‌లో ఉన్న సుమారు రూ. 3 లక్షల నగదు చోరీ అయిన ఘటన కూడా పట్టణంలో కలకలం రేపింది. ఈ వరుస దొంగతనాల దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అవుతున్నప్పటికీ, నేరాలను అరికట్టడంలో పోలీసులు మరింత చురుకుగా వ్యవహరించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ప్రజల డిమాండ్లు:** వీధి దీపాల మరమ్మత్తు: పట్టణంలో పనిచేయని వీధి దీపాలను తక్షణమే సరిచేసి రాత్రిపూట వెలుగు ఉండేలా చూడాలి.పెట్రోలింగ్ పెంపు: పోలీసులు రాత్రిపూట గస్తీ (పెట్రోలింగ్)ని పెంచాలి, ముఖ్యంగా జనావాసాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో నిఘా పెంచాలి.అధికారుల స్పందన: స్థానిక అధికారులు వెంటనే శాంతిభద్రతల పరిస్థితిపై సమీక్షి ంచి, దొంగతనాలను అరికట్టడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలి.సత్వరమే చర్యలు తీసుకోకపోతే, సత్తెనపల్లిలో దొంగల రాజ్యమే నడుస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇకనైనా తమ వైఖరి మార్చుకుని, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పట్టణవాసులు కోరుతున్నారు.


## వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ



లోయపల్లి (వెల్దుర్తి), అక్టోబరు 30 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పల్నాడు జిల్లాలో ఉధృతంగా కొనసాగుతుంది. పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పిలుపు మేరకు వెల్దుర్తి మండలం లోయపల్లి గ్రామంలో సర్పంచ్ బలిగొడుగుల శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. లాగా అంజి, లాగా నాగరాజు, తాటి కొండ, మండ్లి రంగయ్య, తాటి గురవమ్మ, లాగా బ్రహ్మం, అనంతయ్య, వెంకటేశ్వర్లు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

వెల్దుర్తి, అక్టోబరు 30 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పిలుపు మేరకు వెల్దుర్తి మండలం ఉప్పలపాడులో రచ్చబండ కార్యక్రమాన్ని మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్త



కొండలు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల కోటిరెడ్డి, సింగాల వెంకటేశ్వర్లు, నర్ర మల్లయ్య, కుర్ర పోతురాజు, మందా సీతారామిరెడ్డి, కర్పూరపు కోటిరెడ్డి, బలిగొడుగుల చిన్న గోవిందు, కనకా చెన్నయ్య, పోలగాని అంజయ్య, సింగాల పెదమల్లయ్య, కాటిపల్లి వెంకయ్య, నర్రా బుగ్గమల్లారెడ్డి, బైరెడ్డి రాజశేఖరరెడ్డి, మొగిలి శ్రీకాంత్, తాడి వదనారెడ్డి, సింగాల సుగ్గయ్య, సింగాల చిన్న గురవయ్య, సింగాల చిన్న మల్లయ్య, దేవనపల్లి వెంకటేశ్వర్లు, సింగాల నరేష్, బలిగొడుగుల విజయరాజు, గాడపర్తి కృష్ణమూర్తి, సిరికొండ నాగరాజు, అడక చంద్రయ్య, మల్లాది మణి, తెల్లవరపు నాగేశ్వరరావు, ముక్క వెంకటేశ్వరరెడ్డి, ముక్క గోవిందరెడ్డి, జిడ్డు శేషిరెడ్డి, దాసి గురవయ్య, ఒంటేరు గోవిందు, మాదాసు జయరాం, మక్కా శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ మొగిలి శ్రీశైలం, పాల్గొన్నారు.

## పాఠశాలలకు తెల్సా సంస్థ నుండి విద్యా సామాగ్రి పంపిణీ

యడ్లపాడు, అక్టోబర్ 30, ప్రభాతవార్త : మండల పరిధిలోని అన్ని ప్రాధమిక, యూపి, హైస్కూల్లో ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్దులకు విద్యా సామాగ్రి పంపిణీని తెలుగు సొసైటీ అండ్ అమెరికా స్కూల్స్ సపోర్టు సంస్ద అధ్వర్యంలో అందజేసారు. కార్యక్రమం యడ్లపాడు విద్యావనరుల కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్ద ప్రతినిధి ఘంటశాల కరీముల్లా మాట్లాడుతూ సంస్ద అధ్వర్యంలో విద్యా సామాగ్రి అందజేస్తున్నామని,



ఇందులో అయిదు రకాల నోట్ పుస్తకాలు, పెన్సిల్ బాక్స్ సెట్‌లు, భోజన ప్లేట్‌లు ఉన్నాయని, ఈ వస్దువులు మొత్తం సుమారు 8లక్షల రూపాయల విలువ కలిగియున్నాయన్నారు. అమెరికాలో నివసిస్తున్న తెలుగు సమాజం భారతదేశంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్దుల విద్యా అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు, అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## పంట నష్ట నమోదు ప్రక్రియ ప్రారంభించాం : ఏడి



యడ్లపాడు, అక్టోబర్ 30, ప్రభాతవార్త : మొంధా తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటల వివరములను ఎపిఎఐఎమ్ఎస్ యాప్ ద్వారా వివరములను నమోదు చేయు ప్రక్రియను ప్రారంభించటం జరిగిందని, ఇందులో భాగంగానే క్షేత్రస్దాయిలో నమోదు ప్రక్రియను పరిశీలించటం జరిగిందని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు కే శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండల పరిధిలోని తిమ్మాపురం, యడ్లపాడు, మైదవోలు గ్రామాలలో అయన పర్యటించారు. ప్రభుత్వ అదేశాల మేరకు పంట నష్ట నమోదు ప్రక్రియను గురువారం, శుక్రవారాలలో ప్రభుత్వ అదేశాలనుసారంగా పూర్తిచేయాలని, రైతు సేవా కేంద్ర సిబ్బందికి సూచించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ హరిప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు బిలాల్, అనుపమ, గోపి మరియు అయా గ్రామాల రైతులు పాల్గొన్నారని తెలిపారు.

## పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి : తహశీల్దార్



యడ్లపాడు, అక్టోబర్ 30, ప్రభాతవార్త : పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ విజయశ్రీ పేర్కొన్నారు. మండల పరిధిలోని కారుచోల గ్రామంలో జిల్లా కలెక్టర్ అదేశాలను సారంగా పౌరహక్కుల దినోత్సవాన్ని గ్రామంలోని ఎస్సీ కాలనీలో గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలుంటాయన్నారు. భంగం కలింగించినవారు ఎవరైనా సరే శిక్షార్హులవుతారని, కులవివక్ష, అంటరానితనం, వృద్దులు, మైనార్టీ, దళిత, వెనుకబడిన, సమాన ఉపాధి హామీ తదితర హక్కుల గురించి వివరించారు. కులమతాలకు అతీతంగా అందరు కలిసి ఉండాలని సూచించారు. రాజకీయంగా, సామాజికంగా, అర్దికంగా వెనుకబడిన వారికి రాజ్యాంగం హక్కులు కల్పించిందన్నారు. వీటిని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్లూ ఎ సంతోష్, హాస్టల్ వెల్‌ఫేర్ రాణమ్మ, రెవిన్యూ అర్ఐ సుబ్బారావు, ఎస్ఐ ఇస్మాయిల్, గ్రామ పెద్దలు వెంకటకోటయ్య, సయ్యద్ సద్దాం, మున్నాఫ్, బోడా, గౌస్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రభావాన్ని తట్టుకునే శక్తి..ప్రకృతి వ్యవసాయం ద్వారానే సాధ్యం

యడ్లపాడు, అక్టోబర్ 30, ప్రభాతవార్త : పంటలకు ప్రకృతి వైపరిత్యాలను తట్టుకునే శక్తి ప్రకృతి వ్యవసాయం ద్వారానే సాధ్యం అని జిల్లా ప్రకృతి వ్యసాయ ప్రాజెక్ట్ మేనేజర్ కే అమల కుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని చెంఘీస్కాన్‌పేట గ్రామంలో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్దతులలో



సాగుచేస్తున్న పత్తి పంటలను అలాగే పక్కనే రసాయన వ్యవసాయ పద్దతిలో సాగు చేసిన పత్తి పంటను అమె పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న మొంధా తుఫాన్ ప్రభావం నేపధ్యంలో పత్తి పంటలపై తుఫాన్ ప్రభావం ఎలా ఉందో ప్రత్యక్షంగా పరిశీలించటం జరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయం ద్వారా సాగు అవుతున్న పంటల పరిస్దితిపై రైతులకు వివరించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. పోల్లాల్లో నీరు నిల్వ కాకుండా డ్రైనేజ్ సౌకర్యం కల్పించాలని, కుళ్లిన పువ్వులు, కాయలు తొలగించాలని, వాలి పడిన మొక్కలను సర్దిపెట్టాలని, పంచగవ్య, చాపబెల్లం ద్రావణం పిచికారీ చేయాలని, సూక్ష్మపోషకాలు అందించడానికి జీవామృతం పిచికారి చేయాలని, వేర్లు అరోగ్యంగా పెరగడానికి, నీమాస్త్రం లేదా బీజామృతం పిచికారి చేయాలని, ఫంగస్ నివారణకు వేప గింజల కషాయం లేదా అగ్ని యాస్త్రం పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సౌజన్య, భేబి రాణి, వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

## వివాహ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : పట్టణంలోని కాకతీయ కళ్యాణ మండపంలో గురువారం జరిగిన జనసేన నాయకులు రంగిశెట్టి సాయిగాంధీ – శ్రావణిల వివాహ కార్యక్రమానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలను తెలియజేశారు.



ఎమ్మెల్యే కన్నాకు ఈ సందర్భంగా టిడిపి, జనసేన నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దరువూరి నాగేశ్వరరావు, ఏపిపి భగ్గి నరసింహారావు, న్యాయవాది మురళీకృష్ణ, నాయకులు జానీబాషా, భవన్నారాయణ, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, సిపిఎ నాయకులు లక్ష్మీవెన్నకేశవరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ అన్నప్రసాద వితరణ

సత్తెనపల్లి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : డొక్కా సీతమ్మ అన్నప్రసాద వితరణ 104వ కార్యక్రమం ప్రభుత్వ వైద్యశాలలో గురువారం నిర్వహించారు. జనసేన నాయకులు అప్పారావు నరేంద్ర ఆధ్వర్యంలో ఎల్.హనుమంతరావు జ్ఞాపకార్థం దాతలు బంగారుబాబు, మోహన్, మల్లేశ్వరరావు, శివ కోటేశ్వరరావు, జి.రమణల ఆర్థిక సహకారంతో కార్యక్రమం జరిగింది. వైద్యశాలలోని ఓపి రోగులకు, గర్భిణీ స్త్రీలకు, వారి సహాయకులకు ఉచితంగా భోజన పంపిణీ చేశారు. స్వచ్ఛందంగా వస్తున్న దాతల సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు నరేంద్ర తెలిపారు.

## బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : వరద బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శాశ్వత గృహ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గురువారం ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడు గ్రామంలో పునరావాస కేంద్రంలో బాధితులకు నిత్యావసర సరుకులను అందించారు. తుఫాన్ బాధితులకు బియ్యం 25 కేజీలు, నూనె, పంచదార, కందిపప్పు, ఉల్లిపాయలు, ఆలుగడ్డలు అందించామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా తెలియజేశారు.

## పత్తి, మిరప పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

సత్తెనపల్లి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : మండలంలోని కంటెపూడి గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు, రవిబాబు, ఏవో సుబ్బారెడ్డిలు పత్తి, మిరప పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక తేమ వలన మొక్కలు పోషకాలను భూమి నుండి తీసుకోలేవన్నారు. ఇటువంటి పరిస్థితులలో మొక్కలు ఎండిపోవడం, వడపడటం, ఎర్రబారడం జరుగుతుందన్నారు. దీని నివారణకు యూరియా, పొటాషియం, నైట్రేట్ వాడుకోవాలన్నారు. పత్తిలో గూడ, కాయ రాలడం ఎక్కువగా ఉంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సురేష్, శాస్త్రవేత్తలు కాంతిరేఖ, రాధిక, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం



ముప్పాళ్ల అక్టోబర్ 3, ప్రభాతవార్త: శాశ్వత గృహ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని బాధితులకు శాశ్వత గృహ నిర్మాణాలు చేపడతామని శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ముప్పాళ్ల మండలం గోళ్ళపాడు గ్రామం నందు తుఫాన్ బాధితులకు పునరావాసకేంద్రం దగ్గర నిత్యవసర సరుకులు మరియు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని బాధితులకు అందచేసిన శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ బాధితుల వద్దకు స్వయంగా వెళ్లి ఉచిత నిత్యవసర సరుకులు సరఫరా చేసిన సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నాకు ప్రజలు అభినందనలు తెలిపారు.

# పల్నాడు జిల్లా వార్త



## తుఫాన్ బాధితులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అన్నదానం

నరసరావుపేట, అక్టోబర్ 30 ప్రభాతవార్త : తుఫాన్ ప్రభావంతో నిరాశ్రయులుగా మారిన పలువురికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడారు. రెండు రోజులుగా కురిసిన



భారీ వర్షాలు సామాన్యప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగించాయని తెలిపారు. సిఎం నారాచంద్ర బాబునాయుడు నాయకత్వంలోని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వరదలకు ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకుందని తెలిపారు. అయితే పంట పొలాలను వర్షాలు దెబ్బతీశాయన్నారు. అదే విధంగా లోతట్టు ప్రాంతాలలోని నివాసితుల ఇళ్ళు దెబ్బతిన్నాయని, రోజువారీ కూలీ పనులు చేసుకునేవారు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. అయితే నిరాశ్రయులైన పేదలకు గత రెండు రోజులుగా నియోజకవర్గంలో స్వయంగా తామే ఆహారాన్ని, మంచినీటిని అందిస్తున్నామని తెలిపారు. నరసరావుపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో, పట్టణ శివారు ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా చంద్రబాబునాయుడు కాలనీ, బిసి కాలనీ, చిలకలూరిపేటరోడ్డులలోని టిడ్కో గృహాల వద్ద, ఎస్ఆర్‌కెటి కాలనీ, లింగంగుంట్ల ఎస్.టి.కాలనీలలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వరద ప్రాంతాలలో ఆహారం, త్రాగునీరు లేకుండా ఎవరూ ఇబ్బంది పడకూడదని తగు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా పట్టణానికి నలువైపులా ఉన్న బ్రిడ్జిలు, చప్టాల వద్ద ప్రమాదకరంగా ప్రవహించే వరద నీటిని దారి మళ్ళించి రాకపోకలను సుగమం చేశామన్నారు. దీంతో పాటు అవసరమైన వారికి ప్రాథమిక చికిత్సను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొట్టా కిరణ్, షేక్.రఫీ, రంగిశెట్టి రామకృష్ణ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోండి : వైకాపా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట, అక్టోబర్ 30 ప్రభాతవార్త : నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైకాపా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గోనెపూడి, పమిడిమర్రు గ్రామాల పరిధిలో దెబ్బతిన్న పంట పొలాలను వైకాపా నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తుఫాన్ శాంతించినప్పటికీ రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులు పంటలకు తీవ్ర నష్టాన్ని కలుగజేశాయన్నారు. జిల్లా వ్యాప్తంగా పత్తి, మిర్చి, వరి పొలాలు వేల హెక్టార్లలో సాగు చేశారన్నారు. తుఫాన్‌కు ఉరకెత్తి పంటలను కోల్పోయే పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పత్తి



సాగుకు సంబంధించి ఎకరాకు రూ.60 వేల నుండి రూ.70 వేల వరకు పెట్టుబడులు అయినట్లు తెలిపారు. మరో రూ.15 వేలు కౌలు రైతులు కట్టాల్సి ఉంటుందన్నారు. మిర్చిసాగుకు సంబంధించి ఎకరాకు రూ.40 వేలకు పైగా పెట్టుబడులు అయ్యాయన్నారు. వేల ఎకరాలలో పంటలు కోల్పోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎరువులు, విత్తనాలు, ప్రభుత్వపరంగా వారికి అందించే చేయూత కార్యక్రమాలలో ఎప్పుడూ రాజకీయం చేయలేదని గుర్తు చేశారు. అయితే ఇప్పటి కూటమి ప్రభుత్వం మాత్రం యూరియాను సైతం రాజకీయం చేసిందన్నారు. రూ.280లకు టిడిపి పార్టీకి చెందినవారికి ఇచ్చి యూరియా కావాలంటే టిడిపి కార్యాలయానికి వెళ్ళి స్లిప్పులు తెచ్చుకోవాలని చెప్పడం దారుణమన్నారు. జిల్లా కలెక్టర్ పంటనష్టంపై ఏకంగా నివేదికలు తీసుకొని వారిని ఆదుకునే ప్రయత్నం చేయాలని వైకాపా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఎంఏఎం కళాశాలలో వరల్డ్ స్ట్రోక్ డే



నరసరావుపేట టౌన్, అక్టోబర్ 30 ప్రభాతవార్త : ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో గురువారం వరల్డ్ స్ట్రోక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నెల్లూరి రమేష్ విద్యార్ధులతో మాట్లాడారు. స్ట్రోక్ అనేది మెదడు భాగాలకు రక్త ప్రసరణ ఆగిపోవడం వలన సంభవించే తీవ్రమైన పరిస్థితి అన్నారు. దానిని బ్రెయిన్ అటాక్ అని పిలుస్తారని వివరించారు. సమయానుకూలంగా వేగంగా చికిత్స అందించకపోతే ప్రాణపాయం, శాశ్విత వికలాంగత్వం కలగవచ్చని హెచ్చరించారు. అధిక రక్తపోటు, మధుమేహం, పొగ త్రాగడం, అధిక కొలస్ట్రాల్ వంటి వాటి వలన ఈ పరిస్థితి వస్తుందన్నారు. స్ట్రోక్ లక్షణాలను గుర్తించడానికి ఫేస్ డ్రాపింగ్, ఆర్మ్‌వీక్‌నెస్, స్పీచ్ డిఫికల్టీ, టైమ్ టూ కాల్ ఎమర్జెన్సీ పద్ధతిని గుర్తించుకొని తక్షణం వైద్య సహాయం అందించాలని డాక్టర్ నెల్లూరి రమేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు రజిని, షాలేంరాజు, విద్యార్ధులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బందికి, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నరసరావుపేట క్రైం, అక్టోబర్ 30 ప్రభాతవార్త : పోలీస్ సిబ్బందికి, విద్యార్ధులకు వ్యాసరచన పోటీలను గురువారం నిర్వహించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఈ పోటీలు జరిగాయి. పోలీస్ అధికారులు మహాత్మాగాంధీరెడ్డి, రాజా, కృష్ణ, యువరాజ్ పోటీలను పర్యవేక్షించారు.



వారు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు వారోత్సవాలలో భాగంగా ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. పోలీస్ సిబ్బందితో పాటు పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా వ్యాసరచన పోటీలలో పాల్గొన్నట్లు తెలిపారు. ప్రస్తుత కాలంలో పోలీస్ వ్యవస్థ, సాంకేతిక పరిజ్ఞాన పాత్ర, స్త్రీలు, పిల్లలపై లైంగిక వేధింపుల నుండి రక్షణ, విద్యార్థుల పాత్ర అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. పోలీస్ సిబ్బందితో పాటు విద్యార్ధులలో సృజనాత్మకత, ఆలోచనశక్తిని వెలికి తీసేందుకు ఆధునిక పోలీసింగ్ పట్ల అవగాహన పెంపొందించేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పోటీలలో ప్రతిభ చూపిన సిబ్బందికి, విద్యార్ధులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందిస్తామని అధికారులు మహాత్మాగాంధీరెడ్డి తెలియజేశారు.

## లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట క్రైం, అక్టోబర్ 30 ప్రభాతవార్త : పట్టణంలోని పులుపులవారివీధిలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయ రాతి నిర్మాణానికి భక్తులు గురువారం విరాళం అందజేశారు. వివరాలను కమిటీ సభ్యులు వనమా సాంబశివరావు, వనమా కృష్ణ, కోవూరు శివశ్రీనుబాబు, మురళి, ఎం.సత్యనారాయణ, ఏసిరెడ్డి సుబ్బారెడ్డి, బత్తుల విష్ణు, కొప్పురావూరి నాగేశ్వరరావు తెలియజేశారు. పట్టణానికి చెందిన చిలకల గురవయ్యబాబు – వెంకటలక్ష్మి, చిలకల గురవయ్య – వెంకట పద్మావతి దంపతులు రూ.6,00,116లను అందజేశారు. అదే విధంగా పి.వెంకట సుధాకర్ – ఝాన్సీలక్ష్మి రూ.51,116లను అందించారు. దాతలకు స్వామివారి దర్శనం, తీర్థ ప్రసాదాలను అందించి సత్కరించారు.

## ఎన్ఇసి కళాశాలలో సంగీత వేడుకల నిర్వహణ

నకరికల్లు, అక్టోబర్ 30 ప్రభాతవార్త : నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సంగీత వేడుకల నిర్వహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్ పాల్గొన్నారు. ఏహెచ్‌ఏ



ఇండియన్ ఐడల్ కార్యక్రమంలో పోటీ పడుతున్న గాయకులు కళాశాల విద్యార్ధులతో కలిసి అద్భుతమైన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్ తెలియజేశారు. ఇండియన్ ఐడల్ పోటీలలో పాల్గొంటున్న టాప్‌లో ఉన్న నలుగురు గాయకులు శ్రీష్ఠిచిల్లు, పవన్‌కల్యాణ్, ధీరజ్, బృందాలు తమ మధురమైన గానంతో అలరించారు. విద్యార్థుల హృదయాలను గెలుచుకున్నారు. ఇండియన్ ఐడల్‌లో పాపులర్ పాటలను, సోలూ, గ్రూప్ పాటలు ఆలపించినట్లు తెలిపారు. విద్యార్థులను ఒత్తిడి నుండి బయటకు తెచ్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొంథా విలయం రైతాంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసింది : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబర్ 30, ప్రభాతవార్త: మొంథా పెను విపత్తుతో రాష్ట్ర రైతాంగం కోలుకోలేని విధంగా నష్టపోయిందని, సమస్యను గుర్తించి, మానవవతా ధృక్పథంలో కేంద్రప్రభుత్వం తక్షణం ఆదుకుంటేనే రాష్ట్రంలో సాగు బాగుపడుతుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు



తెలిపారు. గురువారం ఆయన నియోజకవర్గంలో నీటమునిగిన పంట పొలాలను పరిశీలించి, అన్నదాతలతో మాట్లాడి వారి బాధలు తెలుసుకున్నారు. చిలకలూరిపేట మండలం కోమటినేనివారిపాలెం, నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం, ఇర్లపాడు గ్రామాల్లో వరదపాలైన పైర్లను పరిశీలించారు. అనంతరం అమీన్ సాహెబ్ పాలెంలో తుపాను బాధితులకు ఒక్కొక్కరికి రూ.3వేల విలువైన బియ్యం, నిత్యావసరాలు అందించి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన పెట్టుబడిలో సగం అందిస్తేనే రైతులు కోలుకుంటారు.. కాలువల్లో పూడిక తీత పనులపై కూడా ప్రభుత్వం దృష్టి పెడితే బాగుంటుందని ఆయన సూచించారు. పొలాల పరిశీలనకు వెళ్లిన ప్రత్తిపాటి వెంట జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, తేళ్ల సుబ్బారావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, నియోజకవర్గ రైతు అధ్యక్షులు అంబటి సోంబాబు, టీడీపీ నాయకులు గుర్రం నాగపూర్ణ చంద్రరావు, గట్టినేని రమేష్, మాలెంపాటి ఉమా, గుర్రం ఉపేంద్ర, రామాంజీ, నాగేశ్వరరావు, హనుమంతు, ఎమ్మార్వో కుటుంబరావు, అగ్రికల్చర్ అధికారులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## టిడిపి సీనియర్ నేత సుబాని మృతికి సంతాపం

చిలకలూరిపేట, అక్టోబర్ 30, ప్రభాతవార్త: పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, 20వ వార్డు పార్టీ సెక్రటరీ మటన్ సుభాని గురువారం ఉదయం తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకొని తాషా బజార్ లోని ఆయన స్వగృహం వద్ద ఉంచిన పార్థీవదేహాన్ని శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించి, నివాళులర్పించారు.సుబానీ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## నాడు బకాయిలు పెట్టి.. నేడు బుకాయింపులా? : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబర్ 30, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం.ఆర్.ఎఫ్) అందించడంలో ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తోందని, దేశంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వని విధంగా చంద్రబాబు ఇప్పటికే ప్రతి నియోజకవర్గానికి రూ.10కోట్లకుపైగా సాయం అర్హులకు అందించారని ప్రత్తిపాటి చెప్పారు.



నియోజకవర్గంలో ప్రతివారం 30 నుంచి 40 మందికి సీఎం.ఆర్.ఎఫ్ సాయం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో 29 మంది లబ్ధిదారులకు రూ.రూ.23.82 లక్షల విలువైన చెక్కుల్ని స్వయంగా అందించిన అనంతరం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుపై, కూటమిప్రభుత్వంపై విమర్శలు చేసే నైతిక అర్హత గత పాలకులకు, అవినీతిపరులకు లేదని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు బకాయిలు పెట్టి.. నేడు ఏ ముఖం పెట్టుకొని బుకాయిస్తున్నారని ప్రత్తిపాటి ప్రశ్నించారు. టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, రైతు అధ్యక్షులు అంబటి సోంబాబు, గుర్రం నాగపూర్ణ చంద్రరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## నూతన దంపతులకు 'మర్రి' ఆశీర్వాదం



చిలకలూరిపేట, అక్టోబర్ 30, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ ద్వితీయ కుమార్తె వివాహ నిశ్చయ తాంబూలాల వేడుక విజయవాడ నగరంలోని నోవాటెల్ హోటల్‌లో జరిగింది. నూతన వధూవరులు మేఘన చక్రధారి లను శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.

## కడప అమీన్ పీర్ దర్గా ఉరుసుకు మర్రి రాజశేఖర్‌కు ఆహ్వానం

చిలకలూరిపేట, అక్టోబర్ 30, ప్రభాతవార్త: కడప అమీన్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవం నవంబర్ నెల ఆరో తారీకు గురువారం జరగనున్నది. ఆ దర్గా పీఠాధిపతి గౌరవనీయులు హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేనీ చిష్టిఫుల్ ఖాదరి గారి ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగే ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని పీఠాధిపతి వారి ఆదేశముల మేరకు ప్రత్యేక ఆహ్వాన పత్రికను శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్‌కి అందించిన చిలకలూరిపేట వారి శిష్య బృందం...ఈ ఆహ్వాన పత్రికను అందించిన కడప అమీన్ పీర్ దర్గా వారి శిష్యులు షేక్ రవూఫ్, కరిముల్లా, భాషా మేస్త్రి, షేక్ మస్తాన్ వలి , షేక్ నాగూర్, షేక్ ఇక్బాల్ ,, షేక్ ఖాజా పీరు , సయ్యద్ మస్తాన్ వలి తదితరులున్నారు

## రోడ్డుప్రమాదంలో భార్య,భర్తకు గాయాలు

చిలకలూరిపేట, అక్టోబర్ 30, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలం కావూరు వద్ద రోడ్డు ప్రమాదంలోఎండుగుం పాలెం గ్రామానికి చెందిన భార్యాభర్తలు టూ వీలర్ మీద వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది.ఈ ఘటనలో భర్త పిచ్చయ్య (55) కు తీవ్ర గాయాలు. 108కి సమాచారం ఇచ్చిన స్థానికులు వారిని 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రధమ చికిత్స అనంతరం గుంటూరు జనరల్ హాస్పిటల్ కి తరలించారు

## క్షతగాత్రులకు భోజనం వసతి

చిలకలూరిపేట, అక్టోబర్ 30, ప్రభాతవార్త: అమీనసాహెబ్ పాలెం గ్రామంలో పునరావాస కేంద్రం నందు ఆశ్రయం పొందుతున్న 24 మందికి ఈ రోజు మధ్యాహ్నం వారికి గ్రామ పంచాయతీ సర్పంచ్ కామినేని లలిత నాగేశ్వరరావు హకారంతో భోజనం సదుపాయం కలిపించడం జరిగింది.ఈ కార్యక్రమం లో,పంచాయతీ కార్యదర్శి,గ్రామ రెవెన్యూ అధికారి,విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్,ఇతర సిబ్బంది పాల్గొనడం జరిగింది

## వైసీపీ కుట్ర రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలి: బాలాజి



చిలకలూరిపేట, అక్టోబర్ 30, ప్రభాతవార్త: విపత్తును, విపత్కర పరిస్థితులను సైతం రాజకీయం చేయడం ఒక్క వైసీపీకే దక్కుతుందని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కోకన్వీనర్ పెంటేల బాలాజి అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో బాలాజి మాట్లాడుతూ మొంథా తుఫానును ఎదుర్కోవడంలో కూటమి ప్రభుత్వం సమర్ధవంతంగా వ్యవహరించబట్టే ప్రాణనష్టం తగ్గిందని, ముందస్తుగా స్పందించబట్టే పలు ప్రాంతాల్లో వరదలు రాకుండా కాపాడగలిగారని ప్రజలు సైతం ప్రశంసిస్తూంటే ఇది సహించలేని వైసీపీ కుట్రలకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్తినష్టం, ప్రాణనష్టం జరగకూడద్దు అని కూటమి ప్రభుత్వ నిర్దిష్టమైన ఆదేశాలకు అనుగుణంగానే సచివాలయం నుంచి క్షేత్రస్థాయి వరకు యంత్రాంగం మెరుపువేగంతో కదిలారని, ప్రజల నుంచి ఏ ఫిర్యాదు అందినా స్పందించారని తెలిపారు.

## జనవిజ్ఞానవేదిక డివిజన్ సమావేశం

చిలకలూరిపేట, అక్టోబర్ 30, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని ఆర్వీయస్ హైస్కూల్ సమీపంలో ఉన్న జనవిజ్ఞానవేదిక కార్యాలయంలో గురువారం జనవిజ్ఞానవేదిక డివిజన్ సమావేశం జరిగింది. ఇందులో భాగంగా డా.గేయానంద్ గారు రాసిన జనవిజ్ఞానవేదిక ప్రచురించిన "పీపీపీ పేరుతో మెడికల్ కాలేజీల ప్రవేటీకరణ వద్దు" పుస్తకాన్ని ఆవిష్కరించారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు ఏవీ శివయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముక్య అతిథిగా డా.కొల్లా రాజమోహన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ కరణ చేయటం వలన కలిగే నష్టాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డా.పీవీ సుబ్బారావు, డా విన్సెంట్ పాల్, టి. ప్రతాపరెడ్డి, డా.దార్లబుజ్జిబాబు, కంచర్ల కోటేశ్వరరావు తదితరులున్నారు.

## మాజీ సైనికునికి కేంద్రీయ సైనిక బోర్డు సహాయం

రొంపిచర్ల, అక్టోబర్ 30 ప్రభాతవార్త : పూర్తిగా మంచానికే పరిమితమైన మాజీ సైనికునికి గురువారం కేంద్రీయ సైనిక బోర్డు ఆర్థిక సహాయం చేసింది. సైనిక బోర్డు తరఫున ప్రతి నెల రూ.8 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారిణి గుణశీల తెలిపారు. ప్రతి నెల మాజీ సైనికుడు డిడిగాంధీ అనే సైనికునికి ఈ సహాయం అందజేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు ఆళ్ళ సుబ్బారెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఎల్ఐసి రామారావు, దేవరపల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇస్సపాలెం అమ్మవారి ఆలయానికి విరాళం

నరసరావుపేట టౌన్, అక్టోబర్ 30 ప్రభాతవార్త : మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయ నిర్మాణానికి గురువారం దాతలు విరాళం అందజేశారు. వివరాలను ఆలయ ఈవో నలబోతు మాధవిదేవి తెలియజేశారు. నరసరావుపేటకు చెందిన బొలిశెట్టి సుబ్బారావు – రోహిణి, బొలిశెట్టి చంద్రశేఖర్ రాంబాబు – స్వప్న దంపతులు, వారి కుమారులు ఆరుష్, అకిరా విరాళం అందించే కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ నూతన నిర్మాణానికి సంబంధించి రూ.2 లక్షలు నగదును వారు అందజేశారు. వారికి అమ్మవారి దర్శనంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందించే భక్తులకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని ఆలయ ఈవో నలబోతు మాధవిదేవి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవాలని వినతి

రొంపిచర్ల, అక్టోబర్ 30 ప్రభాతవార్త : తుఫాన్ వలన పంటలు నష్టపోయిన రైతులకు కనీసం ఎకరాకు రూ.25 వేలు అందించాలని ఏపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని యల్లమంద, చిన్నతురకపాలెం, చింతలపాలెం, గోనెపూడి గ్రామాలలో రైతు సంఘం నాయకులు పర్యటించారు. కామినేని రామారావు, గోపాలరావు, లక్ష్మయ్య, రామరాజు, నాగేశ్వరరావు, శ్రీహరి, రామాంజనేయులు, కోటేశ్వరరావు రైతులను కలిసి మాట్లాడారు.

బాపట్ల జిల్లా వార్త



## దెబ్బతిన్న పైర్లను పరిశీలించిన నక్కా ఆనందబాబు

కొల్లూరు, అక్టోబరు 30 (ప్రభాతవార్త) : మండల పరిధిలోని దోనేపూడి దిగువును గల లంక గ్రామాల్లో తుఫాను వల్ల దెబ్బతిన్న పైర్లను వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనందబాబు గురువారం పరిశీలించడం జరిగింది.





ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టికల్చర్ అగ్రికల్చర్ పొలాల్లో దెబ్బతిన్న పైర్లను వెంటనే నమోదు చేసి పంట నష్టం పరిహారం రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారుల ఆదేశించడం జరిగింది. అదే విధంగా ఈకేవైసీ చేయించిన పైర్లు నమోదు చేయమని అధికారులు మొండి వైఖరి పక్కన పెట్టి ఇప్పటి వరకు ఈకేవైసీ చేయని పైర్లు కూడా వెంటనే నమోదు చేసి పంట నష్టపరిహారం అందే విధంగా చూడాలని ఆయన అధికారులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కొల్లూరు మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధనప్రసాద్, కొల్లూరు మండల తహశీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కె.నరసింహారావు, సంబంధిత శాఖ అధికారులు, రైతులు పాల్గొనడం జరిగింది.

## బాపట్లలో ఎమ్మెల్యే వర్మ సహాయక చర్యలు అభినందనీయం



పిట్టలవానిపాలెం, అక్టోబర్ 27, ప్రభాతవార్త: బాపట్లలో శాసనసభ్యులు వర్మ తుఫాన్ సహాయక చర్యలు అభినందనీయమని మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు, డాక్టర్ గ్లోరి యానెట్ సాపాటి అన్నారు. ఈ సందర్భంగా గురువారం అమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు దిశ నిర్దేశిస్తే లోకేష్ నాయకత్వంలో బాపట్లలో నరేంద్రన్న అమలుపరచారన్నారు. తుఫాన్ ను ముందుగా అంచనా వేసి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తుచా తప్పకుండ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అమలు చేయించారన్నారు. తుఫాన్ ప్రభావానికి ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ మరియు అన్ని ప్రభుత్వ శాఖలకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. ముఖ్యంగా రెవెన్యూ మరియు పోలీస్ వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. తుఫాన్ సహాయక చర్యలలో పాల్గొన్న కూటమి నాయకులకు ధన్యవాదాలు అని అన్నారు. విపత్కర పరిస్థితులలో శాసనసభ్యులు ప్రజలతో ఉండి, ఎప్పటికప్పుడు పునరావాసకేంద్రాలలోని వరద బాధితులకు కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తూ వారితో కలసి ఉన్నతీరు బాపట్ల నియోజకవర్గ ప్రజలు ఎప్పటికి మరువలేనిదని ఆమె అన్నారు.

## బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలి

పొన్నూరు, అక్టోబరు 30, ప్రభాతవార్త: మొంథా తుఫాన్ సందర్భంగా నష్టపోయిన వారిని ఆదుకొనేందుకు దాతలు ముందుకు రావాలని సర్పంచి వేజండ్ల భ్రమరాంబ కోరారు. మండల పరిధిలోని వల్లభరావుపాలెం గ్రామంలోని పునరావాస కేంద్రంలోని వారికి పాఠశాల ప్రధనోపాధ్యాయురాలు జి.నిర్మలకుమారి-ఎన్డి కాంతారావు దంపతులు దుప్పట్లను పంపిణీ చేశారు.



పునరావాస కేంద్రంలోని బాధితులు చలికి వణుకుతూ కనిపించడంతో స్పందించిన నిర్మల కుమారి అనుకున్నదే తడవుగా దుప్పట్లను తెప్పించి సుమారు 90మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి భ్రమరాంబ మాట్లాడుతూ ఆపద సమయంలో ప్రతి ఒక్కరూ స్పందించాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు స్పందించి దుప్పట్లు పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమన్నారు. నిర్మకుమారి పలువురికి ఆదర్శంగా నిలిచారని గ్రామస్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో షేక్ అబ్దుల్ రవూఫ్, పంచాయితీ కార్యదర్శి ఎ.పృధ్వీ చౌదరి, మండల వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, గ్రామస్తులు వేజండ్ల ఏకాంబరేశ్వరరావు, దొప్పలపూడి గంగయ్య, మదమంచి వీరయ్యచౌదరి, బోడి సుబ్బారావు, బొద్దులూరి వెంకటేశ్వరరావు, బొద్దులూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా ఉంటాం: యన్నం నాయుడు



పొన్నూరు, అక్టోబరు 30, ప్రభాతవార్త: బాధితులకు కూటమి ప్రభుత్వం, నాయకులు అండగా ఉంటామని రాధా, రంగా మిత్రమండలి జిల్లా అధ్యక్షుడు, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు యన్నం నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పిలుపు మేరకు పట్టణంలో మొంథా తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేశారు. పేద ప్రజలు తుఫాన్ వల్ల ఎలాంటి ఇబ్బందులు పడకూడదని మా నాయకులు ఇచ్చిన పిలుపు నందుకొని ఈ కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్ళూరి అప్పారావు, దేశంశెట్టి సూర్య, గోవాడ వెంకటకృష్ణారావు, గంధం సురేంద్ర, ఎలవర్తి వెంకటేశ్వరరావు, మళ్ళీబోయిన గోపీకృష్ణ, తోట నాగరాజు, మిరియాల చంద్రకాంత్, గరికపాటి చిన్నారి, పోకల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కడప అమీన్ పీర్ దర్గా ఉరుసు పోస్టర్ ఆవిష్కరణ



పొన్నూరు, అక్టోబరు 30, ప్రభాతవార్త: ప్రఖ్యాతిగాంచిన కడప అమీన్ పీర్ దర్గా మహోత్సవ పోస్టర్‌ను గురువారం ప్రముఖ వ్యాపారవేత్త షేక్ అబ్దుల్ ఖదీర్ కడప దర్గా స్వామివారి భక్తులతో కలిసి ఆవిష్కరించారు. కడప అమీన్ పీర్ దర్గాలో వచ్చే నెల 5వ తేదీ గంధ మహోత్సవం, 6వ తేదీన ఉరుసు మహోత్సవం జరుగుతాయన్నారు. ఈ మహోత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అబ్దుల్ ఖదీర్‌తోపాటు మొల్లా కరీమ్, మునీర్, తోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నుంచి నిత్యావసరాలు పంపిణీ




పొన్నూరు, అక్టోబరు 30, ప్రభాతవార్త: మొంథా తుఫాన్ సందర్భంగా కురిసిన భారీ వర్షాలకు, ఈదురు గాలులకు ఇబ్బంది పడ్డ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్లే రాష్ట్రంలో తుఫాన్ నష్టాన్ని తగ్గించగలిగామన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో తుఫాను ప్రభావ ప్రాంతాల్లో నిత్యావసరాలను పంపిణీ చేసేందుకు అధికారులు ఎన్యుమరేషన్ చేశారన్నారు. ప్రభుత్వం ఇప్పటికే నిత్యావసరాలు పంపిణీకి జీవో విడుదల చేసిందన్నారు. బాధితులకు 25కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు, కిలో చక్కెర లబ్ధిదారులకు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో మొత్తం 860కుటుంబాలకు ఈ లబ్ధి చేకూరనున్నట్లు చెప్పారు. పెదకాకాని మండలంలో 141కుటుంబాలు, చేబ్రోలు మండలంలో 117కుటుంబాలు, పొన్నూరు పట్టణంలో 380కుటుంబాలు, పొన్నూరు మండలంలో 222కుటుంబాలకు బియ్యాన్ని నిత్యావసరాలను త్వరలో పంపిణీ చేయనున్నట్లు నరేంద్రకుమార్ తెలిపారు.

## రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి



చేబ్రోలు(పొన్నూరు), అక్టోబరు 30, ప్రభాతవార్త: మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ డిమాండ్ చేశారు. చేబ్రోలు మండల పరిధిలోని శేకూరు, నారాకోడూరు, కొత్తరెడ్డిపాలెం గ్రామాల్లో నీట మునిగిన, నేల వాలిన పొలాలను పరిశీలించారు. రైతులు ధైర్యంగా ఉండాలన్నారు. నారాకోడూరు గ్రామంలో నేలవాలిన దొండ పందిరులు, ఇతర కూరగాయల తోటను ఆయన సందర్శించి రైతులను వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఇప్పటికే రైతులు ఈ ఏడాది అనేక విధాలుగా నష్టపోయారని, ప్రభుత్వం ప్రస్తుతం పూర్తిస్థాయిలో ఆదుకోవాలన్నారు. తక్షణ సాయంగా ఎకరాకు రూ.20వేలు నష్టపరిహారం అందజేయాలన్నారు. రైతులు మళ్ళీ నిలదొక్కుకునేందుకు మరో రూ.30వేలు వడ్డీలేని రుణాలను ప్రతి రైతుకు అందజేయాలన్నారు. అంబటి వెంట చేబ్రోలు పార్టీ బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి



పొన్నూరు, అక్టోబరు 30, ప్రభాతవార్త: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బ్రాహ్మణ నిరుద్యోగ యువత కోసం డిసెంబర్ 13వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కోశాధికారి పులిపాక వెంకట సత్యసాయి వరప్రసాద్(ఆడిటర్ ప్రసాద్) తెలిపారు. ఈ జాబ్ మేళా గుంటూరులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో జరుగుతుందన్నారు. దాదాపు 50కంపెనీలకు పైగా ఉద్యోగాల కల్పన కోసం వస్తున్నట్లు చెప్పారు. సుమారు వెయ్యి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఈ మేళా జరుగుతుందన్నారు. మన బ్రాహ్మణ సంఘీయులలోని నిరుద్యోగ యువత కోసమే ఈ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ జాబ్ మేళాలో ఐటి, నాన్ ఐటి, ఫార్మా, బ్యాంకింగ్, ఫైనాన్స్, హస్పటల్స్ మొదలగు రంగాలలో నిరుద్యోగుల వయస్సు, ప్రతిభకు తగ్గట్టుగా ఇప్పుడు జరుగుతుందన్నారు. దరఖాస్తుకు ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజులు లేవన్నారు. నవంబరు 23వ తేదీ లోపు దరఖాస్తులను దాఖలు చేయాలన్నారు.

## పంటనష్టం అంచనాలను తయారు చేయాలి



బాపట్ల, అక్టోబర్30, ప్రభాతవార్త: జిల్లాలో తుఫాను ప్రభావం వల్ల పంట నష్టాలను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని న్యూ. వి.సీ హాల్ లో తుఫాను ప్రభావంవల్ల దెబ్బతిన్న పంట నష్టాల అంచనాలు, కృష్ణా నది, నల్లమడ కాలువలు ప్రవాహం ఎక్కువగా ఉన్నందున తీసుకోవాల్సిన చర్యల పై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తుఫాను ప్రభావం వల్ల దెబ్బతిన్న వ్యవసాయ మరియు ఉద్యానవన పంటల వివరాలను తయారు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన వన పంటలు నష్టపోయిన రైతుల వివరాలను పారదర్శకంగా తయారు చేయాలన్నారు. జిల్లాలో తుఫాను తగ్గినప్పటికీ కృష్ణానది పరివాహక ప్రాంతంలో ప్రవాహం పెరిగినందున మరియు గుంటూరు జిల్లా నుండి వచ్చే నల్లమడ వాగు ప్రవాహం పెరిగినందున చుట్టుపక్కన గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కృష్ణానది నుండి నీటి ప్రవాహం పెరిగే అవకాశాలు ఉన్నందున భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన అధికారులకు చెప్పారు. రేపల్లె బట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఓపెన్ హౌస్





బాపట్ల, అక్టోబర్27, ప్రభాతవార్త: ప్రజలకు పోలీస్ శాఖకు మధ్య సత్సంబంధాలను పెంపొందించడం, పోలీస్ అమరవీరుల త్యాగాలను ప్రజలకు వివరించడమే ముఖ్య ఉద్దేశంతో ఓపెన్ హౌస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే స్మారకోత్సవాలలో భాగంగా గురువారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది విధినిర్వహణలో ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, వాటి పనితీరు, సాంకేతిక సాధనాలను గురించి, వేలిముద్రలు సేకరించే పరికరాలు వాటి ఉపయోగాల గురించి స్వయంగా విద్యార్థులకు వివరించామన్నారు. ఓపెన్ హౌస్" కార్యక్రమాన్ని వీక్షించడానికి బాపట్ల జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 31వ తేది మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మెడికల్ క్యాంపుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, పోలీస్ అమరవీరుల కుటుంబాలను, జిల్లా ప్రజలను ఆహ్వానిస్తున్నామన్నారు ఏఆర్ డీఎస్పీ పి. విజయసారథి, సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, ఎస్బీ సీఐ జి. నారాయణ, ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ అహ్మద్ జానీ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కె. శ్రీనివాసరావు, ఇంకొల్లు సీఐ రమణయ్య, అడ్మిన్ ఆర్ఐ మోలుద్దీన్ అధికారులు పాల్గొన్నారు.

## పోలీసుల సేవలకు ప్రజాప్రతినిధుల ప్రశంస

రవికుమార్‌బాపట్ల, అక్టోబర్30, ప్రభాతవార్త: మొంథా తుఫాన్ సమయంలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించకుండా అహర్నిశలు పనిచేసిన బాపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని, జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ను ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. గురువారం మంత్రులు పార్థసారధి, రవికుమార్‌లు మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో జిల్లాలో విరిగిపడిన చెట్లు, కరెంట్



స్థంబాలు, హోర్డింగులను సమాచారం అందిన వెంటనే కేవలం 20 నుండి 30 నిమిషాల వ్యవధిలోనే వాటిని తొలగించి, ప్రజలకు, ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించారు అదేవిధంగా ప్రమాదాలకు గురైన 24 మందిని అత్యంత వేగంగా స్పందించి రక్షించిన తీరును ప్రజాప్రతినిధులు కొనియాడారు. జిల్లా పోలీసుల పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, మరియు పోలీసు సిబ్బందిని అభినందించిన వారిలో బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, సమాచార, పౌర సంబంధాల శాఖ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ , చీరాల శాసనసభ్యులు మాల కొండయ్య తదితరులు ఉన్నారు. జిల్లా యంత్రాంగం యొక్క తక్షణ స్పందన విధానంపై వారు ప్రశంసలు కురిపించారు.

## పంట నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోండి



బాపట్ల, అక్టోబర్30, ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావంతో బాపట్ల జిల్లాలో వరి, ప్రత్తి, మొక్కజొన్న, కంది పంటలు సాగు చేస్తున్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాపట్ల ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.అచ్యుత రాజుతెలిపారు. ఈ సందర్భంగాద గురువారం ఆయన మాట్లాడుతూ తుఫాను నేపథ్యంలో పంటలను రక్షించుకునేందుకు రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి అవగాహన కల్పించామన్నారు. ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృష్ణా జోన్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం సంచాలకులు ఎం.వి.వి.ఎస్. దుర్గ ప్రసాద్ సూచనల మేరకు రైతులకు సలహాలు అందిస్తున్నామని ఆయన తెలిపారు.

## పాఠశాల విద్యార్థులతో ఓపెన్ హౌస్

పిట్టలవానిపాలెం, అక్టోబర్30, ప్రభాతవార్త: మండల పరిదిలోని చందోలు పోలీస్ స్టేషన్ నందు పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పాఠశాల విద్యార్థులతో చందోలు ఎస్ ఐ మర్రి వెంకట శివకుమార్ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.



ఈ కార్యక్రమం లో భాగంగా స్టేషన్ లో ఉన్న రికార్డులు, స్టేషన్ సిబ్బంది పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు. స్టేషన్ నందు గల కమ్యూనికేషన్ సెట్ గురించి వివరించి వారితో సెట్ లో మాట్లాడించారు. అదేవిధంగా విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి ఏ విధంగా ఉపయోగపడాలో వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమం లో ట్రైనీ ఎస్ ఐ రాజ్యలక్ష్మి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు .



కర్లపాలెం, అక్టోబర్30, ప్రభాతవార్త: మండలంలోని నక్కల వారిపాలెం గ్రామం లో కొలువై ఉన్న శ్రీ తాడిచెట్టు పోలేరమ్మ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి గురువారం దర్శించుకున్నారు. తాడిచెట్టు పోలేరమ్మ అమ్మవారి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా కోన రఘుపతి పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్ఆర్సిపి కర్లపాలెం మండల అధ్యక్షుడు ఎల్లావుల ఏడుకొండలు, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దొంతిబోయిన సీతారామరెడ్డి, పందరబోయిన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పొన్నూరు, అక్టోబరు 30, ప్రభాతవార్త: పాఠశాలకు సంబంధించిన, విద్యార్థులకు సంబంధించిన అన్నీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ ఆదేశించారు.



మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. తుఫాన్ సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఎదురయ్యాయా..? అని అడిగి తెలుసుకొన్నారు. పాఠశాల పరిసరాల్లో వర్షపునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు చదవడం, వ్రాయడం నేర్పించాలన్నారు. విద్యార్థులు నూరుశాతం పాఠశాలకు హాజరయ్యేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పరీక్షలకు సంబంధించిన విద్యార్థుల ప్రగతి కార్డులను పరిశీలించారు.

## తుఫాను బాధితులకు నిత్యావసర సరుకులు అందించిన మంత్రి నాదెండ్ల

**తెనాలి టౌన్ అక్టోబర్ 30, ప్రభాతవార్త:** మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు నిత్యావసరసరుకులు మరియు ఆర్థిక సహాయాన్ని స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లాకలెక్టర్ తమీమ్ అన్సారియ, చేతుల మీదుగా పంపిణీ చేశారు. గురువారం పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బాధితులకు ఆర్థిక సాయంతో పాటు కూరగాయలు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుఫాను సహాయక చర్యల్లో, అధికారయంత్రాంగం పనితీరును మంత్రి నాదెండ్ల అభినందించారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు





నాయుడు ముందుచూపుతో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో కూటమి ప్రభుత్వం తుఫాన్ ని సమర్థవంతంగా ఎదుర్కొందని ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా అధికార యంత్రాంగం సేవలను ప్రజలందరూ అభినందించాలన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వ సహకారంతో, తెనాలి పట్టణాన్ని అభివృద్ధి దిశలో తీసుకెళ్లటానికి ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలన్నారు. అలాగే తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని దివ్యాంగులకు కూడా నిత్యవసర సరుకులు అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం పలువురు దివ్యాంగులు తమ సమస్యలు వివరించగా, మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, తుఫాన్ సహాయక చర్యల్లో జిల్లా వ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు అభినందించదగ్గదన్నారు. జిల్లాలో మొత్తం 453 కుటుంబాలకు చెందిన 9450 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి రక్షణ కల్పించినట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ సంజన సింహ, మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, మున్సిపల్ కమిషనర్ కె.రామ అప్పలనాయుడు, మండల తహసీల్దార్ కెవి.గోపాలకృష్ణ, డిఎస్పి బి.జనార్ధన్ రావు, పలువురు సీనియర్ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.


## పంటపొలాలు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్



తెనాలి టౌన్ అక్టోబర్ 30 (ప్రభాతవార్త): మొంథా తుఫాను కారణంగా, కొల్లిపర మండలంలో దెబ్బతిన్నపంట పొలాలను పరిశీలించి, రైతులను అడిగి జరిగిన నష్టం గురించి తెలుసుకొని వారికి అండగా ఉంటానని ధైర్యం చెప్పిన మాజీ ఎంఎల్ఎ అన్నాబత్తుని శివకుమార్. గురువారం మండలం లోని కొల్లిపర, పాత బొమ్మువానిపాలెం, మున్నంగి, వల్లభాపురం, తదితర గ్రామాలు పర్యటించి, తుఫాన్ కారణంగా దెబ్బతిన్న గృహాలు, వాణిజ్య పంటలను పరిశీలించిన మాజీ ఎంఎల్ఎ శివకుమార్. కళ్ళం వెంకట అప్పారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, జొన్నల శివారెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, ఈద యశ్వంత్ రెడ్డి, చంచల రామిరెడ్డి, నేర్ల కుటుంబరెడ్డి, గుడ్ వెల్ కృష్ణారెడ్డి, నాలాది బుజ్జిబాబు, పిల్లి గంగాదర్, మండ్రు రాజు, ఎంద్రపాటి స్టాలిన్ ఉన్నవ నాని, బొమ్మువానిపాలెం శ్రీనివాసరావు, యద హర్షవర్ధన్ రెడ్డి, బ్రహ్మరెడ్డి, రైతు అధ్యక్షుడు సాంబిరెడ్డి, వెంకటప్పరెడ్డి, వంగా సుధాకర్ రెడ్డి, తాతా సతీష్, భీమవరపు విష్ణువర్ధన్ రెడ్డి, దూర రత్నబాబు, జముడుపాడు బోసుబాబు, వెంకట్ రెడ్డి, బొమ్మువాని పాలెం అనిల్, అవుతు శేఖర్ రెడ్డి, అవుత నగేష్ రెడ్డి, తదితర రైతు నాయకులు పాల్గొన్నారు.

## పండితులచే శ్రవణా నక్షత్ర వేదపారాయణం

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 30 (ప్రభాతవార్త): పట్టణంలోని నాజర్ పేట లోగల విద్యాశంకర భారతీయ నరసింహ సదనంలో వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం శ్రవణా



నక్షత్రాన్ని పురస్కరించుకొని వేద పారాయణ నిర్వహించారు. పండిత సామవేదం సత్యనారాయణ నిర్వహణలో జరిగిన పారాయణ కార్యక్రమంలో పండితులు వేద పనసలను పారాయణం చేశారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, లోకేతార్థంగా ప్రతినెల శ్రవణా నక్షత్రం రోజున వేద పారాయణ కార్యక్రమాన్ని గత 11 మాసాల నుండి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారాయణ అనంతరం పండితులను సమాఖ్య ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు కుందేటి వెంకట సుబ్రహ్మణ్యం, భాగవతుల కామేశ్వరరావు, తాడేపల్లి నాగ సుబ్రహ్మణ్యం, ప్రభాకర్ శర్మ, ఆంజనేయులు, మేడూరు శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలి: సాంబశివుడు



తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 30 (ప్రభాతవార్త): ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ రైతులకు తీవ్ర ఆవేదన మిగిల్చిందని, నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు, డిమాండ్ చేశారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని నేలపాడు గ్రామంలో తుఫాను కారణంగా నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతులని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు నాగ సూర్య శశిధర్ రావు, పెనుగొండ శివకుమార్, స్టీవెన్ బాబు, భీమా రమేష్, బి.శ్రీను, ఎన్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న పోలీసుల ఆయుధాల ప్రదర్శన

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 30 (ప్రభాతవార్త): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా, గురువారం పట్టణంలోని డిఎస్పీ కార్యాలయం వద్ద ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ఆదర్శ పబ్లిక్ స్కూల్, నారాయణ స్కూల్, అలాగే



వివేకా స్కూల్, కెకెఆర్ గౌతమ్ స్కూల్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టూటౌన్ సిఐ కె.రాములు నాయక్, 3 టౌన్ సిఐ ఎస్. సాంబశివరావు విద్యార్థులకు, విధి నిర్వహణలో పోలీసులు ఉపయోగించే ఆయుధాలైన తుపాకులు, సమాచార వ్యవస్థ, రక్షణ కోసం ఉపయోగించే పరికరాల గురించి వాటి యొక్క పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కల్పించే విషయంలో పోలీసులు తమ జీవితాలను సైతం త్యాగం చేస్తున్నారని పోలీసుల సేవలను, అమరవీరుల త్యాగాలను, భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్ఐ ఎస్.కె కరిముల్లా, వన్ టౌన్ ఎస్ఐ కోటేశ్వరమ్మ పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది :తెదేపా నాయకులు

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 30 (ప్రభాతవార్త): తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులు అధైర్య పడవద్దని, వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో, పట్టణ తెదేపా అధ్యక్షులు ఎండి. ఖుద్దుస్ మాట్లాడుతూ, ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందస్తు



చర్యల ఫలితంగా, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి తగిన వసతులు కల్పించి, వారికి ధైర్యం చెప్పిన అధికారులను అభినందిస్తున్నామన్నారు. పెనుగాలుల మూలకం గా వరి అరటి మినుము పంటలు పలుచోట్ల దెబ్బతిన్నాయని కూటమి ప్రభుత్వం వారిని అన్ని విధాల ఆదుకుంటుందని రైతులు అధైర్య పడవద్దని జరిగిన పంట నష్టానికి ప్రభుత్వం తప్పక న్యాయం చేస్తుందని తెలిపారు. దెబ్బతిన్న పంటలను అధికారులు త్వరలోనే పరిశీలించి నష్టాన్ని అంచనా వేయనున్నట్లు వారు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందస్తు జాగ్రత్త వలన తుఫాను నష్ట తీవ్రత తగ్గిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పంటలకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, మండల పార్టీ అధ్యక్షులు ఎన్.నాగేశ్వరరావు, తెలుగు రైతు నాయకులు కావూరి చంద్రమోహన్, పట్టణ తెదేపా కార్యదర్శి వసంతం అశోక్ వర్ధన్, పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

31-10Pg5 9_31-10Pg5.qxd 30/Oct/25 10:18 PM Page 1



# అణు జలాంతర్గామి డ్రోన్ పరీక్ష విజయవంతం


## - రష్యా అధ్యక్షుడు పుతిన్



**మాస్కో, అక్టోబరు 30:** అణ్వాయుధ సామర్థ్యం కలిగిన పోసిడాన్ మానవరహిత అండర్‌వాటర్ వెహికిల్ (అణుజలాంతర్గామి డ్రోన్)ను విజయవంతంగా పరీక్షి ంచినట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. ఆ వెహికల్‌ను జలాంతర్గామి నుంచి బూస్టర్ ఇంజిన్ సాయంతో విజయవంతంగా పరీక్షి ంచినట్లు చెప్పారు. మంగళవారం అణ్వాయుధ టార్పిడో పరీక్ష జరిగినట్లు పుతిన్ పేర్కొన్నారు. పోసిడాన్‌ను అణ్వాయుధ సామర్థ్యం కలిగిన టార్పిడోగా చెబుతున్నారు. అయితే సముద్ర గర్భంలో ఆ టార్పిడో ఆటోమేటిక్‌గా న్యూక్లియర్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేస్తుందని పుతిన్ తెలిపారు. మాస్కోలో మిలిటరీ ఆస్పత్రి సందర్శించిన పుతిన్, అక్కడ మీడియాతో మాట్లాడుతూ... ఇలాంటి ఆయుధం మరొకటి లేదన్నారు. పోసిడాన్‌ను అడ్డగించే విధానం ఏదీ లేదన్నారు. తమ వద్ద ఉన్న ఖండాంతర క్షి పణి సర్మత్ కన్నా బెటర్‌గా పోసిడాన్ తన సామర్థ్యాన్ని చాటినట్లు పుతిన్ వెల్లడించారు. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన బురెవిస్నిక్ క్షి పణిని కూడా ఇటీవల రష్యా పరీక్షి ంచిన విషయం

# అమెరికాలో మళ్లీ అణ్వాయుధ పరీక్షలు

## అధ్యక్షుడు ట్రంప్ ఆదేశం



**వాషింగ్టన్, అక్టోబరు 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా సంచలన నిర్ణయం తీసుకున్నారు. అణ్వాయుద్ధ పరీక్షలు తిరిగి ప్రారంభించాలని తాను డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌ను ఆదేశించినట్లు తెలిపారు. రష్యా, చైనాలు తమ అణ్వాయుధ కార్యక్రమాలను విస్తరిస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మేరకు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. 'ప్రపంచంలోని ఇతర దేశాల కంటే యుఎస్ ఎక్కువ అణ్వాయుధాలు కలిగి ఉంది. నా మొదటి పదవీ కాలంలోనే దీన్ని సాధించాం. దీనికి విపరీతమైన విధ్వంసకర శక్తి ఉన్నందున నేను ఇది చేయడానికి ఇష్టపడలేదు. కానీ.. ఇప్పుడు వేరే మార్గం లేదు. అణ్వాయుధ కార్యక్రమాల్లో రష్యా రెండో స్థానంలో ఉంది. చైనా మూడో స్థానంలో ఉంది. ఐదేళ్లలోపు అవి సమానంగా ఉంటాయి. ఇతర దేశాలు దీని కార్యక్రమాలు విస్తరిస్తున్నందున.. మన అణ్వాయుధ పరీక్షలను తిరిగి ప్రారంభించాలని నేను యుద్ధ శాఖను ఆదేశించాను. ఈ ప్రక్రియ వెంటనే ప్రారంభమవుతుంది' అని ట్రంప్ రాసుకొచ్చారు. రష్యా తన ఆయుధ ఉత్పత్తిని విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల కీలక ఆయుధ నియంత్రణ ఒప్పందాల నుంచి వైదొలగి.. అధునాతన అణు సామర్థ్యాలను విస్తరిస్తోంది. అణుశక్తి ఆధారిత సబ్‌మెర్సిబుల్ డ్రోన్ 'పోసిడాన్'ను విజయవంతంగా పరీక్షించిన సంగతి తెలిసిందే. ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ క్రమంలో బీజింగ్ కూడా ఈన ఆయుధ సంపత్తిని విస్తరిస్తోంది. మరో ఐదేళ్లలోపు చైనా అణు సామర్థ్యాలు.. అమెరికా, రష్యాకు సమాన స్థాయికి చేరుకోగవని యుఎస్ నిఘా వర్గాలు ఇటీవల హెచ్చరించాయి. మరోవైపు.. దక్షిణ కొరియాలోని బుసాన్‌లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీకి కొన్ని గంటల ముందు ట్రంప్ అణుపరీక్షల గురించి ప్రకటన చేయడం గమనార్హం. ట్రంప్ ఆదేశాల గురించి పెంటగాన్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

# స్నేహితురాలి ఇంట్లో మహిళా డిఎస్పీ చోరీ!



**భోపాల్, అక్టోబరు 30:** మధ్యప్రదేశ్‌లో ఓ మహిళా పోలీసు ఆఫీసర్ దొంగతనానికి పాల్పడింది. ఈ ఘటన బోపాల్‌లోని జహంగిరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. తన స్నేహితురాలి ఇంట్లోనే ఆమె నగదు ఎత్తుకెల్లింది. ఈ ఘటన మధ్యప్రదేశ్ పోలీసు శాఖలో తీవ్ర కలకలం సృష్టించింది. పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో కల్పనా రఘువంశీ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే స్నేహితురాలి ఇంటికి వెళ్లి అక్కడ నుంచి రెండు లక్షల నగదు, మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లిందామె. ఈ ఘటనలో ఆ మహిళా డీఎస్పీపై కేసు నమోదు చేశారు. డీఎస్పీ కల్పనపై ఆమె స్నేహితురాలు ఫిర్యాదు చేసింది. మొబైల్ ఫోన్ ఛార్జింగ్ పెట్టి స్నానానికి వెళ్లిన సమయంలో దొంగతనం జరిగినట్లు ఆమె చెప్పింది. స్నానం చేసేందుకు బాత్రూంకు వెళ్లిన సమయంలో డీఎస్పీ కల్పన వచ్చిన క్యాష్, సెల్‌ఫోన్ తీసుకెళ్లిందన్నారు. నగదు, ఫోన్ మిస్ కావడంతో సీసీటీవీ పరిశీలిస్తే ఆ సమయంలో డీఎస్పీ కల్పన వచ్చి వెళ్లినట్లు కనిపించింది. చేతుల్లో కరెన్సీ కట్టలు ఉన్న దృశ్యాలు కనిపించాయి. దీంతో షాకైన ఆ మహిళ పోలీసు స్టేషన్‌కు వెళ్లి డీఎస్పీ కల్పనపై ఫిర్యాదు చేసింది. సీసీటీవీ ఫూటేజ్ ఆధారంగా రఘువంశీపై చోరీ కేసు పెట్టారు.

# కుమార్తెమరణించిన బాధలో ఉన్నా లంచాలు ఇవ్వాల్సి వచ్చింది

## ఓ మాజీ సిఎఫ్‌ఒ ఆవేదన!

**బెంగళూరు, అక్టోబర్ 30:** లంచాలు ఇచ్చి తాను ఎంతగానో విసిగిపోయానని, కుమార్తె మరణించిన బాధలో ఉన్నా ఎవరూ కనికరం చూపలేదని బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి నెట్టింట్లో షేర్ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో సిఎఫ్‌ఒ విధులు నిర్వర్తించినట్లు తన పోస్ట్‌లో పేర్కొన్న ఆయన లింక్డిన్‌లో ఆ పోస్టు షేర్ చేశారు. దాని ప్రకారం బెంగళూరు చెందిన కె.శివకుమార్ 34 ఏళ్ల కుమార్తె అక్షయ మెదడుల్లో రక్తస్రావం కారణంగా సెప్టెంబర్‌లో ప్రాణాలు కోల్పోయారు. తన కుమార్తె బిటెక్, ఐఐఎం అహ్మదాబాద్ నుంచి ఎంబిఎ పూర్తి చేశారని వెల్లడించారు. ఆమె గోల్డ్‌మన్ శాక్స్‌లో కూడా పనిచేశారు. కూతురు మరణించిన తర్వాత లాంఛనాలు పూర్తిచేసి, సంబంధిత పత్రాలు పొందేందుకు అంబులెన్స్ ఆపరేటర్లు, పోలీసు అధికారులు, శ్మశానవాటిక సిబ్బంది, స్థానిక యంత్రాంగానికి చెందిన ఉద్యోగులు ఇలా ప్రతి ఒక్కరికి లంచం ఇవ్వాల్సి వచ్చిందని వెల్లడించారు. నా బిడ్డ మృతదేహాన్ని తరలించడానికి అంబులెన్స్ డ్రైవర్ రూ.3 వేలు వసూలు చేశాడు. ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం రిపోర్ట్ కోసం పోలీస్ స్టేషన్‌కు వెళితే బహిరంగంగానే నగదు డిమాండ్ చేశారు. ఉన్న ఒక్కగానొక్క బిడ్డ చనిపోయి నేనుంటే అలాంటి తండ్రిపట్ల వారు ఎలాంటి కనికరం చూపలేదు. నా దగ్గర డబ్బు ఉంది. ఇచ్చాను. కానీ పేదవాళ్ల పరిస్థితి ఏంటి? ఇలా డబ్బు వసూలు చేసినప్పుడు తమకు ఒక కుటుంబం ఉందన్న ఆలోచన వారికి రాదా? అంతేగాక మరణ ధృవీకరణపత్రం కోసం నేను ఇబ్బంది పడాల్సి వచ్చింది. రాష్ట్రంలో కుల గణన జరుగుతోందని, సిబ్బంది ఎవరూ లేరని అయిదురోజుల పాటు తిప్పి పంపారు. అధికారిక రుసుం కంటే ఎక్కువ మొత్తం చెల్లించిన తరువాత బెంగళూరు మహానగర పాలక సీనియర్ సిబ్బంది దానిని జారీ చేశారు. నారాయణమూర్తి, అజీజ్ ప్రేమ్‌జీ, కిరణ్ మజుందార్ షా వంటి బిలియనీర్లు ఈ నగరాన్ని కాపాడగలరా? అని ఆ తండ్రి ఉద్వేగానికి గురయ్యారు. అయితే ఆ తర్వాత తన పోస్ట్‌ను ఆయన తొలగించారు. అయినప్పటికీ ఇందుకు సంబంధించిన స్క్రీన్‌షాట్లు వైరల్ కావడంతో నెటిజన్ల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఈ పోస్టు తమ దృష్టికి వచ్చిన వెంటనే బెంగళూరు వైట్‌ఫీల్డ్ పోలీస్ స్టేషన్ ఉన్నతాధికారులు తక్షణం స్పందించారు. ఈ కేసులో లంచం ఆరోపణలు ఎదుర్కొన్న ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా అనిచుత ప్రవర్తనను పోలీస్ శాఖ సహించదని పేర్కొన్నారు.



# ఛాత్ పూజకు యునెస్కో గుర్తింపు తెస్తాం

**ఆర్‌జెడి- కాంగ్రెస్ బంధాన్ని '5కె'గా అభివర్ణన**

**ఆ పార్టీలది ఆటవిక పాలన, అభివృద్ధి ఉండదు**

**ముజఫర్‌పూర్ ఎన్నికల సభలో ప్రధాని మోడీ**

**ముజఫర్‌పుర్, అక్టోబరు 30:** కాంగ్రెస్, ఆర్‌జెడి పార్టీలు దశాబ్దాలపాటు బీహార్‌ను పాలించారు, కానీ అభివృద్ధి చేయలేదు. కేవలం ద్రోహం, తప్పుడు వాగ్దానాలు మాత్రమే ఇచ్చాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆరోపణలు గుపించారు. ఆ రెండు పార్టీల మధ్య ఉన్న సంబంధం నీళ్లు, నూనె లాంటిదని విమర్శించారు. గురువారంనాడు ముజఫర్‌పూర్ లో నిర్వహించిన ఎన్నికల సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, ఆర్‌జెడి- కాంగ్రెస్ కూటమిపై విమర్శలు గుప్పించారు. ఓట్ల కోసం ఛాత్ ఉత్సవాన్ని కాంగ్రెస్, ఆర్‌జెడి పార్టీలు అవమానిస్తున్నాయి. ఛాత్ పూజను డ్రామాగా పేర్కొన్నాయని, ఈ అవమానాన్ని బీహార్ ప్రజలు ఎన్నేళ్లయినా మర్చిపోరని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. బీహారీ ప్రజలు గొప్పగా జరుపుకునే ఛాట్ పూజకు యునెస్కో వారసత్వ సంపద గుర్తింపు తీసుకురానున్నట్లు ప్రధాని మోడీ తెలిపారు. “ఛఠ్ పూజ తర్వాత ఇది నా మొదటి బిహార్ పర్యటన. ఇది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఈ పండుగ భక్తికి మాత్రమే కాదు. సమానత్వానికి నిలయం. ఛఠ్ పాటలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఓ పోటీని నిర్వహించనుంది. పోటీ విజేతను ప్రజలే నిర్ణయిస్తారు. వచ్చే ఏడాది ఛఠ్ పండుగకు ముందు విజేతలను గుర్తిస్తారు. ఛఠ్ పూజ సంప్రదాయాలను యువత పాటల ద్వారా పెద్ద నుంచి నేర్చుకుంటారు. దానిని దృష్టిలో పెట్టుకుని బహుళ కళాకారులతో కలిసి మేం ఈ ఛఠ్ పాటల పోటీని నిర్వహిస్తాం. ఇందులో దేశవ్యాప్తంగా అన్ని భాషల ప్రజలు పోటీ పడటానికి అవకాశం లభిస్తుంది“ అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. “బీహార్ మధురమైన భాషను, సంస్కృతిని ప్రపంచంలోని ప్రతి మూలకు వ్యాప్తి చేయడం, గౌరవాన్ని పెంచడం, అభివృద్ధి చేయడం ఎన్‌డిఏ, బిజెపికి అతి పెద్ద ప్రాధాన్యత. వికసిత్ భారత్ కోసం వికసిత్ బీహార్ చాలా అవసరం“ అని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీలు ఎక్కడ ఉంటే అక్కడ ఆటవిక రాజ్యం వస్తుందని, ఎక్కడైతే ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీల దుష్పరిపాలన ఉంటుందో అక్కడ అభివృద్ధి జాడ కనిపించదని అన్నారు. ఎక్కడ అవినీతి ఉంటుందో అక్కడ సామాజిక న్యాయం జరగదని చెప్పారు. పేదల హక్కులు దోచుకుంటారని, కొన్ని కుటుంబాలు మాత్రమే అభివృద్ధి చెందుతాయని అన్నారు. అలాంటి వ్యక్తులు బీహార్‌కు ఎప్పటికీ మంచి చేయలేరని ఆరోపించారు. “కాంగ్రెస్- ఆర్‌జెడి కూటమి పాలన ఐదు 'కే' పదాల్లో చెప్పొచ్చు. కట్టా (నాటు తుపాకీలు), క్రూరతా(క్రూరత్వం), కటుత (దురుద్దేశం), కుశాసన (సుపరిపాలన లేకపోవడం), కరప్షన్(అవినీతి)“ అని ప్రధాని మోడీ ఆరోపణలు గుప్పించారు. “కాంగ్రెస్- ఆర్‌జెడి పార్టీల నేతలు బయటకు కలిసి ఉన్నట్టు కనిపించినా అంతర్గతంగా కొట్లాడుకుంటారు. బీహార్‌లో ఆర్‌జెడి పాలనలో 35వేల నుంచి 40వేల కిడ్నాప్‌లు జరిగాయి. ఆ పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో నేటి యువత ఊహించలేరు. ఏడుస్తూ, బాధపడుతూ ఉన్న తల్లిదండ్రుల బాధలు అప్పట్లో ఆర్‌జెడికి ఏమాత్రం పట్టనట్టు ఉండేవి. నేటికీ కూడా ప్రజల సంతోషం లేదా దుఃఖం గురించి ఎలాంటి ఆందోళన లేదు“ అని ప్రధాని మోడీ మండిపడ్డారు. రైల్వేను లూటీ చేసినవాళ్లు.. బీహార్ ప్రాంతాన్ని ఎలా డెవలప్ చేస్తారని అన్నారు. బీహార్‌లో జంగిల్‌రాజ్ నడిచిందని, షోరూంలో నుంచి వాహనాలను దోచుకెళ్లారని ఆరోపించారు.

# వర్క్ పర్మిట్ల ఆటోమేటిక్ రెన్యువల్ రద్దు

## వేలాది మంది భారతీయ ఉద్యోగులపై పిడుగు!



**వాషింగ్టన్, అక్టోబరు 30:** వలసదారులపై కఠిన విధానాలు అమలుచేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. వలసదారుల పని అనుమతులను ఆటోమేటిక్‌గా రెన్యువల్ చేసే విధానానికి ముగింపు పలికింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ఈ మేరకు ప్రకటన చేసింది. దీంతో వేలాది మంది విదేశీయులు ముఖ్యంగా భారతీయులు తమ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. 'అక్టోబరు 30 లేదా ఆ తర్వాత నుంచి వర్క్ పర్మిట్లను (ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్స్) పునరుద్ధరించుకునేందుకు దరఖాస్తు చేసుకునే వలసదారులకు ఇకపై ఆటోమేటిక్ రెన్యువల్ ఉండదు. అయితే ఈ తేదీ కంటే ముందు పని అనుమతులను పొడిగించుకున్న వారిపై ఎలాంటి ప్రభావం ఉండదు' అని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం తమ ప్రకటనలో వెల్లడించింది. ప్రజా భద్రత, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కొత్త నిబంధనలు తీసుకొచ్చినట్లు తెలిపింది. గతంలో బైడెన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వలసదారులు తమ వర్క్ పర్మిట్ కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా 540 రోజుల వరకు అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు వీలుండేది. ఈ విధానానికి ముగింపు పలుకుతూ తాజాగా ట్రంప్ సర్కారు కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. పని అనుమతుల పొడిగింపు కోసం వలసదారులు ముందుగానే దరఖాస్తు చేస్తు కోవాలని అగ్రరాజ్య అధికారులు స్పష్టం చేశారు. 'ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ల (ఇఎడి) రెన్యువల్ కోసం దరఖాస్తులను వలసదారులు ఎంత ఆలస్యం చేస్తే వారికి అంత నష్టం. తాత్కాలికంగా పని అనుమతులను కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే వర్క్ పర్మిట్ల గడువు ముగియ దానికి 180 రోజుల ముందే రెన్యువల్ కోసం దరఖాస్తులు సమర్పిస్తే మంచిది' అని యుఎస్‌సిఐఎస్ సూచించింది. అమెరికాలో ఉద్యోగం అవకాశం మాత్రమేనని, వలసదారుల హక్కు కాదని యుఎస్‌సిఐఎస్ డైరెక్టర్ జోసెఫ్ అన్నారు. ఏమిటీ ఇఎడి? ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ (ఇఎడి) అనేది ఓ వ్యక్తికి నిర్దిష్ట కాల వ్యవధి వరకు అమెరికాలో పనిచేసేందుకు అధికారం ఉందని నిరూపించే పత్రం. ఇది ఉంటేనే వలసదారులు అమెరికాలో ఉద్యోగం చేసుకు నేందుకు అనుమతులు లభిస్తాయి. అయితే, గ్రీన్‌కార్డుతో శాశ్వత నివాసం పొందిన వారు ఈ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.

# బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో నకిలీ శాస్త్రవేత్త అరెస్ట్!


**న్యూఢిల్లీ, అక్టోబర్ 30:** ప్రముఖ అణు పరిశోధనా విభాగం బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో నకిలీ శాస్త్రవేత్తగా చలామని అవుతున్న అక్తర్ కుతుబుద్దీన్ హుస్సేనీ ఇటీవల అరెస్టయ్యాడు. ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడి వద్ద అణు కార్యక్రమాలకు సంబంధించిన కీలకమైన డేటాతో పాటు 14 మ్యాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తాజాగా పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాటిలో సున్నితమైన సమాచారం ఏదైనా ఉందా అన్న కోణంలో పరిశీలిస్తున్నామన్నారు. గతవారం ముంబయిలో అరెస్టయిన అక్తర్ నుంచి అనేక నకిలీ పాస్‌పోర్టులు, ఆధార్, పాన్‌కార్డులు గుర్తించారు. వీటితో పాటు బార్క్‌కు సంబంధించిన రెండు నకిలీ ఐడి కార్డులు కనుగొన్నారు. ఇతడు కొన్ని నెలలుగా అనేక అంతర్జాతీయ కాల్స్ చేశాడని, ఆ రికార్డులను పరిశీలిస్తున్నామన్నారు. న్యూక్లియర్ డేటాకు సంబంధించి అక్తర్‌కు పలు విదేశీ నెట్‌వర్క్‌లతో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. జంషెడ్‌పుర్ నివాసి అయిన అక్తర్ నకిలీ పాస్‌పోర్టుతో కొంతకాలం దుబాయ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఆ తర్వాత అతడు అక్కడ బహిష్కరణకు గురయ్యాడని వెల్లడించారు. ఈ క్రమంలో నకిలీ పాస్‌పోర్టులు ఉపయోగించి దుబాయ్, ఇరాన్ వంటి ఇతర దేశాల్లోనూ ప్రయానించినట్లు గుర్తించారు. ఇరానియన్ గూఢచారులతో జరిగిన ఓ ఒప్పందం ద్వారా వచ్చిన డబ్బుతో విదేశాల్లో పెట్టుబడి పెట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. గూఢచర్యానికి పాల్పడుతూ నకిలీ పాస్‌పోర్ట్ రాకెట్ నడుపుతున్న ఆరోపణపై అక్తర్ సోదరుడు మహమ్మద్ అదిల్ హుస్సేనీని కూడా ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు.

# ట్రంప్‌ను ఎదుర్కొనే ధైర్యం మోడీకి లేదు

**రెండేళ్లలో బీహార్‌లో ఎన్డీయే చేసిందేమీ లేదు**

**ఓటు చోరీతోనే కేంద్రంలో అధికారంలోకొచ్చింది**

**నలంద ఎన్నికల సభలో రాహుల్ ఆరోపణలు**



**నలంద, అక్టోబరు 30:** “భారత్- పాకిస్తాన్ మధ్య వివాదం తన వల్లే ఆగిపోయిందని అమెరికా అధ్యక్షుడు చాలాసార్లు పేర్కొన్నారు. కానీ, మన ప్రధానమంత్రి మోడీకి ఆయనను ఎదుర్కొనే ధైర్యం లేదు“ అని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నలందలో నిర్వహించిన ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ, బీహార్ ఇప్పుడు పేపర్ లీకేజీలు, కనీస ఆరోగ్య మౌలిక సదుపాయాలకు కరువైన ప్రాంతంగా మారిందన్నారు. 20ఏళ్ల ఎన్‌డిఏ పాలనలో బీహార్‌లో చేసిందేమీ లేదని, పెద్దలకు, పారిశ్రామిక వేత్తలకు భూములు, రాయితీలు, ప్రోత్సాహకాలిచ్చారు అంటూ ఆరోపణలు గుప్పించారు. గత లోక్‌సభ ఎన్నికలలో ఎన్‌డిఏ ఓటు చోరీ ద్వారా విజయం సాధించిందని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని నాశనం చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని రాహుల్‌గాంధీ దుయ్యబట్టారు. బీహార్‌లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే, అది రైతులు, కార్మికులు, దళితులు, బలహీన వర్గాల ప్రభుత్వం అవుతుందని, అన్ని వర్గాల ప్రాతినిధ్యం ఉంటుందన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే, ప్రపంచంలోనే అత్యుత్తమ విశ్వ విద్యాలయం నలందలో వస్తుందని హామీనిచ్చారు.

## సంక్షిప్తంగా..

### లావ్రే మ్యూజియం చోరీకేసులో అయిదుగురి అరెస్ట్



**ప్యారిస్, అక్టోబరు 30:** ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్ట్ మ్యూజియం లావ్రేలో భారీ చోరీ కేసులో తాజాగా ఐదుగురు అనుమానితుల్ని పోలీసులు అరెస్ట్ చేసారు. మ్యూజియంలోని అపోలో గ్యాలరీ నుంచి దాదాపు 102 మిలియన్ డాలర్ల విలువైన ఆభరణాలను దొంగలు అపహరించారు. ఈ విషయాన్ని ఫ్రెంచ్ మీడియా నివేదించింది. ఇప్పటికే ఇద్దరు అనుమానితుల్ని పోలీసులు అరెస్ట్ చేసారు. దోపిడీలో తమ ప్రమేయం ఉందని నిందితులు అంగీకరించినట్లు పారిస్ ప్రాసిక్యూటర్ లారే బెకువా తెలిపారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ప్రసిద్ధి చెందిన లూవ్రా మ్యూజియంలో ఈనెల 19న భారీ చోరీ జరిగింది. మోనాలిసా లాంటి కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియంలో నెపోలియన్ కాలం నాటి ఆభరణాలను అపహరించారు.

### నటుడు ప్రభు, అమెరికా కాన్సులేట్‌లకు బాంబు బెదరింపులు



**చెన్నై, అక్టోబరు 30:** చెన్నైలో మరోసారి బాంబు కలకలం రేగింది. ప్రముఖ నటుడు ప్రభు నివాసంతో పాటు, అమెరికా రాయబార కార్యాలయానికి బాంబు బెదిరింపులు రావడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గుర్తుతెలియని వ్యక్తులు పంపిన ఈమెయిల్‌తో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. తమిళనాడు డీజీపీ కార్యాలయానికి వచ్చిన ఓ ఈమెయిల్‌లో ఈ బెదిరింపులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చెన్నైలోని అన్నా ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న అమెరికా కాన్సులేట్‌లో, ఆ తర్వాత నటుడు ప్రభు ఇంట్లో బాంబు పేలుతుందని దుండగులు హెచ్చరించారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే చెన్నై పోలీసులు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్, స్నిఫర్ డాగ్స్‌తో రంగంలోకి దిగారు. అమెరికా కాన్సులేట్ భవనం, నటుడు ప్రభు నివాసం వద్ద భద్రత కట్టుదిట్టం చేసారు.

### అయోధ్య రామమందిరానికి రూ.3 వేల కోట్ల విరాళాలు

**అయోధ్య, అక్టోబరు 30:** అయోధ్య రామమందిరం నిర్మాణం కోసం ప్రజలు రూ.3 వేల కోట్లకుపైగా విరాళాలు ఇచ్చినట్లు రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఆలయ ప్రాజెక్టు మొత్తం ఖర్చు దాదాపు రూ.1,800 కోట్లని.. ఇప్పటి వరకూ రూ.1,500 కోట్ల బిల్లులు చెల్లించినట్లు వెల్లడించారు. 2022లో నిర్మాణం కోసం విరాళాలు ప్రకటించినప్పటి నుంచి ఈ మొత్తం వచ్చినట్లు తెలిపారు. నవంబరు 25న ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ వేడుకలకు దాతలందరినీ ఆహ్వానిస్తామని ఆయన తెలిపారు. ఆరోజు ప్రధాని మోడీ ముఖ్య అతిథిగా హాజరవుతారని, రామాలయంపై పతాకాన్ని ఆవిష్కరిస్తారని వివరించారు. దాదాపు 8 వేల మందికిపైగా ఆహ్వానితులు ఇందులో పాల్గొంటారని ఆయన చెప్పారు.

### నవంబరు 1 నుంచి అయ్యప్ప దర్శనాల ఆన్‌లైన్ బుకింగ్



**పతనంతిట్ట, అక్టోబరు 30:** శబరిమల అయ్యప్పస్వామి దర్శనాలకు చెందిన ఆన్‌లైన్ బుకింగ్ నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభిస్తున్నారు. ఈ ఏడాది కూడా భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనం కోసం రానున్నారు. మండల పూజ సీజన్ నవంబర్ 16వ తేదీ నుంచి ప్రారంభంకానున్నది. డిసెంబర్ 27వ తేదీన ఆ సీజన్ ముగుస్తుంది. ఇందు కోసం ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అయ్యప్ప స్వామి దర్శనం కోసం వర్చువల్ క్యూ బుకింగ్ నవంబర్ ఒకటో తేదీన ప్రారంభించనున్నట్లు బోర్డు ప్రకటించింది. ప్రతి రోజు 70 వేల మంది భక్తులకు క్యూలైన్ టికెట్లను అమ్మనున్నారు. ఇక స్పాట్ బుకింగ్ కోసం 20 వేల టికెట్లను కేటాయించారు. మండల సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో బోర్డు సమీక్షా సమావేశం నిర్వహించింది. పంబ వద్ద భారీ పందిరిని నిర్మించనున్నారు.

### గ్లోబల్ సెక్యూరిటీ హబ్‌గా భారత్!

**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** భారత్ వేగంగా గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ హబ్‌గా అవతరిస్తోందని, ఈ రంగంలో 400కు పైగా స్టార్టప్‌లు, 6.5 లక్షల మంది నైపుణ్యం కలిగిన నిపుణులతో దేశ సైబర్ భద్రతా పరిశ్రమ 20 బిలియన్ డాలర్ల స్థాయికి చేరిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖకు చెందిన సెర్ట్‌ఇన్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంజయ్ బహల్ తెలిపారు. ఐరోపా సమాఖ్య దేశాల నుంచి వచ్చిన బృందంతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని ఆవిష్కర్తలు థ్రెట్ డిటెక్షన్ సైబర్ ఫోరెన్సిక్స్, ఏఐ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థల వంటి అత్యాధునిక పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారని, సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని నిర్మించడంలో ఇది కీలకమని ఆయన వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రెండు వైపులా పదునున్న కత్తి లాంటిదన్నారు.



# దక్షిణ, ఈశాన్య భారత్‌పై దావూద్ గ్యాంగ్ ఫోకస్!

**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** దావూద్ ఇబ్రహీంకు చెందిన డ్రగ్స్ సిండికేట్‌పై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) ఉక్కుపాదం మోపుతోంది. గత కొన్ని నెలలుగా మహారాష్ట్ర కేంద్రంగా పనిచేస్తున్న ఈ నెట్‌వర్క్‌పై ఎన్‌సీబీ అధికారులు వరుస దాడులు చేస్తున్నారు. డానిష్ చిక్నా, మహమ్మద్ సలీం షేక్ వంటి కీలక సభ్యుల అరెస్టులతో డీగ్యాంగ్ భారీగా దెబ్బతింది. దీంతో నష్టాల నుంచి గట్టెక్కేందుకు, తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ సిండికేట్ ఇప్పుడు కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. ఇంటెలిజెన్స్ ఏజెన్సీల కథనం ప్రకారం, ఇప్పటివరకు మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలే కేంద్రంగా పనిచేసిన దావూద్ నెట్‌వర్క్.. ఇప్పుడు దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. మహారాష్ట్రలో నిఘా తీవ్రతరం కావడంతో అక్కడి నుంచి దేశవ్యాప్తంగా డ్రగ్స్ సరఫరాను నియంత్రించడం కష్టంగా మారింది. దీంతో కార్యకలాపాల కేంద్రాన్ని మార్చాలని డీసిండికేట్ నిర్ణయించింది. ప్రస్తుతం భారత డ్రగ్స్ మార్కెట్ బాధ్యతలను ఐఎస్ఐ ఏజెంట్, దావూద్ అనుచరుడైన హాజీ సలీం చూసుకుంటున్నాడు. గతంలో దావూద్ కుడిభుజంగా ఉన్న ఛోటా షకీల్ కొంతకాలంగా తెరమరుగు కావడంతో సలీం ప్రాధాన్యత పెరిగింది. అంతర్జాతీయ వ్యవహారాలను దావూద్ సోదరుడు అనీస్ ఇబ్రహీం పర్యవేక్షిస్తుండగా, భారత్‌లో కార్యకలాపాలు మొత్తం సలీం చేతుల మీదుగానే సాగుతున్నాయి. ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం, శ్రీలంక మార్గం ద్వారా తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు భారీగా డ్రగ్స్ చేరవేసి, అక్కడి నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు భూమార్గంలో సరఫరా చేయాలని డీసిండికేట్ ప్లాన్ చేస్తోంది. ఇప్పటివరకు దేశం నుంచి విదేశాలకు డ్రగ్స్ పంపేందుకు దక్షిణాది ప్రాంతాన్ని వాడుకున్న ఈ ముఠా, ఇప్పుడు దేశంలోకి డ్రగ్స్ తెచ్చేందుకు ఇదే మార్గాన్ని ఎంచుకుంది.

31-10pg6exHMNWJQE 10_31-10pg6exHMNWJQE.qxd 30/Oct/25 10:59 PM Page 1



# జాతీయ విపత్తుగా గుర్తించాలి



విజయవాడ, అక్టోబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంపై ప్రధాని మోడీ సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారని ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉత్తరాదిన ప్రకృతి విలయాలకు వెంటనే జాతీయ విపత్తులుగా ప్రకటించుకునే ప్రధాని, మొంథా తుపాన్ ధాటికి జనజీవనం అల్లకల్లోలం అయితే తమకేం పట్టనట్లు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల మద్దతుతో మూడో సారి గద్దెనెక్కిన మోడీ, ఆపద సమయంలో మొహం చాటేసి మరోసారి తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. మొంథా తుపాన్ రైతన్నకు అపార నష్టాన్ని, తీరని శోకాన్ని మిగిల్చిందని, రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలకు పైగా నీట మునిగాయని, ఖరీఫ్ సీజన్‌లో సాగైన పంటల్లో 30 శాతం పనికి రాకుండా పోయాయని, 10 లక్షల మంది రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. ఇది రాష్ట్ర రైతాంగానికి సంభవించిన మహా విపత్తు అని, రూ.20 వేల కోట్లకు పైగానే రైతులకు అపార నష్టం జరిగిందని వివరించారు. మొంథా తుపాన్‌ను జాతీయ విపత్తుగా వెంటనే ప్రకటించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రళయం మిగిల్చిన నష్టం అంచనాకు ప్రత్యేక బృందాలను రాష్ట్రానికి పంపాలని కోరారు. అంచనా నివేదికలొచ్చే లోపు రాష్ట్రానికి తక్షణ సహాయం కింద రూ.10 వేల కోట్లు మోడీ ప్రకటించాలన్నారు. తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విజ్ఞప్తి చేశారు.




# 13న బ్రాహ్మణుల మెగా జాబ్ మేళా

అనంతపురం, అక్టోబరు 30 ప్రభాతవార్త బ్యూరో: గుంటూరులో డిసెంబర్ 13వ తారీఖున నిర్వహించే మెగా జాబు మేళ బ్రోచర్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ చేతులు మీదుగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో అనంతపురంలోని బిజెపి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నలుమూలలలో ఉన్నటువంటి నిరుద్యోగ బ్రాహ్మణ యువతీ యువకులకు ఇది ఒక గొప్ప అవకాశం అని, ఈ మెగా జాబు మేళాను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అడ్వైజర్ కమిటీ డైరెక్టర్ ఆలూరు లక్ష్మినరసింహ శాస్త్రి, జిల్లా అధ్యక్షుడు సి.వి మురళీధర్, ప్రధాన కార్యదర్శి కరణం రామసుబ్బారావు, నార్పల మారుతి నరసింహం, కొనకంచి మురళి, రాష్ట్ర మహిళా విభాగం నేత దాక్షాయిని, సంకేపల్లి సత్యనారాయణ శర్మ, ఏసిఎస్ ప్రసాద్, రిటైర్డ్ డిఎస్పి శేషశయనం, పోలేపల్లి నాగభూషణం, జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగజ్యోతి దుర్గ, లక్ష్మినరసమ్మ, కరణం చంద్రకాంత్, సంపత్‌లు పాల్గొన్నారు.




## పాపంపేట వివాదంలో మంత్రి కేశవ్
# ఎందుకు మాట్లాడలేదు?
### సిపిఎం నేత రాంభూపాల్ డిమాండ్

అనంతపురం, అక్టోబరు 30 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో శ్రోత్రియం భూముల వివాదంలో రాజకీయ నాయకులకు పిల్లికి చెలగాటం.. ఎలుకకు ప్రాణ సంకటం అన్న విధంగా తయారైందని సిపిఎం నేత రాంభూపాల్ పేర్కొన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ ఈ వివాదంపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. పాపంపేట బాధితులను భూకబ్జా దారుల నుంచి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గురువారం అనంతపురం జిల్లా కలెక్టరేట్ వద్ద సీఎం నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. శ్రోత్రియం భూముల కబ్జాదారుల నుంచి పాపంపేట వాసులను కాపాడాలని వారికి భద్రత కల్పించాలని డిమాండ్‌తో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రెవెన్యూ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నేత రాంభూపాల్ మాట్లాడుతూ మొత్తం 932 ఎకరాల్లో ఉన్న శ్రోత్రియం భూముల వ్యవహారంలో జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 15వేల కుటుంబాలను రోడ్డుకు ఈడ్చి వేల కోట్లు సంపాదిద్దామన్న ఆలోచన వెనుక రాజకీయ నాయకుల కుట్రలు ఉన్నాయన్నారు. అధికారంలో ఉన్న వారు, ప్రతిపక్షంలో ఉన్నవారు పరస్పరం విమర్శలు చేసుకుంటూ ఈ వివాదాన్ని మరింత దూరం తీసుకెళ్తున్నారన్నారు. దీనిపై ప్రజలు పెద్ద ఎత్తున గగ్గోలు పెడుతున్నా జిల్లాలో ఉన్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఎందుకు దీని గురించి మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వేల మందికి సంబంధించిన విషయంలో ఇంత నిర్లక్ష్యంగా ఎలా ఉంటున్నారని ప్రశ్నించారు. వెంటనే ఇక్కడ భూకబ్జాదారుల నుంచి పాపంపేట వాసులను కాపాడాలని వారికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

# భగవద్గీతను అవమాన పరచలేదు

**- హిందువుల మనోభావాలు దెబ్బతిని ఉంటే అందరికీ క్షమాపణలు - టిటిడి పాలకమండలి సభ్యుడు ఎంఎస్ రాజు**

గుంటూరు, అక్టోబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: 'భగవద్గీత'ను అవమానపరిచినట్లు వైసీపీ, అనుకూల సోషల్ మీడియా చేస్తున్న ప్రచారాలను ఎమ్మెల్యే, టిటిడి పాలకమండలి సభ్యుడు ఎంఎస్ రాజు ఖండించారు. తాను హిందువునని, రాజ్యాంగం వలనే దళితుల జీవితాల్లో వెలుగులు వచ్చాయని ఎంఎస్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ... గత రెండు రోజులుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, అనుకూల సోసిల్ మీడియా, మరికొన్ని యూట్యూబ్ చానల్స్ లో తాను 'భగవద్గీత'ను అవమాన, అగౌరవ పరిచినట్లు అసత్యపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. తాను ఎక్కడా కూడా భగవద్గీతను గానీ, ఇతర మత గ్రంథాలను కించపరిచినట్లు ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. కేవలం డా.బిఆర్ అంబేద్కర్ గొప్పతనం, భారత రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించే ప్రయత్నం మాత్రమే చేశానన్నారు. భగవద్గీత, ఖురాన్ వంటి మహా గ్రంథాల వలన దళితుల జీవన ప్రమాణాలు మెరుగుపడలేదు. కానీ రాజ్యాంగం వలన దళితుల జీవిత ప్రమాణాలు మెరుగుపడ్డాయి అని మాత్రమే తెలియజేయడం జరిగింది తప్ప ఎక్కడా భగవద్గీతను అవమానపరిచే వ్యాఖ్యలు చేయలేదన్నారు. భగవద్గీతను తాను కించపరిచానని మీ మనోభావాలు దెబ్బతిని ఉంటే నేను ఒక హిందూ సోదరుడిగా మీకు క్షమాపణలు కోరుతున్నానని ఎంఎస్‌రాజు తెలిపారు.

# గాలి ఊడ్చేసింది...

## అన్నదాత వెన్నువిరిచిన మొంథా తుపాన్



# వాన ముంచేసింది!

### పొంగిన వాగులు, దెబ్బతిన్న పంటలు
### గుండ్లకమ్మ వరదలతో పొలాలు, ఊళ్ళు జలమయం

ఒంగోలు, అక్టోబరు 30 ప్రభాతవార్త: ఆరుగాలం శ్రమను ఒక తుపాన్ తుడిచిపెట్టేసింది. రైతుల ఆశలను నిర్దాక్షిణ్యంగా చిదిమేసింది. ఖర్చు కొండంత, రాబడి గోరంతగా మారిన పరిస్థితుల్లో ఇప్పటికే వాన పోటుతో అనేక సార్లు దెబ్బతిన్న రైతు పరిమితికి మించి పెట్టుబడులు పెట్టి పంటను కాపాడుకుంటున్న వేళ మొంథా తుపాన్ నిలువనా ముంచేసింది. వరి, పొగాకు, పత్తి, మిరప, బొప్పాయి సహా అనేక పంటలు నీటిలో తేలి యాడుతున్న దృశ్యాలను చూసి రైతు కడుపు తరుక్కుపోతుంది. వరి నేల కొరిగింది. తీతకు సిద్ధంగా ఉన్న పత్తి తడిచిపోయింది. మిరప, పొగాకు చేలు చెరువుల్లా మారిపోయాయి. అరటి, బొప్పాయి చెట్లు నిలువునా కూలిపోయాయి. పసుపు, కంద, కూరగాయల పందిళ్లు.. ఏ పంట చూసినా కన్నీటి వేదనే. అప్పులు ఎలా తీర్చాలన్న ఆందోళన... కొత్త పంటకు పెట్టుబడి ఎలా అన్న బెంగతో తల్లడిల్లిపోతున్నారు. మొంథా తుపాన్ ప్రకాశం జిల్లాను అతలాకుతలం చేసింది. మొంథా తుపాన్ నాగులుప్పలపాడు మండలంలోని అనేక గ్రామాలను ముంచేసింది. గుండ్లకమ్మ జలాశయం నుండి 1,50,000కి క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు తోడవడంతో మండలంలోని అనేక గ్రామాలు ముంపు గురయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలు సచివాలయాలతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్లు నీటిలోనే మునిగిపోయాయి. రైతులు సాగు చేపట్టిన నారుమళ్ళు, కూరగాయ పంటలు, మిరప, పశుగ్రాసం పంటలు పూర్తిగా నీటిలో మునిగి పోయాయి. ప్రాణ నష్టం లేకపోయినా ఆస్తి నష్టం ఎక్కువగా సంభవించింది. అనేక గ్రామాల్లో రహదారులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. గుండ్లకమ్మ సమీపంలోని మద్దిరాలపాడు, చదలవాడ, ఉప్పలపాడు, చేగురుపాడు, నాగులప్పలపాడు, ఉప్పుగుండూరు, తిమ్మసముద్రం, ఈదుముడి, ముప్పాళ్ళ, మద్దిరాల గ్రామాలతో పాటు లోతట్టు ఉన్న ఓవన్నపాలెం, మాచవరం, రాపర్ల, చవటపాలెం గ్రామాల్లో పత్తి పంట పూర్తిగా పోయింది. సోమ, మంగళ వారాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో జిల్లా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఒంగోలు- కర్నూలు, చెన్నై- కలకత్తా, ఒంగోలు- కత్తిపూడి జాతీయ రహదారుల పైకి నీరు చేరడంతో రాకపోకలకు అంతరా యం ఏర్పడింది. ఒంగోలు నగరపాలక సంస్థకు రూ.10.5 కోట్లు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. మొత్తం 26 రహదారులు, 4 కిలోమీటర్ల కాలువలు, 350 వీధిదీపాలు దెబ్బ తిన్నాయి. లైలా తుపాన్ తరువాత ఇదే పెద్దదని, సుమారు 15ఏళ్ల కిందట లైలా తుపాన్ సమయంలో రికార్డు స్థాయిలో వరద నీరు చేరింది. ప్రస్తుతం ఒక్క రోజులోనే 29.5 సెంమీ వర్షపాతం కురవడంతో ఒంగోలు నగరం జలమయమైంది. నగరానికి ఆనుకుని ఉన్న చెరువులు, అలుగులు పారడంతో వరద నీరు చుట్టుముట్టింది. మొంథా తుపాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా వీచిన ఈదురు గాలులకు పలు చోట విద్యుత్ స్తంభాలు నేలకు వరగా మరికొన్ని చోట్ల పరివర్తకాలు దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. మరో 35 విద్యుత్ పరివర్తకాలు, 216 స్తంభాలు, 22 కిలోమీటర్ల మేర తీగలు దెబ్బతిన్నాయి. తుపాన్ కారణంగా రూ.38లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. జిల్లాలో మొత్తం 799 సాగునీటి చెరువులు ఉండగా, 105 చెరువులు పాక్షికంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ప్రకాశం జిల్లాలోని గుండ్లకమ్మ ప్రాజెక్టుకు భారీ వరద నీరు వచ్చి



చేరింది. 14గేట్లు తెరిచి ప్రాజెక్టు నుంచి లక్షా 50 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదిలిపెట్టారు. ఒక్క సారిగా అన్ని గేట్లు ఎత్తడంతో పలు గ్రామాల్లోకి వరద నీరు చేరింది. మద్దిపాడు మండలం ఇనమనమెల్లూరు, నందిపాడు, కొలచనకోట, వెల్లంపల్లి, మల్లవరం, తెల్లపాడు, రాచవారిపాలెం, కీర్తిపాడు, నాగన్నపాలెం గ్రామాల్లోకి గుండ్లకమ్మ నీరు చేరింది. కొలచనకోట ఎస్సీ కాలనీలోకి వరద నీరు చేరడంతో ప్రజలను పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. నాగులుప్పలపాడు మండలంలో చదలవాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి నీరు వెళ్ళడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ప్రకాశం జిల్లా రైతాంగాన్ని తీవ్రంగా మొంథా తపాన్ దెబ్బతీసింది. పంటలకు తీవ్ర నష్టం జరిగింది. ప్రాథమిక అంచనా ప్రకారం మొత్తం 10274 హెక్టార్లలో సాధారణ పంటలు దెబ్బతిన్నాయి. 870.18 హెక్టార్లలో ఉద్యాన పంటలు నష్టపోయాయి. ప్రభుత్వానికి వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు నివేదిక పంపినట్లు సమాచారం.

# కూటమి ప్రజాప్రతినిధులే ఓ మాఫియా

**- మద్యం, ఇసుక దందాలు... ఆపై భూకబ్జాలు - రైతాంగం గురించి పట్టించుకోవట్లేదు - వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి**

అనంతపురం, అక్టోబరు 30 ప్రభాతవార్త బ్యూరో: కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులే మాఫియాగా తయారై పేదల బియ్యం, మద్యం, ఇసుక దందాలతోపాటు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని వైఎస్ఆర్‌సిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత నిరాదరణకు గురవుతున్న రంగం వ్యవసాయ రంగమని పేర్కొన్నారు. రెండేళ్ల పాలనలో రెండు ఖరీఫ్‌లు, ఒక రబీ సీజన్ ముగిసి మరో రబీ సీజన్ ప్రారంభమైందన్నారు. అయితే ప్రతి సీజన్‌లోనూ విత్తనాలు లేక ఎరువులు అందక పండిన పంటకు గిట్టుబాటు ధరలేక నష్టపోయిన పంటకు బీమా రాక రైతులు నిరాదరణకు గురవుతున్నారన్నారు. రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా విత్తన పంపిణీ చేయకపోగా ఇప్పుడు రైతుల రిజిస్ట్రేషన్ చేస్తామంటుండటం సిగ్గుచేటన్నారు. సాక్షాత్తు మంత్రి పయ్యావుల కేశవ్ డిపిఆర్‌సి సమావేశంలోనే ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పినా నేటికీ ఆచరణలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. గతంలో గిట్టుబాటు ధరలేక టమోట పంటను మాత్రమే పారబోసే వారని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఉద్యాన పంటలను కూడా గిట్టుబాటు ధరలేక రోడ్డుపై పారవేసే పరిస్థితి తొలిసారి చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తు టిడిపికి చెందిన రాయదుర్గం ఎమ్మెల్యే గిట్టుబాటు ధరలు కల్పించాలంటూ ఆ శాఖ మంత్రికి లేఖ రాయడం జిల్లాలోని రైతుల దయనీయ




పరిస్థితిని తెలియజేస్తోందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే గతంలో లాగ రైతుల ఆత్మహత్యలు, రైతుల వలసలు తప్పవన్న ఆందోళన వ్యక్తం అవుతోందన్నారు. జిల్లా కలెక్టర్ కాని, జిల్లా ఎస్పీ కానీ బాధితులకు భరోసా ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు ఏర్పాటు చేసి పగలు రాత్రిళ్లు లేకుండా అమ్మకాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలు, ప్రజా ప్రతినిధుల భూ కబ్జాలు, దౌర్జన్యాలపై కలిసి వచ్చే పార్టీలపై వైఎస్ఆర్‌సిపి ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని ఆయన హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగన్న, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, వైసిపి నగర ఉపాధ్యక్షులు రమణారెడ్డి పాల్గొన్నారు.

# దళిత ఆదివాసీలపై హింసను నివారించేందుకు కృషి

గన్నవరం(కృష్ణా), అక్టోబరు 30 ప్రభాతవార్త: దళిత ఆదివాసీ స్త్రీలు, బాలికలపై జరుగుతున్న హింస, లైంగిక వేధింపులను నివారించేందుకు అందరూ కృషిచేయాలని జ్యూరీ సభ్యులు కోరారు. దళితశక్తి జాతీయ కన్వినర్ గెడ్డం జాన్సీ ఆధ్వర్యంలో విజయవాడలోని ఓ ప్రయివేటు హోటల్‌లో దళిత ఆదివాసీలపై హింసకు సంబందించిన బాధితులు, సాక్షులతో లీగల్‌క్లీనిక్ నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ భైరా కోటేశ్వరావు, సిఐడి నుండి ఐపిఎస్ అధికారి కె.శ్రీనివాస్, ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ విజయకుమార్, మాజీ సమాచారకమీషనర్ అంబటి సుబ్బారావు, ఎస్సీ అసోసియేషన్ కార్యదర్శి రత్నప్రదీప్, హైకోర్టు న్యాయవాది అభిజ్ఞలు ఈసమావేశానికి జ్యూరీసభ్యులుగా ఉన్నారు. ఈసందర్భంగా మొత్తం 33 కేసులలో అత్యాచారాలు, ప్రేమపేరుతో లైంగిక వేదింపులు, కులదూషణ తదితర సంఘటనల్లో బాధితులైన తమపై జరిగిన అన్యాయాలను జ్యూరీసభ్యులకు విన్నవించారు. ఈసందర్భంగా జ్యూరీసభ్యులు మాట్లాడుతూ బాధితులకు పరిహారం అందించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పకడ్బందిగా అమలు చేసేందుకు అందరూ కలసికట్టుగా కృషిచేయాలని సూచించారు. బాధితులకు ప్రభుత్వం నుండి అందాల్సి న రాయితీల విషయంపై సాంఘీకసంక్షేమశాఖా మంత్రితో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

## కాపులకు 12శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

**కాపు పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చనమల్ల ప్రసాదరావు**

విజయవాడ, అక్టోబరు 30 ప్రభాతవార్త: కాపు, బలిజ, ఒంటరి కులాల వారికి 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాపు పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చనమల్ల ప్రసాదరావు, కన్వీనర్ రావి శ్రీనివాస్‌లు కోరారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. బిసి, ఓసిలకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా జనాభా లెక్కల్లో దామాషా ప్రకారం తమకు రిజర్వేషన్లు ఇవ్వాలని ఈ లేఖలో వారు కోరారు. పాలకులు తల్లిదండ్రుల పాత్ర పోషించి దశాబ్దాలుగా తమకు జరుగుతున్న సామాజిక అన్యాయాన్ని నివారించి స్థానిక సంస్థల్లో, ఉద్యోగాల్లో, నామినేటెడ్ పర్కులు తదితరాల్లో 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.


అత్తి వరదుని మూల స్థానంలో ప్రతిష్ఠించిన దృశ్యం

# అత్తి వరదునికి షోడశాభిషేకాలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న వైష్ణవాలయం ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణం నత్తనడకన సాగుతుంది. ఏడాదిలో పూర్తి చేయాలని చేపట్టిన నిర్మాణం వివిధ కారణాలతో పూర్తి కాలేదు. దాంతో బాలాలయంలో ఏర్పాటు చేసిన స్వామి చిత్రపటం స్థానంలో 'అత్తి కొయ్యతో' తయారు చేసిన వరదరాజస్వామి విగ్రహానికి జలాధివాసం పూర్తి చేసిన తరువాత గురువారం శుద్ధి చేయటానికి షోడషాభిషేకాలు నిర్వహించారు. మూల స్థానంలో ప్రతిష్టించామని ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు తెలిపారు. స్వామి వారిని చిత్రపటం నుంచి దారు విగ్రహంలోకి ఆవాహనకు వేద మంత్రాలతో అభిషేకాలు, హోమాలు నిర్వహించామన్నారు. శుద్ధి చేసిన విగ్రహాన్ని మూల స్థానంలో ప్రతిష్టించామని తెలిపారు. శుక్రవారం విగ్రహానికి 'ప్రాణ ప్రతిష్ట' కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక శాసనసభ్యుడు బబొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద కుమార్ హాజరు కాగా ఆలయ డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి హాజరయ్యారు.



# రైల్వే సీనియర్ డిపిఓగా యం.బాలమురళీధర్

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 30 ప్రభాతవార్త: అవినీతి, అక్రమాలకు, అవకతవకలకు తావులేకుండా కార్మిక సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషిచేస్తానని సీనియర్ డిపిఓ ఎం.బాలమురళీధర్ అన్నారు. దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న క్యాప్రిల్ అరోరా దీర్ఘకాలంగా సెలవులపై ఉండటంతో ప్రస్తుతం జోనల్ ప్రధాన కేంద్రంలో పారిశ్రామిక సంబంధాల విభాగం డిప్యూటీ సిపిఓగా పనిచేస్తున్న యం.బాలమురళీధర్‌కు గుంతకల్లు సీనియర్ డిపిఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు.

## విద్యుత్ లైన్లకు నేటి నుంచి
# కరెంట్ సరఫరా

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 30 ప్రభాతవార్త: బెంగళూరు- సికింద్రాబాద్- న్యూఢిల్లీ ప్రధాన రైలు మార్గంలో సత్యసాయి జిల్లాలో పూర్తి అయిన విద్యుత్ రైలు మార్గానికి నేటి (ఈనెల 31 శుక్రవారం) నుంచి నిరంతరంగా విద్యుత్ సరఫరా లైవ్ (సజీవంగా) ఉంటుందని రైల్వే అధికారా వర్గాలు తెలిపాయి. నైరుతి రైల్వే బెంగళూరు డివిజన్ యలహంక, ధర్మవరం సెక్షన్ మక్కాజిపల్లి, నాగసముద్రం, ధర్మవరం స్టేషన్ల మధ్య ఇటీవల విద్యుదీకరణ పూర్తి అయింది. తాజాగా ఈ సెక్షన్‌లలో పూర్తైన 25 వేల కిలోవాల్టుల విద్యుత్ రైలుమార్గానికి అందుబాటులో తెచ్చినందున రైల్వే సిబ్బంది, ప్రజలు, రోడ్డు వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు సూచించారు.

# లింగాల మున్నేటి కాజ్‌వేపై ఉధృతంగా వరద ప్రవాహం

**- రాకపోకలు నిలిపివేసిన అధికారులు - వరద తీరుతెన్నులను పరిశీలించిన మంత్రి సత్యకుమార్‌యాదవ్, కలెక్టర్ లక్ష్మీశా, ఎంపి శివనాథ్, కెడిసిసి చైర్మన్, ఎంఎల్ఏ**



జగ్గయ్యపేట, అక్టోబరు 30 ప్రభాతవార్త: మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణా ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తెలంగాణా నుండి ప్రవహిస్తున్న మునేరు ఉగ్రరూపంలో పరుగులు తీస్తోంది. ఆంధ్రప్రదేశ్- తెలంగాణా రాష్ట్రాలకు సరిహద్దు మండలంగా వున్న ఎన్‌టిఆర్ జిల్లా వత్సవాయి పరిధిలోని లింగాల వద్ద శిధిలావస్థలోవున్న మునేటి కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ఈరహదారిని అధికారులు మూసివేశారు. బుధవారం రాత్రి నుండి మునేటి వరద అంతకంతకు పెరిగిపోతుండటంతో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో ఇక్కడ దృష్టిసారించింది. అలాగే ఇక్కడకు సమీపంలోని పెనుగంచిప్రోలులో కూడా తిరుపతమ్మతల్లి వారధిని తాకి పైనుండి నీరు ప్రవహి స్తుండటంతో ఇక్కడ కూడా పెనుగంచిప్రోలు, శనగపాడు, ముచ్చింతాల మార్గంలో వాహ నాల రాకపోకలను ఆపివేశారు.

జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, విజయవాడ ఎంపి కేసినేని శివనాథ్, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, జగ్గయ్యపేట ఎంఎల్ఏ రాజ గోపాల్, సిటి కమిషనర్ రామ కృష్ణ, ఆర్‌డిఓ బాలకృష్ణ, సబ్ డివిజన్ పోలీసు అధికారి తిలక్, సిఐ పి వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అర్ధరాత్రి వరకు ఎంఎల్ఏ రాజగోపాల్ లింగాల మునేటి కాజ్‌వేకు చిట్యాల వైపు అధికారులతో కలిసి వరద పరిస్థితులను సమీక్షించారు. గురువారం ఎన్‌టిఆర్ జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జగ్గయ్యపేట ప్రాంతానికి విచ్చేసి మునేటి వరదను పరిశీలించారు.

**లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాసాలకు తరలించండి : మంత్రి సత్యకుమార్‌యాదవ్**

మునేటి వరదల కారణంగా ఎక్కడా ఎలాంటి అవాంచనీయ సంఘటన జరుగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని నిరంతరం సమన్వయంతో పనిచేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. గురువారం రాత్రి లింగాల కాజ్‌వే ముంపు ప్రాంతాన్ని ఎంపి శివనాథ్, కెడిసిసి చైర్మన్ రఘురామ్, ఎంఎల్ఏ రాజగోపాల్‌తో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. పశువులు వరద ప్రవాహాల్లో కొట్టుకుపోకుండా జా గ్రత్తలు వహించాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.



కాగా గురువారం ఉదయం ఎంఎల్ఏ రాజగోపాల్ పోలంపల్లి మునేటి డ్యామ్‌ను ఆయకట్టు రైతులతో కలిసి పరిశీలించారు. డ్యామ్ పైభాగంలో చిన్నబుంగ పడి కాల్వలోకి నీరు చేరుతున్న ప్రమాదాన్ని గమనించిన స్థానిక టిడిపి నాయకులు రైతులతో కలిసి ట్రాక్టర్లు, జెసిబిలతో మట్టి తోలించి బుంగ పూడ్చటం అభినందనీయమన్నారు. తుపాను ప్రభావంతో దెబ్బతిన్న మిరప తోటలను పరిశీలించి రైతులకు న్యాయం జరిగేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ గౌరవరం గ్రామంలో వరదల కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలిం చారు. వరదల వల్ల వాటిల్లిన నష్టాల గురించి మండల టిడిపి అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు రఘురామ్‌కు విన్నవించారు. ప్రభుత్వపరంగా అవసరమైన సాయం అందించేందుకు కృషిచేస్తానని రఘురామ్ భరోసా ఇచ్చారు.

31-10P g7exHMNWJQE_31-10P g7exHMNWJQE.qxd 31/Oct/25 1:02 AM Page 1



# యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలి

● పారిశుద్ధ్య పనుల కోసం మొబైల్ బృందాలు ● మంచినీరు సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు ● ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ● పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యుఎస్ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్



విజయవాడ, అక్టోబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: తుపాను, భారీ వర్షాలు తగ్గాక గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య, తాగునీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది. ఎక్కడా ఇబ్బందులు లేకుండా దీనిని సమర్థవంతంగా పరిష్కరించాల్సిన బాధ్యత మనపై ఉంద్దని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. తుపాను ప్రభావం తీవ్రంగా ఉన్న గ్రామాల్లో సూపర్ క్లోరినేషన్, సూపర్ శానిటేషన్ కార్యక్రమాలను మొదలుపెట్టాలన్నారు. తుపాను ప్రభావం వల్ల పాడైన రోడ్లను ప్రాధాన్య ప్రకారం బాగు చేయాలన్నారు. మొంథా తుపాను అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యుఎస్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన చర్యలను తక్షణమే మొదలుపెట్టాలని సూచించారు. 1583 గ్రామాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రికి తెలియచేశారు. శానిటేషన్ సిబ్బందిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకున్నామని చెప్పారు. 38 చోట్ల రోడ్లు తీవ్రంగా దెబ్బ తిన్నాయనీ, మరో 125 చోట్ల రహదారులకు గుంతలు ఏర్పడ్డాయని వివరించారు. రక్షి త తాగు నీటి పథకాల ట్యాంకులు దగ్గర క్లోరినేషన్ ప్రక్రియ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "తాగు నీటిని అందించే పథకాలకు, నీటి సరఫరాకు ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయం చూడాలి. ఈ చర్యలు తక్షణమే తీసుకోవాలి. గ్రామాల్లో మొబైల్ శానిటేషన్ బృందాలను సిద్ధంగా ఉంచాలి. 21,055 మంది పారిశుద్ధ్య సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి పారిశుద్ధ్య మెరుగుదలకు వెంటనే చర్యలు చేపట్టండి. వాన నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో నీటిని బయటకు పంపించే చర్యలు తీసుకోవాలి. నీరు ఎక్కడ కలుషితం కాకుండా, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ తరుణంలో దోమల వల్ల వచ్చే వ్యాధులు పెరుగుతాయి. వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకొని గ్రామాల్లో వ్యాధులు రాకుండా అరికట్టాల్సిన బాధ్యత తీసుకోండి. మూడు, నాలుగు రోజుల పాటు పారిశుద్ధ్య నిర్వహణపై పూర్తిగా దీనిపై దృష్టి సారించండి. మళ్ళీ సాధారణ పరిస్థితి వచ్చే వరకు గ్రామాల్లో నిరంతరం పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలి. దీనిలో ఎక్కడ లోటుపాట్లకు తావు ఉండకూడదు. దెబ్బ తిన్న రహదారుల పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలుపెట్టాలి" అన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీ కృష్ణతేజ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఓపెన్ హౌస్

"గుంటూరు క్రైమ్, ప్రభాతవార్త, అక్టోబర్30: సమాజానికి పోలీస్ శాఖ అందిస్తున్న సేవల గురించి విద్యార్థులకు తెలియచెప్పడమే ఓపెన్ హౌస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ,.// విద్యార్థులకు సమాజ సేవ పట్ల ఆసక్తిని కల్పించడం మరియు పోలీస్ శాఖ పట్ల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా కృషి చేయడం.గురువారం గుంటూరు జిల్లా పోలీస్ కళ్యాణమండపంలో జిల్లా అదనపు ఎస్పీ(తిళి) తి.హనుమంతు ఆధ్వర్యంలో జిల్లా తిళి డిఎస్పీ త్రేడుకొండల రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ (పోలీస్ వారు వినియోగించే ఆయుధాల ప్రదర్శన) కార్యక్రమానికి ఎస్పీ హాజరై శాంతి భద్రతల పరిరక్షణ కొరకు తమ దైనందిన విధి నిర్వహణలో పోలీస్ వారు ఉపయోగించే వివిధ ఆయుధాలు,పరికరాల గురించి పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు స్వయంగా వివరించారు.



## మోటార్ సైకిల్ దొంగతనం కేసులో నిందితుడికి 4 నెలల జైలు

గుంటూరు క్రైమ్ ప్రభాతవార్త అక్టోబర్30గుంటూరు జిల్లా పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 06.05.2025న జరిగిన మోటార్ సైకిల్ దొంగతనం కేసులో విచారణ అనంతరం, కోర్టు నిందితుడికి శిక్ష విధించింది.కేసు వివరాలు ఇలా ఉన్నాయిఫిర్యాదుదారుడు ఎలూరి రామకృష్ణ (వయసు 42 సంగుంటూరు) తన విధులకు ఉపయోగించే ద్విచక్ర వాహనం వాడే యూనికార్న్ బైక్ ను 06.05.2025న సాయంత్రం 5 గంటల సమయంలో వెంకటమ్మ టీ స్టాల్ సమీపంలో పార్క్ చేసి హోటల్‌లోకి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించకపోవడంతో ఫిర్యాదు నమోదు చేసుకున్నాడు.పోలీస్ దర్యాప్తు: పట్టాభిపురం పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ టీ. సుబ్బారావు ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపి, నిందితుడు పులి. రమేష్ (వయసు 22 సంలు, దేవాపురం, గుంటూరు)ను గుర్తించి అరెస్ట్ చేశారు.ఈ కేసులో సాక్ష్యాధారాలు పరిశీలించిన గుంటూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ కోర్టు (దిది.వ్రి.4177/2025) నిందితుడు పులి. రమేష్‌ను గ/ళీ 271(2) తీవిళీ ప్రకారం 4 నెలల సాదారణ జైలు శిక్ష విధించింది.గురువారం న్యాయమూర్తి మేరీ శార దానమ్మ తీర్పు ప్రకటించారు. ఈ విజయవంతమైన దర్యాప్తు,కోర్టు తీర్పుకు పట్టాభిపురం పోలీస్ బృందం, కోర్టు లైజన్ ది। బి. నరసింహారావు ల కృషిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రశంసించారు.

## నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

విజయవాడ, అక్టోబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: మొంథా తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అంచనా వేసామని, కృష్ణా జిల్లాలోనే 46వేల హెక్టార్లలో నష్టం కలిగిందనీ చెప్పారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం :మంత్రి అనగాని

రేపల్లె అక్టోబరు 30 ప్రభాతవార్త: ప్రకృతి వైపరీత్యాల సమయంలో సైతం ప్రజల సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా గత 6 రోజులు నుంచి



ఆంధ్రప్రదేశ్ ప్రజలను వణికించిందన్నారు.తుఫాన్ తీవ్రత ప్రజలపై చూపించ కూడదని భారం పడకూడదని సిఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తుఫాన్ తీవ్రతను గమనిస్తూ అధికారి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని మంత్రి అనగాని వెల్లడించారు.మునుపెన్నడూ చరిత్రలో లేని విధంగా తుఫాన్ కి రెండురోజుల ముందే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచామన్నారు.రంపాలు, ట్రాక్టర్లు,ఇన్వర్టర్లు సిద్ధం చేయటంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా సిఎం ముందస్తు చర్యలు తీసుకున్నారని సత్యప్రసాద్ చెప్పారు.పునరావాస కేంద్రాలలో నాణ్యమైన ఆహారం,అవసరమైన వారికి మందులు అందజేయాలన్నారు గర్భిణీలు,మధుమేహవ్యాధులతో బాధపడే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని ఆయన తెలిపారు.క్షేత్రస్థాయిలో అధికారులతో పాటు టిడిపి,జనసేన,బిజెపి నాయకులు, కార్యకర్తలు విశేషమైన సేవలు అందించారని మంత్రి సత్యప్రసాద్ కొనియాడారు.రాష్ట్రంలోని 81 పోలీస్ టవర్స్ అద్భుతంగా సేవలు అందించారని ఆయన ప్రశంసించారు.ఏయే ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందో కొన్ని గంటల వ్యవధిలోనే పునరుద్ధరించామన్నారు.ప్రజల సంక్షేమం కోసం సిఎం చంద్రబాబు శక్తివంచన లేకుండా పనిచేస్తుంటే బ్లూ మీడియా ఇష్టానుసారంగా విమర్శలు గుప్పించడం విచారకరమన్నారు.

## అంజుమన్ కమిటీకి రూ.2.50 లక్షలు విరాళం

పొన్నూరు, అక్టోబరు 30,ప్రభాతవార్త: అంజుమన్ కమిటీకి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రవి ఫీ స్వీట్ అధినేత సయ్యద్ ఖాదర్, కుమారుడు సయ్యద్ బాజి అంజుమన్ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి రూ.2.50లక్షలు విరాళం అందజేశారు. అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో



కూరగాయల మార్కెట్ వద్ద అంజుమన్ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణం జరుగుతుంది. ఈ షాపింగ్ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని అంజుమన్ కమిటి అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్ కోరిన మీదుట స్పందించి సయ్యద్ బాజి ముందుకు వచ్చి ఒక షాపు నిర్మాణానికి రూ.2.50లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా మగ్బుల్‌బేగ్ మాట్లాడుతూ బాజిని ఆదర్శంగా తీసుకొని దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా అంజుమన్ కమిటి సభ్యులు బాజిని అభినందించారు.

## ప్రజల భక్తి శ్రద్ధలు అభినందనీయం

రేపల్లె, అక్టోబరు 30, ప్రభాతవార్త: రేపల్లె నియోజకవర్గంలోని నగరంలో గురువారం రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్స్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పర్యటించారు.నగరం మండలం గౌడ్ పాలెంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఏకశిలా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.ప్రజలు భక్తి శ్రద్ధలతో దైవ సంబంధమైన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.ఆంజనేయ స్వామి అనుగ్రహం ప్రజలపై ఉండాలని ఆయన కోరారు.

## వృద్ధులను ఆదుకోవడం మానవ ధర్మం



పొన్నూరు, అక్టోబరు 30,ప్రభాత వార్త: వృద్ధులకు సేవ చేయడం, ఆదుకోవడం, వారికి అవసరమైనవి సమకూర్చడం మానవ ధర్మమని లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీ రాణి అన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని వృద్ధులు కూడా కార్తీక మాస వన సమారాధనలో భాగస్వాములను చేసేందుకు విద్యానగర్‌లోని వృద్ధాశ్రమంలో వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధులతో పాటే లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళలందరూ వన భోజనాలు చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ రీజినల్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి మాట్లాడుతూ కార్తీ భోజనాలు వృద్ధాశ్రమంలో చేయడం ద్వారా వృద్ధులను కూడా ఆనందపరిచినవారమవుతామన్నారు. వృద్ధులకు కూడా కార్తీమ మాసంలో వన సమారాధనలకు హాజరవ్వాలనే కోరిక ఉంటుందన్నారు. వారి కోరికను తీర్చేందుకు ఝాన్సీరాణి ముందుకు వచ్చి వృద్ధాశ్రమంలో వన సమారాధన జరపాలనే ఆలోచన రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మహిళలు అనసూయాదేవి, పరాశం శేషుకుమారి, బి.శబలాదేవి, విజలక్ష్మి, పి.ఉమాకుమారి, కారుమంచి సృజన్, శిరీష పాల్గొన్నారు.

## ముంపుపై అప్రమత్తంగా ఉండాలి బాపట్లజిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

రేపల్లె, అక్టోబరు 30, ప్రభాతవార్త: తుఫాన్ ప్రమాదం తొలగిపోయిందని అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకుంటే ఇప్పుడు వరద ముంపు ముంచుకు వస్తోంది.5 లక్షల 66 వేల క్యూసెక్కుల నీరు కృష్ణా నది ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తోంది.రెండవ



నెంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ చెప్పారు. గురువారం రాత్రి ఆయన పెనుమూడిలో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కాల్వలు మూసి వేయడం జరిగిందన్నారు.పెనుమూడి పుష్కరఘాట్ వద్ద వరద ప్రవాహం పెరుగుతున్నందున కృష్ణా నదీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.పల్లెపాలెం ప్రజలు పెనుమూడి పునరావాస కేంద్రానికి తరలాలన్నారు.

## జగన్ బహిరంగ చర్చకు రావాలి

విజయవాడ, అక్టోబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: జగన్‌కు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే వ్యవసాయశాఖ తీసుకున్న అభివృద్ధి చర్యలు, కూటమి ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న మంచి కార్యక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని మంత్రి అచ్చెన్నాయుడు సవాలు విసిరారు. గతంలో విపత్తులు వచ్చినప్పుడు వైసీపీ ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన వ్యక్తిలా కాకుండా, అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారంటూ అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వాటా భీమా నగదును చెల్లించలేదని స్వయంగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి పార్లమెంట్‌లో వెల్లడి చేశారని గుర్తు చేశారు. ఇది జగన్ పాలన ఎంత అసమర్థమో చూపించే నిదర్శనమని ఎద్దేవా చేశారు. వైసీపీ మాటలు తప్ప రైతులకు మేలు చేసిన పని ఏదీ లేదని విమర్శించారు. పొరుగు రాష్ట్రంలో కూర్చొని వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడటం కాదని క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకోవాలని సూచించారు.

## కమ్మ, కాపుల మధ్య చిచ్చుకు జగన్ కుట్ర



సత్తెనపల్లి (పల్నాడుజిల్లా), అక్టోబరు 30 ప్రభాతవార్త: రాష్ట్రంలో కమ్మ, కాపుల మధ్య చిచ్చుపెట్టేందుకు మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. గురువారం స్థానిక విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్న సంఘటనను బూతద్దంలో చూపి శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పత్తిపాడు నియోజకవర్గంలో ఆర్థిక ఇబ్బందులతో శేషమ్మ అనే మహిళ ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆ సంఘటనను సైతం వైకాపా నాయకులు రాజకీయం చేయడం శోచనీయమన్నారు. తుఫాన్ వలన ఎటువంటి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, నూర్‌బాషా, జానీబాబు, తోట శ్రీనివాసరావు, అమరేశ్వర రావు, బత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల అభివృద్ధే లక్ష్యం

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



విజయవాడ,అక్టోబరు 30,ప్రభాతవార్తప్రతినిధి: అన్ని రంగాల్లో ఆర్యవైశ్యుల అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేశ్ ఆధ్వర్యంలో వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ సంఘం, ఏపీ ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి, వాసవీ ఫౌండేషన్, ఐవీఎఫ్ ప్రతినిధులు ప్రతినిధులు గురువారం కలిశారు. రాష్ట్రంలోని వైశ్యులను ఆర్య, శెట్టి, గుప్త, కోమటి, వేగిన, బుక్క, జనపశెట్టి అనే పేర్లతో సంభోదిస్తున్నారని, వారందరినీ ఆర్యవైశ్యులుగా ప్రభుత్వం గుర్తిస్తూ చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఆది నుంచి సీఎం చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఆర్థికంగానూ, రాజకీయంగానూ అభివృద్ధి చెందేలా ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. అన్ని కులాల మాదిరిగానే ఆర్యవైశ్యుల్లోనూ పేదలున్నారని, అటువంటి వారిని గుర్తించి ఆర్థికంగా అభివృద్ధే చెందేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఏపీ ఆర్యవైశ్య కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయబోతున్నా మన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తున్నామన్నారు. ఏపీ ఆర్యవైశ్య కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా ఆర్యవైశ్యులకు రుణ సదుపాయం కల్పించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధిలో ఆర్యవైశ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ పారేపల్లి దూండీ రాకేశ్, భగవాన్ నారాయణ, చిన్ని రామసత్యనారాయణ, కె.రజనీ, తల్లం సత్యనారాయణ, వీవీకే నర్సింహారావు, కోనా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడికి ఆరు నెలల సాధారణ జైలు

గుంటూరు క్రైమ్ ప్రభాతవార్త అక్టోబర్30గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 30.01.2025న జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడు ..షేక్ అమీర్ బేగ్ జోహరి (39 సం"ఆనందపేట,గుంటూరు)..ను గుంటూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ కోర్టు దోషిగా తేల్చి శిక్ష విధించింది.కేసు వివరాలు ఇలా ఉన్నాయి: జనవరి 30న మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో గుంటూరు పట్టణంలోని స్థంబాలగరువు 3వ లైన్ ప్రాంతంలో రేగల్ల సుజాత (62 సంవత్సరాలు) అనే మహిళ, ఆమె తన ఇంటికి తిరుగు ప్రయాణంలో ఉండగా, ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు (సుమారు 10 సవర్లు విలువ) మరియు నల్ల పూసల గొలుసును లాక్కొని, సుమారు రూ.1,60,000 విలువైన ఆభరణాలతో పరారయ్యాడు.బాధితురాలు ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ డి.అంజనేయులు కేసు నమోదు చేసి, ఇన్‌స్పెక్టర్ జి. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపి, నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. గురువారం గుంటూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి మేరీ సారా దానమ్మ విచారణ పూర్తిచేసి, నిందితుడు షేక్ అమీర్ బేగ్ జోహరిని భారత న్యాయ స్మృతి సెక్షన్ 271(2) తీవిళీళీ కింద దోషిగా తేల్చి, 6 నెలల సాదా జైలు శిక్ష విధించారు. (కేసు నంబర్: దిది వ్రి.4341/2025)అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. వెంకటేశ్వరరావు ఈ కేసును సమర్థంగా వాదించారు. దర్యాప్తును ఇన్‌స్పెక్టర్ జి. వెంకటేశ్వరరావు, సబ్‌ఇన్‌స్పెక్టర్ డి. అంజనేయులు, కోర్టు లైజన్ సీఐ బి. నరసింహ రావు విజయవంతంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..."మహిళలపై చైన్ స్నాచింగ్ వంటి నేరాలలో పాల్గొనే వ్యక్తులు తప్పించుకోలేరని, ఇలాంటి నేరాలకు చట్టపరమైన కఠిన శిక్షలు తప్పవని ఈ తీర్పు మరోసారి నిరూపించింది" అని తెలిపారు.

# స్వదేశీ ఉత్పత్తులను వాడండి

అనంతపురం, అక్టోబరు 30 ప్రభాతవార్త బ్యూరో: విదేశీ వస్తువుల వాడకాన్ని తగ్గించి స్వదేశీ ఉత్పత్తులను వాడడం అలవాటు చేసుకోవాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పిలుపునిచ్చారు. పివికెకె ఇంజనీరింగ్ కళాశాలలో బిజెపి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మాధవ్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, కళాశాల చైర్మన్ కిషోర్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి అపూర్వ స్వాగతం పలికారు.

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన బలసాని



కాకుమాను అక్టోబర్ 30, ప్రభాతవార్త: మండలంలోని అప్పాపురం మరియు రేటూరు గ్రామాలలో ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బలసాని కిరణ్ కుమార్ గురువారం పర్యటన చేశారు.ఈ కార్యక్రమంలో, ప్రత్తిపాడు తెనాలి నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్ మరియు కాకుమాను మండల, అప్పాపురం, రేటూరు గ్రామాల వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు మరియు కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతును ఆదుకుంటాం.. ఎవరు అధైర్యపడవద్దు: గాదె



కాకుమాను అక్టోబర్ 30 (ప్రభాత వార్త): మండల పరిధి అప్పాపురం గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతాంగం వెంకటేశ్వరరావు తో మాట్లాడుతూ ఇక్కడ ఉన్న డ్రైన్ వ్యవస్థ వల్లనే నిరంతరం పొలాలు దెబ్బతింటున్నాయని, వాటికి శాశ్వత పరిష్కారం చూపితేనే తాము వ్యవసాయం చేసుకోగలమని కోరారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం నష్టపోవడం వలన వ్యవసాయం చేసే పరిస్థితి లేదని తమకు శాశ్వత పరిష్కారం చూపించవలసిందిగా కోరారు. జిల్లా కార్యదర్శి చట్టాల త్రినాథ్, కాకమాను మండల అధ్యక్షులు గడ్డం శ్రీనివాసరావు, అప్పాపురం గ్రామ అధ్యక్షులు పిచ్చయ్య , మండల నాయకులు పూర్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.

## అటవీశాఖ రేంజ్ అధికారిని అరెస్టు చేసిన ఎసిబి

రేపల్లె, అక్టోబరు 30, ప్రభాతవార్త: రేపల్లె అటవీ శాఖ అధికారి వి.వి.రమణారావు గురువారం జరిగిన ఎసిబి దాడుల్లో అరెస్ట్ అయ్యారు.రూ.5.90 లక్షల బిల్లుకు 25 శాతం లంచం డిమాండ్ చేస్తున్నట్లు కాంట్రాక్టర్ వీర్లంకయ్య ఫిర్యాదుతో ఎసిడిటీ అధికారులు రంగం ప్రవేశం చేశారు.రూ.2 లక్షల లంచం తీసుకుంటుండగా రమణారావును అరెస్టు చేశారు.

## తహశీల్దార్ కారు ఢీకొని ఒకరికి గాయాలు


రేపల్లె, అక్టోబరు 30, ప్రభాతవార్త: భట్టిప్రోలు మండలంలోని అద్దేపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి.పోలీసుల కథనం ప్రకారం గురువారం ఉదయం 11 గంటల సమయంలో 216 జాతీయ రహదారిలో రేపల్లెకు వెళ్తున్న చెరుకుపల్లి మండల తహశీల్దార్ కారు డ్రైవర్ తోటకూర చైతన్య భట్టిప్రోలు సర్వీసు రోడ్డు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు.వాహనం నడుపుతున్న ఆరాధ్యుల సుబ్రహ్మణ్యం ఎడమ కాలు విరిగింది. వెంటనే 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.క్షతగాత్రుడు వెనుక కూర్చున్న ఎ.మధుకు స్వల్ప గాయాలయ్యాయి.క్షతగాత్రులు చెరుకుపల్లి మండలంలోని కనగాల గ్రామానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి మృతి

రేపల్లె, అక్టోబరు 30, ప్రభాతవార్త: భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన కొలుసు వెంకటేశ్వరరావు (39) గురువారం ఉదయం 9 గంటలకు మూడు తూములు పంట కాల్వ వద్ద ఫిట్స్ కారణంగా నీటిలో పడిపోయి మృతి చెందినట్లు ఎస్ఐ శివయ్య తెలిపారు.మృతుని తల్లి వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## పంట పొలాలను పరిశీలించిన ఏవో

పెదనందిపాడు అక్టోబర్ 30,(ప్రభాతవార్త) మండలం లోని పుసులూరు గ్రామం లో, వరి మరియూ ప్రత్తి పొలాలను మండల వ్యవసాయ అధికారి ఐ. సుబ్రమణ్యం గురువారం పరిశీలించారు. అధిక వర్షాలతో వరదలు వచ్చి గోగులమూడి మేకల వాగు ఉధృతి అధికం



అవ్వడం వలన పుసులూరులోని సుమారు 295 ఏకరాలలో వరి పొలాల్లో వర్షం వల్ల ముంపువకు గురి అయ్యిందని తెలిపారు. క్రమేనా వరద ఉధృతి తగ్గే అవకాశం వున్నదని, రేపటి కల్లా నీరు తగ్గే అవకాశం ఉన్నది అన్నారు.

## పంటలను పరిశీలించిన సిపిఎం, రైతు సంఘం నాయకులు

పెదనందిపాడు అక్టోబర్ 30 (ప్రభాతవార్త) పెదనందిపాడు, కాకుమాను మండలాలలో మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పత్తి, మిరప, వరి పంటలను సిపిఎం, రైతు సంఘాల నాయకులు గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ పెదనందిపాడు



మండలంలో పత్తి, మిరప పంటలు పూర్తిగా నీట మునిగాయని తెలిపారు. పత్తి పంటకు కౌలు కాకుండా ఎకరానికి ఇప్పటివరకు 20, వేలు నుండి 25, వేలు రూపాయల వరకు, మిరప పంటకు ఎకరాకు 40, వేల రూపాయలు పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారని పేర్కొన్నారు.

## నాగేశ్వరరావుకు మాతృవియోగం

పెదనందిపాడు అక్టోబర్ 30 (ప్రభాతవార్త)సిపిఎం జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు మాతృమూర్తి కాకుమాను సరస్వతి (80) గురువారం పెదనందిపాడు లోని వారి స్వగృహం వద్ద ఉదయం 11 గంటలకు మృతి చెందారు. వారి భౌతిక కాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు సందర్శించి నివాళులర్పించారు.సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోటపాటి నళినీ కాంత్, ఈమని అప్పారావు, సిపిఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సభ్యులు ముద్దన వెంకటేశ్వర్లు, పసుపులేటి శేషగిరిరావు, కన్నెగంటి చంద్రరావు ఉపాధ్యాయ యూనియన్ సభ్యులు పుసులూరు పోతురాజు. తదితరులు లు ఉన్నారు.

## నిత్యవసర వస్తువులు అందజేసిన ఎమ్మెల్యే

పెదనందిపాడుఅక్టోబర్ 30,(ప్రభాతవార్త) మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను రక్షి ంచే కార్యక్రమంలో భాగంగా అధికారులు పెదనందిపాడు ఎస్సీ హాస్టల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి పునరావాస కేంద్రంలోని వారికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జనసేన నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు, టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గం నాయకులు జంపని హనుమంతరావు, గ్రామ అధ్యక్షులు రావి శివరామకృష్ణయ్య, ఐ టీడీపీ నాయకులు దివి నాగరాజు తదితరులు 25 కేజీల బియ్యం, ఇతర నిత్యవసర సరుకులు అందించారు.




## ఆసియా యూత్ గేమ్స్ బాక్సింగ్‌లో
# ఖుషీ, అహానా, చంద్రికకు గోల్డ్

**న్యూఢిల్లీ:** ఆసియా యూత్ గేమ్స్-2025లో భారత మహిళా బాక్సర్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. బహ్రెయిన్‌లోని మనామాలో గురువారం జరిగిన 2025 ఆసియా యూత్ గేమ్స్‌లో మూడు బంగారు పతకాలను గెలుచుకున్నారు. అలాగే బాలుర 50 కేజీల బాక్సింగ్ ఈవెంట్‌లో లాంచెన్‌బా సింగ్ మోయిబుంగ్‌ఖోంగ్‌బామ్ రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. ఖుషీ చంద్ (46



కిలోలు), అహానా శర్మ (50 కిలోలు), మరియు చంద్రిక పూజారి (54 కిలోలు) తమ తమ ఫైనల్స్‌లో ఆధిపత్యం చెలాయించి గోల్డ్ మెడల్స్ దక్కించుకున్నారు. ఖుషీ మరియు చంద్రిక తమ చైనీస్ (41) మరియు ఉజ్బెకిస్తానీ (50) ప్రత్యర్థులపై అద్భుతమైన విజయాలు సాధించగా, అహానా మూడు స్టాండింగ్ కౌంట్‌లతో ఉత్తర కొరియా బాక్సర్‌పై మొదటి రౌండ్ ఆర్ఎస్‌సి విజయాన్ని సాధించింది. బాలుర విభాగంలో, భారతదేశపు ఏకైకఫైనలిస్ట్ లాంచెన్‌బా సింగ్ మోయిబుంగ్ ఖోంగ్‌బామ్ కజకిస్తాన్‌కు చెందిన జుమగలి నూర్మాఖాన్ చేతిలో 0-5 తేడాతో ఓడిపోయి రజత పతకంతో సంతృప్తి చెందాడు. ఇక బీచ్ రెజ్లింగ్ మరియు జూడో వంటి ఇతర క్రీడలలో కూడా భారత్‌కు పతక అవకాశాలు ఉన్నాయి. బీచ్ రెజ్లింగ్‌లో ఇప్పటికే ఐదుగురు అథ్లెట్లు సెమీఫైనల్‌కు చేరుకోగా, ముగ్గురు భారతీయ జూడోకాస్ కూడా సెమీస్‌కు చేరుకున్నారు.

## తొలి అనధికారిక టెస్ట్‌లో..
# భారత్‌పై దక్షిణాఫ్రికా పైచేయి

**న్యూఢిల్లీ:** భారత్‌తో జరుగుతున్న మొదటి అనధికారిక టెస్ట్ తొలి రోజు దక్షిణాఫ్రికా పై చేయిగా నిలిచింది. బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్ వేదికగా గురువారం జరిగిన మొదటి రోజు ప్రోటీస్ జట్టు డే వన్ ఆట ముగిసే సమయానికి 85.2 ఓవర్లఓ 9 వికెట్లు నష్టానికి 299 పరుగులు చేసింది. క్రీజులో షెపో మోరెకి (4), కుష్లో సెలె (0) ఉన్నారు. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో జోర్డాన్ హెర్మాన్ (71), హంజా (66), రుబిన్ హెర్మాన్ (54) హాఫ్ సెంచరీలతో రాణించారు. కెప్టెన్ మార్కో అకెర్మాన్ (18) పరుగులు మాత్రమే చేసి విఫలమయ్యాడు. భారత్ బౌర్లలో ముంబై స్పిన్నర్ తనీష్ కొటియన్ 4 వికెట్లుతో సత్తా చాటగా, మానవ్ సుత్తర్ 2, అన్షుల్ కాంబోస్, ఖాలీల్ అహ్మద్ తలా వికెట్ సాధించారు. కాగా ఇండియా జట్టుకు సీనియర్ వికెట్‌కీపర్, బ్యాటర్ పంత్ నాయకత్వం వహిస్తున్నాడు.గాయం నుండి పూర్తిగా కోలుకోవడంతో భారత్ తరపున దక్షిణాఫ్రికాతో జరిగే అనధికారిక మ్యాచ్‌లో పాల్గొనే అవకాశం లభించింది. ఇక రెండో అనధికారిక టెస్ట్‌లో కెఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్ వంటి సీనియర్ ప్లేయర్లు కూడా ఆడనున్నారు.



# ప్రీక్వార్టర్ ఫైనల్‌కు శ్రీవల్లి, సహజ

**న్యూఢిల్లీ:** చెన్నై ఓపెన్‌లో శ్రీవల్లి, సహజ దూసుకుపోతున్నారు. 2025 డబ్ల్యూటిఎ 250 చెన్నై ఓపెన్‌లో భారత స్టార్లు సహజ యమలపల్లి మరియు శ్రీవల్లి భమిడిపాటి ప్రిక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. గురువారం ఈ చెన్నై ఓపెన్‌లో సహజా 6-4, 6-2తో ఇండోనేషియాకు చెందిన ప్రిస్కా నుగ్రోహోపై విజయం సాధించింది. అదే సమయంలో శ్రీవల్లి 6-1, 6-4తో తోటి దేశస్థుడు, 16 ఏళ్ల మాయ రాజేశ్వరన్‌ను ఓడించింది. 2006 బెంగళూరు ఓపెన్ ఇద్దరు భారతీయులు సింగిల్స్ డబ్ల్యూటిఎ టూర్ ఈవెంట్‌లో రెండవ రౌండ్‌కు చేరుకోవడం ఇదే మొదటిసారి. మొత్తం భారతదేశంతో జరిగిన పోరులో, శ్రీవల్లి తొలి సెట్‌లో తన యువ స్వదేశీయురాలిపై విజయం సాధించింది. రెండు బ్రేక్‌లను మార్చిన తర్వాత దాన్ని సులభంగా గెలుచుకుంది. రెండవ సెట్‌లో, ఇద్దరు ఆటగాళ్లు సర్వ్ పట్టుకోవడంలో ఇబ్బందులను ఎదుర్కొన్నారు, కానీ శ్రీవల్లి చివరికి 6-4తో గెలిచింది, మూడుసార్లు బ్రేక్ చేయబడిన మాయ కంటే ఒక బ్రేక్ తక్కువగా సాధించింది. తదుపరి జరిగే రెండో రౌండ్‌లో ఆస్ట్రేలియాకు చెందిన 7వ సీడ్ కింబర్లీ బిరెల్‌తో తలపడనున్న శ్రీవల్లి ఇప్పుడు కష్టతరమైన సవాల్‌ను ఎదుర్కోనుంది. మరోవైపు, సహజా రెండవ రౌండ్‌లో టాప్ 100 ర్యాంక్‌లో ఉన్న క్రీడాకారిణితో తలపడుతోంది. ప్రపంచ ర్యాంక్‌లో 78వ స్థానంలో ఉన్న క్రొయేషియాకు చెందిన మూడవ సీడ్ డోనా వెకిక్‌ను ఎదుర్కొంటోంది. ఇక డబుల్స్ విభాగంలో కూడా భారతదేశం బలమైన ప్రదర్శన ఇచ్చింది. ఇద్దరు భారతీయ జంటలు రియా భాటియా మరియు రుతుజా భోసాలే, మాయా రాజేశ్వరన్ మరియు వైష్ణవి అడ్కర్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు.

## వన్డే వరల్డ్ కప్‌కు..
# టీమిండియాలో నో ప్లేస్
### 15 మంది ఆటగాళ్లు ఫిక్స్.. భారత్ జట్టులో సిరాజ్, జైస్వాల్ ఔట్

**న్యూఢిల్లీ:** వన్డే ప్రపంచ కప్ 2027 దక్షిణాఫ్రికాలో జరగనుంది. ఈ ప్రపంచ కప్ కోసం జట్లు ఇప్ప టికే సన్నాహాలు ప్రారంభించాయి. భారత్ కూడా జట్టు కూర్పును దాదాపు ఖరారు చేసుకుంటూ వన్డే ప్రపంచ కప్‌కు సిద్ధమవుతోంది. ఇందుకుగాను వన్డే ప్రపంచ కప్ కోసం టీమిండియాలో 15 మంది సభ్యుల జట్టును ఖరారు చేశారు. అయితే మహమ్మద్ సిరాజ్, యశస్వి జైస్వాల్ వంటి ఆటగాళ్లను పక్కన పెట్టనున్నట్లు సమాచారం. రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ వంటి ఆటగాళ్ళు కూడా 2027 వన్డే ప్రపంచ కప్‌లోకి తీసుకుంటున్నారు. అందుకే ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో ఇద్దరికీ అవకాశం కల్పించారు. రోహిత్ శర్మ జట్టులో ఉండే అవకాశం ఉన్నందున యశస్వి స్థానం కష్టం. అందువల్ల, జైస్వా ల్ స్థానం దక్కించుకోవడం కష్టం. హర్షిత్ రాణా జట్టులో స్థిరంగా ఉండటం వల్ల మహ్మద్ సిరాజ్ స్థానం కూడా కష్టం. ఇక జట్టులో స్థానం పొందేవారిపై ఇప్పటికే భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు సెలక్టర్లు కసరత్తు చేస్తున్నారు. 2027 వన్డే ప్రపంచ కప్ కోసం భారత జట్టుకు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించనున్నారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శ్రేయాస్ అయ్యర్, హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్ వంటి ఆటగాళ్లను జట్టులో చేర్చేందుకు సెలక్టర్ల కమిటీ నిర్ణయం తీసుకుంది. అదనంగా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, మహ్మద్ షమీ, రిషబ్ పంత్ వంటి ఆటగాళ్లు జట్టులో చోటు సంపాదించడంతో బలాబలాలను బేరీజు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2027 వన్డే ప్రపంచ కప్‌నకు ప్రాబబుల్ భారత జట్టులో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, మహమ్మద్ షమీ ఉన్నారు.



## కెనడియన్ మహిళల ఓపెన్‌లో
# సెమీఫైనల్‌లో అనాహత్ ఓటమి

**న్యూఢిల్లీ:** భారత ఏస్ స్క్వాష్ క్రీడాకారిణి అనహత్ సింగ్ కెనడియన్ ఉమెన్స్ ఓపెన్‌లో సెమీఫైనల్‌లోనే నిష్క్రమించింది. పిఎస్ఎ స్క్వాష్ టూర్‌లో ఇప్పటివరకు ఆమె అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేసింది. ఈ టోర్నమెంట్‌లో 17 ఏళ్ల అనహత్ టాప్20 ఆటగాళ్లపై రెండు విజయాలతో మొదటిసారి పిఎస్ఎ సిల్వర్‌టైర్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు చేరుకుంది. అయితే తాజాగా జరిగిన సెమీఫైనల్లో, ఆమె ఇంగ్లాండ్‌కు చెందిన నాల్గవ సీడ్ జార్జినా కెన్నెడీ చేతిలో 5-11, 8-11, 10-12 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయింది. క్వార్టర్ ఫైనల్స్‌లో అగ్రస్థానంలో ఉన్న క్రీడాకారిణిపై ఆమె తన తొలి విజయాన్ని నమోదు చేసింది. అక్కడ ఆమె బెల్జియంకు చెందిన ప్రపంచ నం.7 టిన్నే గిలిస్‌ను వరుస గేమ్‌లలో ఓడించింది. ప్రపంచంలో 43వ ర్యాంక్‌లో ఉన్న అనహత్ ఇప్పుడు ప్రపంచ టాప్20 ర్యాంకింగ్స్ వైపు పెద్ద అడుగులు వేస్తోంది. ఆమె ఇప్పుడు నవంబర్ రెండవ వారంలో జరిగే చైనా ఓపెన్ 2025లో పోటీపడుతుంది. ఇది గోల్డ్‌టైర్ టోర్నమెంట్, కెనడియన్ ఓపెన్ కంటే ఒక లెవెల్ పైన ఉంటుంది. అనహత్ ఈజిప్ట్‌కు చెందిన ప్రపంచ 16వ ర్యాంకర్ సనా ఇబ్రహీంతో తన మొదటి రౌండ్ మ్యాచ్‌తో ప్రారంభించనుంది.



# ఉద్యోగుల తొలగింపుకోసం బిలియన్ల కొద్దీ డాలర్ల ఖర్చు




### కార్పొరేట్ ఐటి దిగ్గజాల్లో బ్రాండ్ ఇమేజ్‌కోసం తాపత్రయం

**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** ప్రపంచ ఐటీ దిగ్గజాలు ఉద్యోగులను తొలగించేందుకే బిలియన్ల కొద్దీ డాలర్లు ఖర్చు చేస్తున్నాయి. సివరెన్స్ ప్యాకేజీలు, ఇతర ప్రయోజనాల రూపంలో భారీ మొత్తాలను చెల్లిస్తున్నాయి. ఇది చూడ్డానికి వింతగా అనిపించినా, దీని వెనుక ఒక పక్కా వ్యాపార వ్యూహం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవడం, పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని నింపడం, ఎఐ యుగానికి అనుగుణంగా కంపెనీలను పునర్వ్యవస్థీకరించడమే ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు కారణం. భారీ మొత్తంలో సెవరెన్స్ ప్యాకేజీలు ఇవ్వడం వల్ల కంపెనీలకు స్వల్పకాలంలో ఆర్థిక భారం పడినప్పటికీ, దీర్ఘకాలంలో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. "భారీగా సెవరెన్స్ ప్యాకేజీ ఇవ్వడం వల్ల కంపెనీ బ్రాండ్ విలువ దెబ్బతినకుండా ఉంటుంది. న్యాయపరమైన చిక్కులు తలెత్తవు. భవిష్యత్తులో జీతాల భారం తగ్గి, కంపెనీ ఆర్థిక నిర్మాణం మెరుగుపడుతుంది" అని ఎంబ్రేస్ కన్సల్టింగ్ వ్యవస్థాపకురాలు శ్రుతి స్వరూప్ వివరించారు.

టెక్నాలజీ రంగంలో కంపెనీ ప్రతిష్ఠ అనేది నియామకాలకు, కస్టమర్ల నమ్మకానికి చాలా కీలకమని, అందుకే ప్రతికూల ప్రచారాన్ని నివారించేందుకు కంపెనీలు ఇలాంటి ఖరీదైన మార్గాలను ఎంచుకుంటాయని ఆమె తెలిపారు. భారత ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) కూడా ఇటీవల ఎఐ ఆధారిత పునర్వ్యవస్థీకరణలో భాగంగా 20,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఇందుకోసం సెవరెన్స్ ప్యాకేజీల కింద ఒకేసారి రూ. 1,135 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించింది.

ఈ ప్యాకేజీలో మూడు నెలల నోటీస్ పీరియడ్ జీతంతో పాటు, అనుభవాన్ని బట్టి ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు వేతనం, ముందస్తు పదవీ విరమణ అవకాశాలు వంటివి ఉన్నాయి. మరోవైపు, గ్లోబల్ టెక్ దిగ్గజం యాక్సెంచర్ గత మూడేళ్లలో సెవరెన్స్ ప్యాకేజీల కోసం ఏకంగా 2 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేసింది.

ఆటోమేషన్ దిశగా కంపెనీని మార్చడంలో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ సిఇఒ జూలీ స్వీట్ తెలిపారు. ఇదే బాటలో ఆల్ఫాబెట్ (గూగుల్) 12,000 మంది ఉద్యోగుల తొలగింపునకు బిలియన్ డాలర్లు, మెటా బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేశాయి. అమెజాన్, మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్ వంటి కంపెనీలు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. ప్రస్తుత లేఆఫ్‌లు కేవలం ఖర్చు తగ్గించుకోవడానికి సంబంధించినవి కాదని, ఎఐ టెక్నాలజీకి అనుగుణంగా వర్క్‌ఫోర్స్‌ను మార్చడంలో భాగమని నిపుణులు చెబుతున్నారు. ఏఐ చేయగల పనుల నుంచి ఉద్యోగులను తొలగించి, ఆ పెట్టుబడిని ఇతర రంగాల్లో పెడుతున్నారు. అందుకే ఈ సెవరెన్స్ ప్యాకేజీలను కంపెనీలు పరివర్తన ఖర్చుగా చూస్తున్నాయని గ్రేట్ లేక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విభవ్ సింగ్ పేర్కొన్నారు.

## వాణిజ్యం

# గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ రాబడులు రూ.8.80 లక్షలకోట్లు!



**కాలిఫోర్నియా, అక్టోబరు 30:** టెక్ దిగ్గజం,గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ చరిత్ర సృష్టించింది. తన చరిత్రలో తొలిసారిగా ఒకే త్రైమాసికంలో 100 బిలియన్ డాలర్ల సుమారు రూ.8.80 లక్షల కోట్లు ఆదాయాన్ని సాధించి సరికొత్త రికార్డు నమోదు చేసింది. సెర్చ్, క్లౌడ్, యూట్యూబ్ సహా అన్ని కీలక విభాగాల్లోనూ బలమైన రెండంకెల వృద్ధిని సాధించడం వల్లే ఇది సాధ్యమైందని ఆల్ఫాబెట్ సిఇఒ సుందర్ పిచాయ్ ప్రకటించారు. కంపెనీ 2025 మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా సుందర్ పిచాయ్ ఈ వివరాలను తెలిపారు. జెమినీ యాప్ నెలవారీ యాక్టివ్ యూజర్ల సంఖ్య 650 మిలియన్లు దాటింది. గత త్రైమాసికంతో పోలిస్తే జెమినీపై వచ్చే ప్రశ్నలు మూడు రెట్లు పెరిగాయని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) టెక్నాలజీ కంపెనీ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన స్పష్టం చేశారు. క్లౌడ్ విభాగం అద్భుతమైన పనితీరు కనబరిచిందని, ఏఐ ఆధారిత ఆదాయం దీనికి ముఖ్య కారణమని పిచాయ్ అన్నారు. క్లౌడ్ బ్యాక్‌లాగ్ గత క్వార్టర్‌తో పోలిస్తే 46 శాతం పెరిగి 155 బిలియన్ డాలర్లకు చేరింది. అలాగే గూగుల్ వన్, యూట్యూబ్ ప్రీమియం వంటి పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ల సంఖ్య 300 మిలియన్ల మార్కును దాటిందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 40 భాషల్లో ప్రారంభించిన ఎఐ మోడ్‌కు రోజూ 75 మిలియన్ల మంది యాక్టివ్ యూజర్లు ఉన్నారని, ఇది సెర్చ్ ప్రశ్నల పెరుగుదలకు దోహదపడుతోందని ఆయన పేర్కొన్నారు. గూగుల్ సర్వీసెస్ ఆదాయం ఈ త్రైమాసికంలో 14 శాతం వృద్ధితో 87 బిలియన్ డాలర్లకు చేరిందని గూగుల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఫిలిప్ షిండ్లర్ తెలిపారు. సెర్చ్, యూట్యూబ్ విభాగాల్లో నమోదైన వృద్ధి దీనికి కారణమని చెప్పారు. గూగుల్ సెర్చ్ ఆదాయం 15 శాతం పెరగ్గా, రిటైల్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలు ప్రధాన పాత్ర పోషించాయని వివరించారు. యూట్యూబ్ ప్రకటనల ఆదాయం కూడా 15 శాతం పెరిగింది. ఎఐ ఓవర్‌వ్యూస్, ఎఐ మోడ్ వంటి కొత్త ఫీచర్లపై పెడుతున్న పెట్టుబడులు వాణిజ్య పరమైన ప్రశ్నలను పెంచి, ఆదాయాన్ని ఆర్జించడానికి మరిన్ని అవకాశాలను సృష్టిస్తున్నాయని ఆయన అన్నారు.

## భారత్‌కు రానున్న సత్య నాదెళ్ల



**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్ల త్వరలో భారత్ పర్యటనకు వస్తున్నారు. ఆయన డిసెంబర్‌లో ఢిల్లీ, ముంబయితో పాటు బెంగళూరు నగరాలను సందర్శిస్తారు. ప్రభుత్వ అధికారులు, మైక్రోసాఫ్ట్‌కు చెందిన ఉద్యోగులను కలుస్తారని తెలుస్తోంది. సత్య నాదెళ్ల తన పర్యటనలో ముఖ్యమైన అనేక ఎఐ సంబంధిత సమావేశాల్లో ప్రసంగిస్తారని కంపెనీ చెపుతోంది. కంపెనీ అధికారికంగా ఆయన పర్యటనను ధ్రువీకరించనప్పటికీ ఈపర్యటన మైక్రోసాఫ్ట్‌కు వ్యూహాత్మకంగా కీలకమైందిగా భావిస్తున్నారు. భారత్‌అమెరికా సంబంధాలు కొత్త దశలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఆయన భారత్‌లో పర్యటించనున్నారు. ఇటీవల రెండు దేశాలు విభేదాలను పక్కనపెట్టి సాంకేతిక భాగస్వామ్యంపై దృష్టి సారిస్తున్నాయి. మరో వైపు భారత ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియా యాప్‌లు, సేవలను ప్రోత్సహిస్తున్నది. జోహో కార్పొరేషన్ వంటి భారతీయ కంపెనీలు మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీలకు ప్రత్యామ్నాయంగా నిలువబోతున్నాయి. ఇదిలా ఉండగా సత్య నాదెళ్ల ఈ యేడాది జనవరిలోనూ భారతలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన భారత ప్రధాని నరేంద్ర మోడీని కలిశారు. దేశంలో ఎఐ రంగంలో మూడు బిలియన్ డాలర్ల పెట్టుబడిని పెట్టాలనున్నట్లు మైక్రోసాఫ్ట్ సిఇఒ ప్రకటించారు. ఈ పర్యటన ఆయన దార్శనికతను ముందుకు తీసుకెళ్లే దిశలో మరో ముందడుగుగా భావిస్తున్నారు. భారత్‌లో ఎఐ రంగంలో పోటీ వేగంగా పెరుగుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో ఎఐ డేటా సెంటర్‌ను నిర్మించడానికి రాబోయే ఐదు సంవత్సరాలలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని గూగుల్ ప్రకటించింది. మైక్రోసాఫ్ట్ మద్దతు ఉన్న ఓపెన్ ఎఐ భారతీయ వినియోగదారులకు చాట్‌జీపీటీ గో ఏడాది ఫ్రీ సబ్‌స్క్రిప్షన్‌ను ప్రకటించింది.

# అమ్మకాల ఒత్తిళ్లతో ఈక్విటీ సూచీల లాభాలకు బ్రేక్



**ముంబయి, అక్టోబరు 30:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. అమ్మకాలతో ఒత్తిడితో మార్కెట్లు పతనమయ్యాయి. క్రితం సెషన్‌లో పోలిస్తే స్వల్ప నష్టాలతో మొదలైన మార్కెట్లు ఏ దశలోనూ కోలుకోలేదు. గురువారం ఉదయం సెన్సెక్స్ 84,750.90 పాయింట్లవద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 84,906.95 పాయింట్ల గరిష్టానికి చేరిన సెన్సెక్స్ అత్యల్పంగా 84,312.65 పాయింట్లకు పడిపోయింది. చివరకు 592.67 పాయింట్లు తగ్గి 84,404.46 వద్ద ముగిసింది. నిఫ్టీ176.05 పాయింట్లు తగ్గి 25,877.85 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,808 షేర్లు రాణించగా 2,167 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ ఒక్కొక్కటి 0.1 శాతం పడిపోయాయి. హెల్త్‌కేర్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మా స్టాక్స్ భారీగా నష్టపోయాయి. నిఫ్టీ హెల్త్‌కేర్ ఇండెక్స్ 0.81 శాతం పడిపోయింది. ఫైనాన్షియల్ సర్వీసెస్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు ఒక్కొక్కటి 0.7 శాతంతగ్గాయి. ఐటి, ఎఫ్ఎంసిజి, ఆటోరంగాల షేర్లు స్వల్ప నష్టాలను చవిచూశాయి. రియాల్టీమాత్రమే స్వల్పంగా లాభపడింది. 0.13 శాతం పెరిగింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్, గ్యాస్ సూచీలు స్వల్పంగా దిగజారాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో కోల్ ఇండియా, లార్సెన్, భారత్ ఎలక్ట్రికల్స్, హిందాల్కో, నెస్లే, మారుతి సుజుకీ, టిఎంపీవీ, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, జేఎస్ డబ్ల్యూ సిమెంట్ లాభపడ్డాయి. డాక్టర్ రెడ్డీస్, సిప్లా, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, భారతి ఎయిర్‌టెల్, ఇంటర్‌గ్లోబ్, టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఆటో, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్ నష్టపోయాయి.

# మలేసియాలో రేజర్‌పే యుపిఐ చెల్లింపులకు ఓకే!

**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూపిఐ విదేశాలకు విస్తరిస్తోంది. ఫిన్‌టెక్ సంస్థ రేజర్‌పే, త్వరలోనే మలేషియాలో భారత పర్యాటకులు యూపిఐ ద్వారా చెల్లింపులు చేయవచ్చని గురువారం ప్రకటించింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసిఐ) అంతర్జాతీయ విభాగమైన ఎన్‌పిసిఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్‌తో రేజర్‌పేకు చెందిన మలేషియా సంస్థ కర్లెక్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025 వేదికగా ఈ ఒప్పందం ఖరారైంది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, మలేషియా పర్యటనకు వెళ్లే లక్షలాది మంది భారత పర్యాటకులు అంతర్జాతీయ కార్డులు లేదా కరెన్సీ మార్పిడి వంటి ఇబ్బందులు లేకుండా తమకు అలవాటైన యూపిఐ యాప్స్ ద్వారానే సులభంగా, సురక్షితంగా చెల్లింపులు చేయవచ్చు. ఇది భారత యూపిఐ సేవలను ప్రపంచవ్యాప్తం చేయడంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. గతేడాది 10 లక్షల మందికి పైగా భారత పర్యాటకులు మలేషియాను సందర్శించి, రూ.110 బిలియన్లకు పైగా ఖర్చు చేశారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 71.7 శాతం అధికం. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న పర్యాటకుల రాకపోకల నేపథ్యంలో సులభమైన, ఖర్చు లేని చెల్లింపుల అవసరాన్ని ఈ ఒప్పందం తీర్చనుంది. ఈ ఒప్పందం ప్రకారం మలేషియాలోని వ్యాపారులు రేజర్‌పే కర్లెక్ ప్లాట్‌ఫామ్ ద్వారా నేరుగా యూపిఐ చెల్లింపులను తీసుకోవచ్చు. వారికి చెల్లింపులు స్థానిక కరెన్సీ అయిన రింగిట్ రూపంలో జమ అవుతాయి. భారత్‌లో యూపిఐ చెల్లింపుల వ్యవస్థ ఎంతగా విజయవంతమైందో తెలిసిందే. గత సెప్టెంబర్ నెలలోనే దాదాపు 20 బిలియన్ల లావాదేవీలు నమోదయ్యాయి. ఈ బలమైన వ్యవస్థతో అనుసంధానం కావడం వల్ల మలేషియా వ్యాపారులు కూడా ప్రయోజనం పొందనున్నారు. ఈ ఒప్పందంపై రేజర్‌పే మేనేజింగ్ డైరెక్టర్, సహ వ్యవస్థాపకుడు శశాంక్ కుమార్ మాట్లాడుతూ భారత్‌లో చెల్లింపుల తీరును యూపిఐ పూర్తిగా మార్చేసింది. ఆవిష్కరణ, సమ్మిళిత వృద్ధి కలిస్తే ఎలాంటి అద్భుతాలు చేయవచ్చో నిరూపించింది. ఇప్పుడు కర్లెక్ ద్వారా అదే స్ఫూర్తిని మలేషియాకు తీసుకెళ్తున్నాం. ఆసియాలో సరిహద్దుల్లేని ఫిన్‌టెక్ భవిష్యత్తును నిర్మించడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగని పేర్కొన్నారు.




# రూ.6632కోట్లకు 'గ్రో' ఐపిఒ!

**ముంబయి, అక్టోబరు 30:** స్టాక్‌బ్రోకింగ్ సంస్థ గ్రో మాతృసంస్థ అయిన బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ ఐపిఒకు వచ్చేస్తోంది. వచ్చేనెల 4నుంచి ప్రారంభం అయి ఏడోతేదీ ముగుస్తుంది. ఐపిఒద్వారా 6632 కోట్లు సమీకరించాలని నిర్ణయించింది. ఇష్యూధరల శ్రేణిని రూ.95-100గా నిర్ణయించింది. రూ.61,700కోట్ల విలువలువద్ద కంపెనీ పబ్లిక్‌ఇష్యూ చేపట్టింది. అంతకు ముందు వచ్చేనెల 3వ తేదీ యాంకర్ ఇన్వెస్టర్లకు బిడ్డింగ్ విండో తెరుస్తుంది. నవంబరు 12న స్టాక్ మార్కెట్‌లో లిస్ట్అవుతుంది. ఇష్యూలో భాగంగా 75శాతంషేర్లు అర్హతకలిగిన సంస్థాగత ఇన్వెస్టర్లకు 15శాతం, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు, పదిశాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించింది. తాజా ఇష్యూ రూపంలో రూ.1060 కోట్లు సమీకరిస్తుంది. ఆఫర్‌ఫర్‌సేల్ క్రింద 55.72 కోట్లు రాబడుతుంది. ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు తమతమ వాటాలు విక్రయిస్తారు. కంపెనీ వ్రమోటర్లు లలిత్‌కేసరి, హర్‌షజైన్; నీరజ్‌సింగ్, ఇషాన్ బన్సాల్ ఒక్కో మిలియన్‌షేర్లను విక్రయిస్తారు. పీక్ 15,పార్టనర్స్ ఇన్వెస్ట్‌మెంట్స్, వైసి హోల్డింగ్స్ 2, ర్యాబిట్ క్యాపిటల్5, జిడబ్ల్యు-ఇ, రిబ్బిట్ ఆపర్చునిటీ, ఇంటర్నెట్‌ఫండ్-6. సిటిఇ లిమిటెడ్, కౌఫ్‌మన్ ఫెలోస్ ఫండ్ ఎల్పీ సంస్థలు తమ వాటాలను విక్రయిస్తాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14